# ది క్రైమ్ న్యూస్

Crime News


తెలుగు దినపత్రిక

శుక్రవారం, ఏప్రిల్ 04, 2025 | సంపుటి - 20 | సంచిక 182 | వెల - 4రూ | పేజీలు - 12

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar.


## పీఎఫ్ ఖాతాదారులకు ప్రభుత్వం శుభవార్త

### ఇక ఉచితంగా నామినీ చేర్పులు, మార్పులు




న్యూఢిల్లీ : ప్రావిడెంట్ ఫండ్ పీపీఎఫ్ ఖాతాదారులకు కేంద్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. పీపీఎఫ్ ఖాతాలో నామినీ పేరును అప్ డేట్ చేయడానికి లేదా జోడించడానికి ఇకపై ఎటువంటి ఫీజు ఉండదని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. పీపీఎఫ్ లో నామినీ మార్చుకునేందుకు ఇకపై ఛార్జీలుండవు అని దీనికి సంబంధించిన నోటిఫికేషన్ ను కేంద్ర ప్రభుత్వం జారీ చేసింది. ఖాతాలలో నామినీ వివరాలను సవరించడం కోసం ఆర్థిక సంస్థలు ఛార్జీలు విధిస్తున్నాయని ఇటీవల తమ దృష్టికి వచ్చిందని ఆర్థిక మంత్రి తన పోస్ట్‌లో పేర్కొన్నారు. ప్రభుత్వ పొదుపు ప్రమోషన్ జనరల్ రూల్స్, 2018లో ఏప్రిల్ 2

మిగతా 2లో

# గచ్చీబౌలి భూములపై ప్రభుత్వానికి షాక్

### చెట్ల నరికివేతపై ధర్మాసనం సీరియస్

### చట్టాన్ని ఎలా చేతుల్లోకి తీసుకుంటారు

### ఎలాంటి పనులు చేపట్టవద్దన్న సుప్రీం ధర్మాసనం

**కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంపై సుప్రీంకోర్టు తీవ్రంగా స్పందించింది. సుమోటాగా కేసు స్వీకరించిన ధర్మాసనం.. ఆ భూముల్లో ఎలాంటి పనులు చేపట్ట వద్దంటూ స్టే విధించింది. తదుపరి ఆదేశాలు ఇచ్చే వరకూ తెలంగాణ ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోవద్దని ఆదేశించింది. కంచ గచ్చిబౌలి భూముల వివాదంపై ఉన్నత న్యాయస్థానం గురువారం విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వంపై జస్టిస్ గవాయ్ ధర్మాసనం సీరియస్ అయ్యింది. మూడ్రోజుల వ్యవధిలో వంద ఎకరాల్లో చెట్లు కొట్టేయడం మామూలు విషయం కాదని ధర్మాసనం అభిప్రాయపడింది. దీన్ని చాలా సీరియస్ అంశంగా పరిగణించింది.**




న్యూఢిల్లీ : చట్టాన్ని చేతుల్లోకి ఎలా తీసుకుంటారంటూ తెలంగాణ ప్రభుత్వాన్ని జస్టిస్ గవాయ్ ధర్మాసనం ప్రశ్నించింది. ఇది చాలా తీవ్రమైన అంశమని మండిపడింది. విచారణ సందర్భంగా తెలంగాణ హైకోర్టు రిజిస్ట్రార్ పంపిన మధ్యంతర నివేదికను ఉన్నత న్యాయస్థానం పరిశీలించింది. అలాగే మీడియా, పత్రికల్లో వచ్చిన కథనాలను సైతం జస్టిస్ గవాయ్ ధర్మాసనం ముందు అమికస్ క్యూరీ పరమేశ్వర్ ఉంచగా.. వాటినీ పరిశీలించింది. కాగా, ఈ కేసులో తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారిని సుప్రీంకోర్టు ప్రతివాదిగా చేర్చింది. ఇంత అత్యవసరంగా భూముల్లో చెట్లు- తొలగించి పనులు చేపట్టాల్సిన అవసరం ఎందుకు వచ్చిందని ప్రశ్నించింది. దీనిపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అఫిడవిట్ దాఖలు చేయాలని ఆదేశించింది. రాష్ట్ర ప్రభుత్వం గత నెల 15న నియమించిన కమిటీలోని అధికారులు సైతం

2లో



## రాజ్యసభకు చేరిన వక్ఫ్ సవరణ బిల్లు

### సభలో ప్రవేశపెట్టిన కేంద్రమంత్రి కిరణ్ రిజిజు

### సుదీర్ఘ చర్చ అనంతరం ఓటింగ్

### బిల్లు రాజ్యాంగంపై దాడి అన్న సోనియా

**సుదీర్ఘ చర్చ తర్వాత లోక్‌సభలో ఆమోదం పొందిన వక్ఫ్ సవరణ బిల్లును కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు గురువారం ఎగువసభలో ప్రవేశపెట్టారు. అనంతరం దీనిపై చర్చ ప్రారంభించారు. ఈ బిల్లుపై బుధవారం లోక్‌సభలో 14 గంటలకు పైగా చర్చ జరిగింది. విపక్షాల ఆరోపణలు, అధికార పక్షం కౌంటర్లతో సభ వాడీవేడిగా సాగింది. అనంతరం ఓటింగ్ ప్రక్రియ నిర్వహించగా. బిల్లుకు అనుకూలంగా 288 మంది, వ్యతిరేకంగా 232 మంది సభ్యులు ఓటు వేశారు. 56 ఓట్ల తేడాతో ప్రతిపక్షాల అభ్యంతరాలు వీగిపోయాయి. రాజ్యసభలోనూ దీనిపై చర్చ కోసం 8 గంటలు కేటాయించారు. అవసరమైతే సమయాన్ని పెంచనున్నారు. అనంతరం ఓటింగ్ చేపడతారు. ఎగువ సభలోనూ అధికార ఎన్డీయేకు స్వల్ప ఆధిక్యం ఉండటంతో బిల్లు గట్టెక్కడం లాంఛనమే అనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.**

న్యూఢిల్లీ : ఉభయ సభల్లో ఆమోదం పొందిన అనంతరం రాష్ట్రపతి సంతకంతో ఇది చట్టంగా మారనుంది. లోక్‌సభలో వక్ఫ్ సవరణ బిల్లు ఆమోదం పొందడంపై కాంగ్రెస్ అగ్ర నాయకురాలు సోనియాగాంధీ తీవ్రంగా స్పందించారు. రాజ్యాంగంపై నిస్సిగ్గుగా దాడి జరిగిందని అభిప్రాయపడ్డారు. గురువారం రాజ్యసభలోకి వెళ్లే ముందు సోనియాగాంధీ

2లో



## నెరవేరబోతున్న దశాబ్దాల కల

### అడవుల జిల్లాల్లో ఎయిర్‌పోర్టు

### పౌరవిమానాశ్రయానికి వాయుసేన గ్రీన్‌సిగ్నల్

### బీజేపీ ఎమ్మెల్యే పాయల్ శంకర్, ఎంపీ నగేష్ కేంద్రానికి ప్రత్యేక కృతజ్ఞతలు

**ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న రోజు రానే వచ్చింది. దశాబ్దాలుగా ఎదురు చూస్తున్న విమానాశ్రయ కల నెరవేరబోతోంది. అడవుల జిల్లా ఆదిలాబాద్‌లో త్వరలోనే విమానం ఎగరబోతోంది. ఆదిలాబాద్ పౌరవిమానాశ్రయానికి వాయుసేన గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో అటు ప్రజలు ఇటు పార్టీలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. ఆరు నెలల వ్యవధిలోనే రెండు ఎయిర్‌పోర్టులకు అనుమతులు సాధించడం తెలంగాణ ప్రభుత్వం చేస్తున్న అవిశ్రాంత కృషికి దక్కిన ఫలితమని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి హర్షం వ్యక్తం చేయగా, ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నామని బీజేపీ ఎమ్మెల్యే పాయల్ శంకర్, ఎంపీ నగేష్ కేంద్ర ప్రభుత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.**

హైదరాబాద్ : ఆదిలాబాద్ విమానాశ్రయాన్ని అభివృద్ధి చేసి, పౌరవిమాన సేవలను అందుబాటులోకి తీసుకు రావాలని తెలంగాణ ప్రభుత్వం చేసిన అభ్యర్థనకు ఇండియన్ ఎయిర్ ఫోర్స్ ఓకే చెప్పింది. విమానాశ్రయంతో పాటు వాయుసేన శిక్షణా కేంద్రాన్ని నెలకొల్పే అవకాశాలను పరిశీలిస్తున్నట్లు లేఖలో తెలిపింది. ఈ శుభవార్తతో ఆదిలాబాద్ ప్రజానీకం మురిసిపోతోంది. పార్టీలకు అతీతంగా ఆదిలాబాద్ విమానశ్రయ ఏర్పాటు అంశంపై హర్షం వ్యక్తమవుతోంది.

2లో



## పార్టీ మారిన ఎమ్మెల్యేల కేసు

### ముగిసిన ఇరుపక్షాల వాదనలు

### తీర్పు రిజర్వ్ చేసిన సుప్రీం ధర్మాసనం

న్యూఢిల్లీ : తెలంగాణలో పార్టీ మారిన పదిమంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేల వ్యవహారంపై విచారణ పూర్తయ్యింది. సుప్రీం తీర్పును రిజర్వ్ చేసింది. ఎమ్మెల్యేలు పార్టీ మారిన వ్యవహారంపై గురువారం ఉదయం సుప్రీంకోర్టులో విచారణ జరిగింది.

# రాష్ట్రంలో పలుచోట్ల వర్షం

### ఉరుములు,మెరుపులతో భారీ వాన

### పాలమూరు జిల్లాలో పిడుగుపాటుకు ఇద్దరు మృతి

### హైదరాబాద్‌లో భారీ వర్షంతో పలు ప్రాంతాలు జలమయం

### ట్రాఫిక్ జామ్‌లతో వాహనదారుల ఇక్కట్లు

### అధికారులను అప్రమత్తంచేసిన సిఎం రేవంత్

### నగరంలో తక్షణ చర్యలు చేపట్టాలన్న మంత్రి పొన్నం



హైదరాబాద్ : రాష్ట్రంలోని పలు జిల్లాలో పిడుగులు, మెరుపులతో అకాల వర్షం కురిసింది. మహబూబ్‌నగర్ జిల్లాలో పిడుగుపడి ఇద్దరు మృతి చెందగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. అమ్రాబాద్ ఉమ్మడి మండలంలోని పదర కోడోనిపల్లి గ్రామంలో గురువారం మధ్యాహ్నం పిడుగుపడింది. కండ్లగుంట గ్రామ సమీపంలో వేరుశనగ పంట పొలాల్లో కూలి పనులు చేస్తుండగా పిడుగుపడి సుంకరి సైదమ్మ, వీరమ్మ అనే కూలీలు అక్కడికక్కడే మృతి చెందగా సుంకరి లక్ష్మమ్మకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో గ్రామంలో విషాదఛాయలు నెలకొని ఉన్నాయి. గత కొన్ని రోజులుగా ఉక్కపోతతో ఇబ్బంది పడుతున్న హైదరాబాద్ నగరవాసులను వరుణుడు పలకరించాడు. హైదరాబాద్‌లోని పలు ప్రాంతాలో వర్షం కురిసింది.

మిగతా 2లో

## బిసి గర్జనకు రాహుల్ వస్తాడని చెప్పలేదు

### అయినా కాంగ్రెస్ అగ్రనేత మద్దతు ఉంది

### డిల్లీ బిసి గర్జన సభపై పిసిసి చీఫ్



హైదరాబాద్ : తెలంగాణ రాజకీయాల్లో కీలకంగా మారిన బీసీ రిజర్వేషన్లపై టీపీసీసీ నేత మహేష్ గౌడ్ స్పందించారు. రాహుల్ గాంధీ బీసీ గర్జనకు హాజరవుతారని కాంగ్రెస్ ఎప్పుడు ప్రకటించ లేదని స్పష్టం చేశారు.

## హెచ్‌సీయూ భూములపై మొండి వైఖరి వీడాలి

### హైకోర్టు చీవాట్లు పెడుతున్నా.. రేవంత్ బుద్ధి మారటం లేదు

### మాజీ మంత్రి కేటీఆర్ ఆగ్రహం

**హెచ్‌సీయూ భూముల వేలంపై సీఎం రేవంత్‌రెడ్డి మొండివైఖరిని వీడనాడాలని మాజీమంత్రి కేటీఆర్ అన్నారు. తెలంగాణ హై కోర్టు చీవాట్లు పెడుతున్నా రేవంత్ ప్రభుత్వం తీరు మారదా అని ప్రశ్నల వర్షం కురిపించారు. గురువారం తెలంగాణ భవన్‌లో కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. సీఎం అంటే బాస్ కాదు ప్రజా సేవకుడని అన్నారు. అర్ధరాత్రి బుల్డోజర్లతో హెచ్‌సీయూ యూనివర్సిటీలోకి ఎందుకు వెళ్తున్నారని ప్రశ్నించారు. ఇప్పటికే హైడ్రాపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసిందని చెప్పారు. భూముల వివాదంలో విద్యార్థులను మంత్రులు చులకనగా మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు.**



హైదరాబాద్ : ఫ్యూచర్ సిటీకి 14 వేల ఎకరాలు ఉండగా హైదరాబాద్‌లో ఉన్న భూమిని ఎందుకు తీసుకుంటున్నారని నిలదీశారు. హెచ్‌సీయూ లో వన్యప్రాణులు లేవని ఎలా చెబుతారని కేటీఆర్ ప్రశ్నించారు. దయచేసి కంచె గచ్చిబౌలి 400 ఎకరాలను ఎవరు కొనవద్దని అన్నారు. ఇప్పుడు కంచె గచ్చిబౌలి భూములను ఎవరు కొన్న ఇబ్బందులు పడాల్సివస్తుందని కేటీఆర్ చెప్పారు. మూడేళ్లలో వచ్చేది తమ ప్రభుత్వమేనని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. కంచ గచ్చిబౌలిలో 400 ఎకరాలపై ఇదే తమ కమిట్మెంట్ అని స్పష్టం చేశారు. తాము అధికారంలోకి వచ్చాక అతిపెద్ద ఎకో పార్క్ ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. ఎవరైనా ఆ భూములు కొంటే మళ్లీ వెనక్కు

2లో



## వైకాపా కుటిల రాజకీయాలపై అప్రమత్తంగా ఉండాలి

### పాస్టర్ ప్రవీణ్ మరణంపై దమారమే ఇందుకు నిదర్శనం

### పల్లె నిద్రతో ప్రజా సమస్యలు గుర్తించండి

### కేబినేట్ భేటీ తరవాత మంత్రులతో సిఎం చంద్రబాబు

అమరావతి : రాజకీయ లబ్ది కోసం బట్టకాల్చి మీద వేసే చర్యలకు వైకాపా దిగుతోందని, ఇలాంటి వాటిపట్ల అప్రమత్తంగా ఉండాలని మంత్రులను సిఎం చంద్రబాబు హెచ్చరించారు. అలాగే పల్లె నిద్రతో ప్రజల సమస్యలు తెలుసుకోవాలన్నారు. ఇకపోతే పాస్టర్ ప్రవీణ్ మరణం విషయంలో ప్రభుత్వానికి చెడ్డపేరు తేవాలని వైసీపీ చూస్తోందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విమర్శించారు. కేబినెట్ సమావేశం అనంతరం మంత్రులతో ప్రత్యేకంగా భేటీ అయిన సీఎం.. పలు రాజకీయ అంశాలను ప్రస్తావించారు.

2లో

# పీఎఫ్ ఖాతాదారులకు ప్రభుత్వం శుభవార్త

2025 నాటి గెజిట్ నోటిఫికేషన్ ద్వారా అవసరమైన మార్పులు చేయబడ్డాయి, ఖాతాలకు నామినీల మార్పుపై ఛార్జీని తొలగించడం జరిగింది. గెజిట్ నోటిఫికేషన్ ద్వారా.. చిన్న పొదుపు పథకాలకు నామినేషన్ రద్దు లేదా మార్పు కోసం రూ. 50 రుసుము రద్దు చేయబడిందని నిర్మలా సీతారామన్ అన్నారు. పార్లమెంటు–లో ఆమోదించబడిన బ్యాంకింగ్ సవరణ బిల్లు 2025 నిబంధనల ప్రకారం, ఇప్పుడు బ్యాంకు ఖాతాదారుల డబ్బు, లాకర్ల చెల్లింపు కోసం నలుగురు వ్యక్తులను నామినీలుగా చేర్చుకోవడానికి అనుమతిస్తుందని ఆర్థిక మంత్రి అన్నారు.

# రాజ్యసభకు చేరిన వక్ఫ్ సవరణ బిల్లు

మీడియాతో మాట్లాడారు. సమాజంలో శాశ్వత విభజనను తీసుకొచ్చేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని.. అందులో భాగంగానే వక్ఫ్ బిల్లును ఆమోదించినట్లు–గా వ్యాఖ్యానించారు. దిగువ సభలో బిల్లును బుల్డోజర్ చేశారని చెప్పారు. అలాగే వన్ నేషన్ వన్ ఎలక్షన్ బిల్లును కూడా రాజ్యాంగాన్ని అపహాస్యం చేసేందుకే సభలోకి తీసుకొస్తున్నారని సోనియాగాంధీ ధ్వజమెత్తారు. మోడీ నిర్ణయాలు కారణంగా దేశం అగాధంలోకి నెట్టబడుతోందని.. ఈ నిర్ణయాలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. రాజ్యాంగం కాగితంపైనే ఉంటుంది.. అందుకే దాన్ని బుల్డోజర్ చేయడమే బీజేపీ లక్ష్యమని పేర్కొన్నారు. న్యాయం కోసం ఎంపీలంతా కలిసి పోరాడాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ఇక పార్లమెంట్ ఉభయ సభల్లో ప్రతిపక్షాలకు మాట్లాడే అవకాశమే ఇవ్వడం లేదని.. తరచుగా గందరగోళం సృష్టిస్తున్నారని ఆరోపించారు. వక్ఫ్ సవరణ బిల్లుకు లోక్‌సభలో ఆమోదం లభించింది. బుధవారం బిల్లుపై పార్లమెంట్‌లో వాడీవేడీగా చర్చ జరిగింది. దాదాపు 12 గంటల పాటు– అధికార–ప్రతిపక్ష సభ్యులు ప్రసంగించారు. అర్ధరాత్రి దాటిన తర్వాత బిల్లు ఆమోదం కోసం లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా ఓటింగ్ నిర్వహించారు. బిల్లుకు అనుకూలంగా ఓటింగ్ పడడంతో ఆమోదం పొందింది. బిల్లుకు అనుకూలంగా 282 మంది ఓటు– వేయగా.. 232 మంది సభ్యులు బిల్లును వ్యతిరేకించారు. ఇక గురువారం ఈ బిల్లు రాజ్యసభకు రానుంది. ఇక్కడ కూడా దాదాపు 8 గంటల పాటు–చర్చ జరగనుంది. వక్ఫ్ పాలకవర్గాల్లో మరింత పారదర్శకత, జవాబుదారీతనం పెంచుతూ పాలనలో మహిళల భాగస్వామ్యం తప్పనిసరి చేసేలా ఈ కొత్త బిల్లును కేంద్రం తీసుకొచ్చింది. ఈమేరకు 1995 నాటి వక్ఫ్ చట్టంలో దాదాపు 40 సవరణలు చోటుచేసుకోనున్నాయి. ముస్లిం సమాజం నుంచి వస్తున్న డిమాండ్ల మేరకే ఈ మార్పులు చేస్తున్నట్లుప్రభుత్వ వర్గాలు చెప్పాయి. ఈ బిల్లును గతేడాది ఆగస్టులోనే కేంద్రం లోక్‌సభలో ప్రవేశపెట్టింది. అప్పుడు దీనిపై విపక్షాల నుంచి పెద్దఎత్తున వ్యతిరేకత రావడంతో దీనిని సంయుక్త పార్లమెంటరీ కమిటీ– (జేపీసీ) పరిశీలనకు పంపింది. ఈ కమిటీ పలు ప్రతిపాదనలతో బిల్లుకు ఆమోదం తెలిపింది.

# హెచ్‌సీయూ భూములపై మొండి వైఖరి వీడాలి

తీసుకుంటామని తేల్చిచెప్పారు. అద్భుతమైన పార్క్‌గా మార్చి హెచ్‌సీయూకు కానుకగా ఇస్తామని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానిది రియల్ ఎస్టేట్ ఆలోచన అని విమర్శించారు. హెచ్‌సీయూ భూములపై ప్రభుత్వం వెనక్కి తగ్గకపోతే తాము ఉద్యమం చేస్తామని హెచ్చరించారు.ప్రభుత్వ భూములంటే ప్రజలవి.. సీఎం ధర్మకర్త మాత్రమేనని అన్నారు. ప్రభుత్వ భూములను కాపాడాల్సిందిపోయి..ప్రభుత్వ పెద్దలు ఇష్టమొచ్చినట్లుగా చేస్తామంటే కుదరదని కేటీఆర్ హెచ్చరించారు. తెలంగాణ ధీరుడు దొడ్డి కొమరయ్య జయంతి సందర్భంగా తెలంగాణ భవన్‌లో కేటీఆర్ ఘన నివాళులు అర్పించారు. తెలంగాణ సాయుధ పోరాటానికి దొడ్డి కొమురయ్య స్ఫూర్తి అని కేటీఆర్ తెలిపారు. నిరంకుశత్వానికి ఎదురొడ్డి పోరాడి అమరత్వం పొందిన కొమురయ్య తెలంగాణ సమాజంలోని పోరాటతత్వానికి నిదర్శనమని ఉద్ఘాటించారు. భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి నుంచి విముక్తి కోసం తన ప్రాణాలను పణంగా పెట్టారని కేటీఆర్ అన్నారు.

# వైకాపా కుటిల రాజకీయాలపై అప్రమత్తంగా ఉండాలి

ప్రవీణ్ మరణానికి సంబంధించి సీసీ కెమెరాల్లో ఒక్కో అంశం బయటకు వస్తోందన్నారు. ప్రవీణ్ డెత్ మిస్టరీ ఛేదనలో సీసీ కెమెరాలది కీలక పాత్ర అని చెప్పుకొచ్చారు. మనం అప్రమత్తంగా లేకుంటే.. బాబాయ్ గొడ్డలి, కోడికత్తి, గులకరాయి తరహాలో అన్నీ మనపైనే వేస్తారని అన్నారు. చేసిన మంచి చెప్పుకోవడానికి ఇబ్బందులు పడుతుంటే లేని నిందలు మనపై వేసే కుట్రలు చేస్తున్నారని మండిపడ్డారు. సోషల్ మీడియాలో మంచి ఉద్దేశంతో పోస్టులు పెడుతుంటే వాటిని వక్రీకరించి చెడు సందేశాలను వ్యాప్తి చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అన్నింటిపై అప్రమత్తంగా ఉంటూ కుట్రలను తిప్పికొడదామని మంత్రులకు సీఎం సూచించారు. గత వైసీపీ ప్రభుత్వం ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాలను ఆప్కాస్ ద్వారా దుర్వినియోగం చేసిందని విమర్శించారు. విచ్చలవిడి నియామకాలతో వ్యవస్థలను నాశనం చేశారన్నారు. ఒక టీటీడీలోనే 4వేల మంది ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులున్నారని తెలిపారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాలకు సరైన విధివిధానాలు అవసరమన్నారు. కేబినెట్ సబ్ కమిటీ ఏర్పాటు చేసి ఔట్ సోర్సింగ్ నియామకాలను సక్రమ పద్ధతికి తీసుకొద్దామని తెలిపారు. స్వర్ణ గ్రామం పేరుతో ఉన్నతాధికారులు పల్లె నిద్ర చేయాలి అని సీఎం ఆదేశించారు. ఉన్నతాధికారులు 3 రోజులు, 2 రాత్రులు పల్లెనిద్ర చేయాలని నిర్ణయించారు. ఇంత చేసి సరైన ప్రచారం చేసుకోలేక పోతున్నాం అని కేబినెట్ అనంతరం సీఎం అన్నట్లు– తెలుస్తోంది. కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న కర్మయోగి–ట్రైనింగ్ ప్రోగ్రామ్‌పై కేబినెట్‌లో చర్చించారు. విజన్ 2047పైన మంత్రులతో చర్చించారు. శాఖలకు స్వయంప్రతిపత్తి కల్పించే దిశగా ఆప్కాస్‌ను ఎలా వినియోగించాలి, ఆప్కాస్ పైన మంత్రివర్గ ఉప సంఘం ఏర్పాటు– చేసే యోచనపై క్యాబినెట్‌లో సుదీర్ఘంగా చర్చించినట్లు– తెలుస్తోంది. ఋషికొండ ప్యాలెస్‌ను వినియోగంలోకి ఎలా తీసుకురావాలి అనే అంశంపై చర్చించాలని తెలిపారు. మంత్రులు, ప్రజా ప్రతినిధులు ఋషికొండ ప్యాలెస్‌ను సందర్శించి అభిప్రాయలు చెప్పాలని మంత్రులతో ముఖ్యమంత్రి అన్నారు.

# థాయ్‌లాండ్, శ్రీలంకలో పర్యటన

## బ్యాంకాక్ చేరుకున్న ప్రధాని మోడీ

న్యూఢిల్లీ : ప్రధాని మోడీ బ్యాంకాక్ చేరుకున్నారు. అక్కడ ఘనస్వాగతం లభించింది. రెండు దేశాల పర్యటన కోసం గురువారం బయల్దేరి వెళ్లారు. గురువారం నుంచి థాయ్‌లాండ్, శ్రీలంకలో పర్యటించనున్నారు. థాయ్‌లాండ్ రాజధాని బ్యాంకాక్ ఎయిర్‌పోర్టులో దిగగానే మోడీకి ఘనస్వాగతం లభించింది. థాయ్‌లాండ్ అధికారులతో పాటు భారతీయులు భారీ స్వాగతం పలికారు. తొలుత రెండు రోజుల పాటు థాయ్‌లాండ్‌లో మోడీ పర్యటించనున్నారు. థాయ్‌లాండ్‌లో 6వ బిమ్‌స్టెక్ శిఖరాగ్ర సమావేశంలో మోడీ పాల్గొనన్నారు. పర్యటనలో భాగంగా థాయ్‌లాండ్ ప్రధాని పేటోంగ్‌టార్న్ షినవత్రాతో కూడా భేటీ అయి ఇరు దేశాల ద్వైపాక్షిక సంబంధాలపై చర్చించనున్నారు. ఇక సాయంత్రం బిమ్‌స్టెక్ సదస్సులో మోడీ పాల్గొంటారు. ఈ సదస్సులో భారత్‌తో పాటు– థాయ్‌లాండ్, బంగ్లాదేశ్, శ్రీలంక, నేపాల్, మయన్మార్, భూటాన్ దేశాల అధినేతలు పాల్గొననున్నారు. ఇక ఈ సదస్సులో సాంకేతిక, ఆర్థిక సహకారంపై చర్చించనున్నారు.

# రాష్ట్రంలో పలుచోట్ల వర్షం

దీంతో నగర వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. హిమయత్‌నగర్, కోఠి, అమీర్‌పేట, బోరబండ, జూబ్లీహిల్స్, ఎల్బీనగర్, హయత్‌నగర్, మేడ్చల్, విద్యానగర్, కోఠి, అబిడ్స్ తదితర ప్రాంతాల్లో ఓ మోస్తరు వర్షం కురిసింది. పలు చోట్ల ట్రాఫిక్ జామ్ అయ్యింది. ఖైరతాబాద్‌లోని మెర్క్యురీ హోటల్ వద్ద ఓ కారుపై చెట్టు కూలింది. ఈ ఘటనలో ఇద్దరు మహిళలు సురక్షితంగా బయటపడ్డారు. అకాల వర్షంతో హైదరాబాద్ మహానగరంలోని పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. రాష్ట్ర సచివాలయం ముందుభాగం చెరువును తలపిస్తోంది. ఛార్మినార్‌లోని ఓ మినార్‌పై నుంచి కొంత మట్టి కిందపడింది. ఈ ఘటనలో ఎలాంటి నష్టం వాటిల్లలేదు. వివిధ చోట్ల రోడ్లపై వర్షపు నీరు ప్రవహిస్తోంది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మలక్‌పేట వంతెన వద్ద వరదనీరు నిలిచిపోయింది. రాజ్‌భవన్ రోడ్డుపై వరద నీరు ప్రవహిస్తుండటంతో ట్రాఫిక్ నిలిచిపోయింది. తెలుగుతల్లి ఫ్లైఓవర్ కింద భారీగా నీరు చేరింది. పలుచోట్లు– చెట్లు– కూలిపోయాయి. స్తంభాలు ఒరిగిపోయాయి. ఖైరతాబాద్–పంజాగుట్ట మధ్య వాహనాల రాకపోకు నిలిచిపోయాయి. హైదరాబాద్ నగరంలో భారీ వర్షాలు పడుతున్న ప్రాంతాల్లో అధికారులు అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. ప్రజలకు ఎక్కడా ఇబ్బంది లేకుండా తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. భారీ వర్షం, ఈదురుగాలులతో రాజధాని హైదరాబాద్ నగరంలో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. అన్ని శాఖల అధికారులను అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షించాలని సీఎస్‌ను ముఖ్యమంత్రి ఆదేశించారు. లోతట్టు–ప్రాంతాల్లో ప్రజలు ఇబ్బంది పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రోడ్ల పై నీటి నిల్వలు లేకుండా ట్రాఫిక్ సమస్య, విద్యుత్ అంతరాయాలు లేకుండా జీహెచ్‌ఎంసీ, పోలీస్, హైడ్రా, విభాగాలు సమన్వయంతో పని చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. విద్యుత్ సరఫరా నిలిచిపోయిన ప్రాంతాల్లో వెంటనే సమస్యను పరిష్కరించి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాలని ఆదేశించారు. లోతట్టు ప్రాంతాల్లో జలమయమైన కాలనీల్లో ప్రజలకు అవసరమైన సహాయక చర్యలు చేపట్టాలని సూచించారు. ట్రాఫిక్ సమస్యను సాధ్యమైనంత త్వరగా క్లియర్ చేసి వాహనదారులు త్వరగా ఇళ్లకు చేరుకునేలా చూడాలని పోలీసు అధికారులను ఆదేశించారు. వివిధ శాఖల అధికారులు, సిబ్బంది చేపట్టే సహాయక చర్యల్లో భాగస్వాములు కావాలని ఆదేశించారు. జిల్లాల్లో కూడా వర్షాలు, ఈదురుగాలులు, వడగండ్లు పడుతున్నందున జిల్లాల కలెక్టర్లు, పోలీసు అధికారులు, అన్ని శాఖల అధికారులను అప్రమత్తం చేయాలని ఆదేశించారు. ఉపరితల ఆవర్తన ప్రభావంతో హైదరాబాద్ లో ఒక్కసారిగా భారీ వర్షం కురవడంతో ప్రజలకు ఇబ్బందులు లేకుండా అన్ని జాగ్రత్త చర్యలు చేపట్టాలని హైదరాబాద్ ఇన్చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ జీహెచ్‌ఎంసీ అధికారులను ఆదేశించారు. జీహెచ్ ఎంసీ పరిధిలోని ఆరు జోన్లలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఎర్రమంజిల్ ప్రాంతంలో చెట్టు–కూలడంతో ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా డీఆర్‌ఎఫ్, జీహెచ్‌ఎంసీ ఐఆర్టీ టీమ్స్ వాటిని క్లియర్ చేసింది. సెక్రటేరియట్, రాజ్ భవన్ రోడ్, మసబ్ ట్యాంక్ పరిసర ప్రాంతాలతో పాటు– నగరంలో ఉన్న వాటర్ లాగింగ్ పాయింట్స్ వద్ద జీహెచ్‌ఎంసీ ఇంజనీరింగ్ అధికారులు వెంట వెంటనే నీటిని తొలగించాలని ఆదేశించారు. ప్రధాన రోడ్లపై వరద ప్రభావం వల్ల ట్రాఫిక్ ఏర్పడిందని అరగంటలోపు వాటర్ క్లియర్ చేస్తామని అధికారులు తెలిపారు. డ్రైనేజీ పొంగిపొర్లకుండా రఫూశి జెట్టింగ్ మిషన్స్ ద్వారా అరికడుతున్నారు. పోలీస్, జీహెచ్‌ఎంసీ, వాటర్ బోర్డు, విద్యుత్ అధికారులు సమన్వయం చేసుకొని వర్ష ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

# నెరవేరబోతున్న దశాబ్దాల కల

మామునూరు ఏర్పాటు తరహాలోనే ఆదిలాబాద్ ఎయిర్ పోర్ట్ అనుమతుల ఘనత మాదంటే మాదంటున్నాయి అధికార, ప్రతిపక్షాలు. ఏది ఏమైనా దశాబ్దాల కల నెరవేరబోతుండటంతో ఇన్నాళ్లకైనా అడవుల జిల్లాకు మంచి రోజులు రాబోతున్నాయని ఆనందం వ్యక్తం చేస్తోంది జిల్లా ప్రజానికం. ఆదిలాబాద్ విమానశ్రయ కల ఇప్పటి కాదు..స్వాతంత్ర్యానికి ముందే ఇక్కడ విమానాలు ఎగిరిన ఘన చరిత్ర జిల్లా సొంతం. నిజాం కాలంలో యుద్ధవిమానాలకు ఊపిరిపోసిన చరిత్ర ఆదిలాబాద్‌కు ఉంది. 1930లోనే యుద్ధభూమికి వెళ్లే యుద్ధ విమానాలకు ఇంధనం నింపడానికి ఏకంగా 369 ఎకరాల భూమిలో ఏరోడ్రోమ్‌ను స్థాపించారు అప్పటి నిజాం రాజులు. 1947లో స్వాతంత్ర్యానంతరం ఈ ఏరోడ్రమ్ భారత వైమానిక దళం నియంత్రణలోకి వెళ్లాయి. 1970 చివరి వరకు పైలట్లకు శిక్షణ ఇవ్వడానికి ఉపయోగించే హెలికాప్టర్లకు ఇంధనం నింపే కేంద్రంగా ఉపయోగించారు. 2014లో ఏరోడ్రోమ్‌ను పూర్తి స్థాయి వైమానిక దళ స్టేషన్‌గా మార్చాలని %ౡాఖీ% ప్రతిపాదించింది. అదిగో అప్పటినుండి ఇప్పటి దాకా ఆ ఏరోడ్రమ్ లో ఎప్పుడెప్పుడు విమానం ఎగురుతుందా.. మా జిల్లా తలరాత ఎప్పుడు మారుతుందా అని ఎదురు చూడటం తప్ప, కల సాకారమయ్యే ఆశ కనిపించడం లేదంటూ ఆవేదన వ్యక్తం చేస్తూ వచ్చింది జిల్లా ప్రజానీకం. ఎట్టకేలకు వాయి సేన గ్రీన్ సిగ్నల్ తో ఆకాశమంతా ఆశలను మోసుకొచ్చినట్టైంది. 2017లో ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ఏరోడ్రోమ్‌ను ఆనుకుని ఉన్న కచ్కంటి, ఖానాపూర్, తంతోలి, అనుకుంట గ్రామాల పరిధిలో 1,592 ఎకరాల భూమిని రెవెన్యూ అధికారులు గుర్తించడంతో విమానశ్రయ ఆశలకు ఊపిరిపోసినట్టైంది. 2018లో ఇదే హామీని ఎన్నికల్లో తెర మీదకి తెచ్చిన బీజేపీ, ఎంపీ స్థానాన్ని కైవసం చేసుకుంది. దీంతో 2019లో ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో విమానాశ్రయం ఏర్పాటుకు ఉన్న పరిస్థితులపై ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా డిప్యూటీ మేనేజర్ అమిత్ కుమార్, అసిస్టెంట్ జనరల్ మేనేజర్ నీరజ్ గుప్తాలతో కూడిన బృందం సర్వే చేసి ఓ రిపోర్ట్ ను కేంద్రానికి పంపింది. తాజాగా 2023 లోను బీజేపీ ఎన్నికల హామీలోకి చేరిన విమానశ్రయ ఏర్పాటు తాజాగా ఎయిర్ క్రాఫ్ట్ కు కేంద్రం, వాయిసేన గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో ఆదిలాబాద్ జిల్లా వాసుల కల నెరవేరే సమయం ఆసన్నమైంది. విమానాశ్రయం ఏర్పాటుకోసం ఇప్పటికే ఆదిలాబాద్ శివారులో 369 ఎకరాలు విమానాశ్రయ భూములు ఉన్నాయి. వీటితో పాటు ఎయిర్ స్ట్రిప్ నిర్మాణానికి ఆదిలాబాద్ శివారులోని ఖానాపూర్‌లో 481.16 ఎకరాల పట్టా భూములు, 50 ఎకరాల అసైన్డ్ భూములు, అనుకుంటలో 535.38 ఎకరాల పట్టా భూములు, 34.04 ఎకరాల అసైన్డ్ భూములు, తంతోలిలో 261.27 ఎకరాల పట్టా భూములు, 5.02 ఎకరాల అసైన్డ్ భూములు కేటాయించాలన్న ప్రతిపాదనలు ఉన్నాయి. మొత్తంగా 1590 ఎకరాల్లో విమానశ్రయాన్ని నిర్మాణం చేయాలని అధికారులు 2019 లోనే కేంద్రానికి రిపోర్ట్ పంపించారు. విద్యుత్, నీరు, రోడ్లు, భవనాల కోసం 40 కోట్ల నిధులు అవసరమవుతాయని అధికారులు అంచనా వేశారు. 2019కి ముందు నుండే ఈ ప్రాంతంలో బహుళ అంతస్తుల భవనాల నిర్మాణానికి అనుమతులు నిలిపేశారు. ఎయిర్‌ఫోర్స్ విభాగం అధికారులు కూడా ఇప్పటికే 12 సార్లు పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లాలో విమానాశ్రయం నెలకొల్పితే ఉత్తర తెలంగాణలోని ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్ జిల్లాలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని.. అంతర్జాతీయ స్థాయిలో ఈ మూడు జిల్లాలకు గుర్తింపు వస్తుందని.. ఉత్తర భారతంతో తెలంగాణకు రాకపోకలు పెరిగి వ్యాపారంతో పాటు ఉన్నతాధికారులు, జాతీయ నాయకుల తాకిడి పెరుగుతుందని అంతా కోరుకుంటున్నారు. ఇటీవల ఎంపీ నగేశ్ ఇటీవల పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడిని కలిసి వినతి పత్రం అందించడం.. అటు రాష్ట్ర ప్రభుత్వం తరుపున సీఎం రేవంత్ రెడ్డి కేంద్రాన్ని పలు మార్లు ఆదిలాబాద్ ఎయిర్ పోర్ట్ కు అనుమతులు ఇవ్వాలంటూ కోరడం.. శాసన సభలో ఆదిలాబాద్ విమానశ్రయ అంశాన్ని లేవనెత్తడం జరిగాయి. ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ సైతం ఆదిలాబాద్ అభివృద్ధికి, విమానాశ్రయ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం కలిసిరావాలని కోరడం.. అందరూ ఆశించినట్టుగానే కేంద్రం నుండి ఆదిలాబాద్ విమానాశ్రయ ఏర్పాటుపై సానూకూల ప్రకటన రావడంతో అన్నీ అనుకున్నవి అనుకున్నట్టుగా జరిగితే త్వరలోనే ఆదిలాబాద్ ఎయిర్ పోర్ట్ ఆశలు నెరవేరినట్టే.

# పార్టీ మారిన ఎమ్మెల్యేల కేసు

ఇదే అంశంపై బుధవారం కూడా సుదీర్ఘవిచారణ జరిగింది. ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం తీర్పును రిజర్వ్ చేసింది. స్పీకర్ తరఫున సీనియర్ కౌన్సిల్ ముకుల్ రోహత్గీ వాదనలు వినిపించారు. గురువారం స్పీకర్ కార్యదర్శి తరఫున సింఘ్వి వాదనలు వినిపించారు. స్పీకర్ కార్యదర్శి తరఫున అభిషేక్ మను సింఘ్వి వాదనలు వినిపించారు. స్పీకర్ నిర్ణయానికి కాలపరిమితి విధించే విషయంలో ఇప్పటి వరకు ఎలాంటి తీర్పులు లేవని సింఘ్వి తెలిపారు. మణిపూర్ వ్యవహారం పూర్తిగా భిన్నమైనదని, ఆ ఒక్క విషయాన్ని ప్రత్యేకంగా పరిగణించారని అన్నారు. అలాగే రాణా కేసు పూర్తిగా ప్రత్యేకమైనదని, ప్రస్తుత ఆ అంశానికి సరిపోదని సింఘ్వి కోర్టుకు తెలిపారు. దీంతో రాణా కేసులో కోర్టు జోక్యం చేసుకుని అనర్హత విధించిందని జస్టిస్ గవాయ్ తెలిపారు. మీ దృష్టిలో రీజనబుల్ టైమ్ అంటే ఏంటి అని సింఘ్విని జస్టిస్ గవాయ్ ప్రశ్నించారు. న్యాయవాదులు ఇలాంటి కేసుల విషయంలో వ్యవహరించే విధానం చాలా ఇబ్బందికరంగా ఉందన్నారు. సుప్రీంకోర్టుకు వచ్చిన తర్వాత న్యాయవాదుల తీరు పూర్తిగా మారిపోతోందని జస్టిస్ గవాయ్ పేర్కొన్నారు. ఇటీవల సీఎం అసెంబ్లీలో మాట్లాడిన మాటలను కౌశిక్ రెడ్డి తరపు న్యాయవాది మరోసారి ప్రస్తావించారు. తెలంగాణలో ఉప ఎన్నికలు రావని, స్పీకర్ తరపున కూడా చెపుతున్నా అంటూ సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను న్యాయవాది ప్రస్తావించారు. అసెంబ్లీలో మాట్లాడితే ఏ కోర్టు నుంచి అయినా రక్షణ ఉంటుందని వ్యాఖ్యానించారని న్యాయవాది అన్నారు. దీంతో ముఖ్యమంత్రి కనీసం స్వీయ నియంత్రణ పాటించలేరా అని జస్టిస్ గవాయ్ ప్రశ్నించారు. గతంలో కూడా ఇలాంటి ఘటనే జరిగిందని, ఆ తర్వాత కూడా ఇలాగే వ్యవహరిస్తే ఎలా అని జస్టిస్ గవాయ్ అన్నారు. దీంతో అభిషేక్ మను సింఘ్వి మాట్లాడుతూ ప్రతిపక్షం నుంచి అంతకు మించిన రెచ్చగొట్టే వ్యాఖ్యలు ఉన్నాయన్నారు. ఇప్పుడు అవన్నీ అప్రస్తుతం అని ధర్మాసనం పక్కన పెట్టింది. సీఎం మాటలు కోర్టు దిక్కారం కింద తీసుకోవాల్సి వస్తుందని జస్టిస్ గవాయ్ అన్నారు. మేము సంయమనం పాటిస్తున్నామని, మిగతా రెండు వ్యవస్థలు అదే గౌరవంతో ఉండాలని జస్టిస్ గవాయ్ వ్యాఖ్యానించారు. స్పీకర్‌కు పిర్యాదు చేసిన తర్వాత కోర్టులో కేసులతో తీవ్రస్థాయిలో ఒత్తిడి తీసుకురావాలని చూసారని సింఘ్వి అన్నారు. సింగిల్ జడ్జి ఇచ్చిన సూచనలను సానుకూలంగా తీసుకుని ఉంటే కేసు ఇక్కడివరకు వచ్చేది కాదని జస్టిస్ గవాయ్ అభిప్రాయపడ్డారు. సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసి విచారణకు వచ్చిన తర్వాతే నోటీసులు ఇచ్చారని గవాయ్ అన్నారు. ఈ క్రమంలో మణిపూర్ వ్యవహారం, రాణా కేసుతో పాటు మరికొన్ని అంశాలను అభిషేక్ సింఘ్వి కోర్టుకు వివరిస్తూ వాదనలు ముగించారు. అభిషేక్ మను సింఘ్వి వాదనలు ముగియడంతో.. పిటీషనర్ల తరపున కౌశిక్ రెడ్డి తరపు న్యాయవాది ఆర్యామ సుందరం మరోసారి చివరి వాదనలు వినిపించారు. మహారాష్ట్ర వ్యవహారం సుభాష్ దేశాయ్ కేసులో స్పీకర్ నిర్ణయంపై సుప్రీంకోర్టు స్పష్టంగా ఆదేశాలు ఇచ్చిందన్నారు. స్పీకర్‌కు తగిన ఆదేశాలు ఇవ్వడానికి సుప్రీంకోర్టుకు అన్ని అధికారాలు ఉన్నాయన్నారు. సుభాష్ దేశాయ్ కేసులో స్పీకర్ తప్పక తగిన సమయంలో నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని రాజ్యాంగ ధర్మాసనం తీర్పులో పేర్కొందని న్యాయవాది ఆర్యామ సుందరం అన్నారు. జనవరిలో సుప్రీంకోర్టు విచారణ ప్రారంభించాక స్పీకర్ నోటీసులు ఇచ్చారని, మూడు వారాలు సమయం ఇచ్చారని, ఆ మూడు వారాల సమయం కూడా పూర్తి అయిందని న్యాయవాది ఆర్యామ సుందరం అన్నారు. నోటీసులు పంపిన సమాచారం కూడా ప్రతిపక్ష నేతకు ఇవ్వలేదని న్యాయవాది పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీలో చేసిన వ్యాఖ్యలు మరోసారి ప్రస్తావించారు. దీనిపై న్యాయవాది ముకుల్ రోహత్గీ అభ్యంతరం చెప్పారు. ధర్మాసనం కూడా తాము ఆ విషయంలోకి వెళ్లడం లేదని స్పష్టం చేసింది. దీంతో బీఆర్ఎస్ పిరాయింపు ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్‌పై విచారణ సుప్రీంకోర్టులో ముగిసింది. ఇరువైపు వాదనలు విన్న న్యాయస్థానం తీర్పును రిజర్వు చేసింది. అయితే 8 వారాల్లోగా తీర్పు ఇవ్వాలని సుప్రీం కోర్టును న్యాయవాది ఆర్యమ సుందరం కోరారు.

# 400 ఎకరాల్లో చెట్ల నరికివేతపై స్టే

## సుప్రీం తీర్పు కనువిప్పు కావాలి : మాజీమంత్రి హరీష్ రావు

హైదరాబాద్ : హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూముల్లో చెట్ల నరికివేతపై సుప్రీంకోర్టు స్టే ఇవ్వడం ఆహ్వానించదగ్గ పరిణామం అని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి దుందుడుకు చర్యలకు ఇది చెంపపెట్టు లాంటిది అని తెలిపారు. నిన్న పార్టీ ఫిరాయింపుల విషయంలో మొట్టికాయలు, నేడు హెచ్‌సీయూ భూముల విషయంలో సుప్రీం అక్షింతలు వేసిందన్నారు. అధికారం ఉంది కదా అని ఏది పడితే అది చేస్తామంటే, చట్టం చూస్తూ ఊరుకోదు అని హరీశ్‌రావు మండిపడ్డారు. పర్యావరణాన్ని కాపాడడంలో ప్రభుత్వాలు వైఫల్యం చెందినపుడు న్యాయస్థానం మార్గదర్శకంగా ఉండడం శుభ పరిణామం. ఇది విద్యార్థుల విజయం, పర్యావరణ ప్రేమికుల విజయం, సామాజిక వేత్తల విజయం.

# బిసి గర్జనకు రాహుల్ వస్తాడని చెప్పలేదు

వక్ఫ్ బిల్లుతో సంబంధం ఉన్న అంశాల కారణంగా రాహుల్ గాంధీ ఈ కార్యక్రమానికి రాలేకపోయారని తెలిపారు. అయితే, బీసీ రిజర్వేషన్ల అంశంపై రాహుల్ గాంధీ పూర్తి మద్దతు ఇస్తారని హామీ ఇచ్చారు. అలాగే హైదరాబాదులోని సెంట్రల్ వర్సిటీ భూములపై ఇటీవల జరుగుతున్న చర్చ పై కూడా ఆయన స్పందించారు. ఐఈ÷ఖ భూములు ప్రభుత్వానికి చెందినవేనని, ఇది కోర్టు పరిధిలో ఉన్న అంశమని ఆయన తెలిపారు. విద్యాసంస్థల అవసరాల కోసమే ఈ భూములను వినియోగించుకుంటామని స్పష్టం చేశారు. కేసీఆర్ హయాంలో జరిగిన భూ అక్రమాలపై చర్చించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని, అవి నిరూపించగలమని మహేష్ గౌడ్ అన్నారు. ప్రభుత్వ భూములు అక్రమంగా ఆక్రమణకు గురైన వాటిని తిరిగి స్వాధీనం చేసుకునేందుకు హైడ్రా తీసుకువచ్చామని వివరించారు. తెలంగాణ అభివృద్ధికి బీఆర్ఎస్, బీజేపీ అడ్డుపడుతున్నాయని మహేష్ గౌడ్ విమర్శించారు. ప్రభుత్వం తీసుకుంటు–న్న అభివృద్ధి కార్యక్రమాలకు ఈ రెండు పార్టీలే ప్రధాన అడ్డంకిగా మారుతున్నాయని ఆయన వ్యాఖ్యానించారు. ఈ భూముల నుంచే మై హోమ్‌కు వంద అడుగుల రోడ్డు అనుమతి ఎలా ఇచ్చారని మహేష్ గౌడ్ ప్రశ్నించారు. గత ప్రభుత్వ హయాంలో ఇదే ఎలా జరిగిందో తమకు అనుమానం ఉందని, దానిపై విచారణ జరిపిస్తామని ప్రకటించారు. మూడేళ్లలో మేము అధికారంలోకి వస్తామని కేటీ–ఆర్ పగటి కలలు కంటు–న్నాడు అంటూ మహేష్ గౌడ్ వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ పార్టీ బలంగా ఉన్నదని, రాబోయే ఎన్నికల్లో ప్రజలు తమకు తిరిగి అవకాశం కల్పిస్తారని విశ్వాసం వ్యక్తం చేశారు. అయితే ప్రస్తుతం జరగాల్సిన మంత్రివర్గ విస్తరణలో కొన్ని ఇబ్బందులు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు.

# గచ్చీబౌలి భూములపై ప్రభుత్వానికి షాక్

సమాధానం చెప్పాలని హుకుం జారీ చేసింది. ఎలాంటి ఉల్లంఘనలు జరిగినా.. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి వ్యక్తిగత బాధ్యత వహించాల్సి ఉంటు–ందని తెలిపింది. ఒకవేళ ఇది అటవీ ప్రాంతం కాకపోయినా.. చెట్లు కొట్టేసే ముందు సీఈసీ అనుమతి తీసుకున్నారా? అంటూ ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. హైకోర్టు రిజిస్ట్రార్ పంపిన నివేదికలోని ఫొటోలు చూసి అక్కడి పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చని చెప్పింది. వందల కొద్దీ యంత్రాలు మోహరించాల్సిన అగత్యం ఏంటో అర్థం కావడం లేదని జస్టిస్ గవాయ్ పేర్కొన్నారు. ఈ మేరకు ప్రభుత్వం చేపట్టిన పనులపై స్టే విధించింది ఉన్నత న్యాయస్థానం. అయితే సుప్రీంకోర్టు తీర్పుపై హెచ్‌సీయూ విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. భూముల వ్యవహారంలో తెలంగాణ ప్రభుత్వం వెనక్కి తగ్గాలంటూ డిమాండ్ చేస్తున్నారు. గో బ్యాక్ పోలీస్ అంటూ నినాదాలు చేస్తున్నారు. భారీ వర్షంలోనూ నిరసనలు తెలుపుతున్నారు. విద్యార్థుల నినాదాలతో యూనివర్శిటీ ప్రాంగణం దద్దరిల్లుతోంది.

# శోభాయాత్రను శాంతియుతంగా జరుపుకోవాలి

## హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్

హైదరాబాద్ : శ్రీరామనవమి సందర్భంగా 6వ తేదీన నిర్వహించే శోభాయాత్రను శాంతియుతంగా, సంతోషంగా జరుపుకోవాలని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ తెలిపారు. గురువారం శ్రీరామ శోభాయాత్ర కో ఆర్డినేషన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కో ఆర్డినేషన్ కమిటీకి సీపీ సీవీ ఆనంద్ కీలక సూచనలు జారీ చేశారు. తారాం భాగ్ నుంచి శ్రీరామనవమి శోభాయాత్ర ప్రారంభం అవుతుందని అన్నారు. మధ్యాహ్నం ఒంటి గంటకు శోభాయాత్ర ప్రారంభం అయ్యేలా నిర్వహకులు చూడాలని సూచించారు. శోభాయాత్రలో పెద్దపెద్ద డీజే శబ్దాలు లేకుండా నిర్వాహకులు జాగ్రత్తలు తీసుకోవాలని సీపీ సీవీ ఆనంద్ సూచించారు. శోభాయాత్రలో పాటలు వేరే వర్గాలను కించ పరిచేలా ఉండకూడదని సీపీ సీవీ ఆనంద్ చెప్పారు. శోభాయాత్రలో ఇబ్బంది లేకుండా రోడ్డుకు ఇరువైపులా వేదికలు ఏర్పాటు చేసుకోవాలని అన్నారు. జాయింట్ కంట్రోల్ రూమ్ ఐసీసీసీలో ఏర్పాటు చేసి శోభాయాత్ర తీరును పర్యవేక్షిస్తామని చెప్పారు. శోభాయాత్ర దారులు చిన్నగా ఉంటాయని.. భారీ టస్కర్ వాహనాలు వెళ్లే అవకాశం ఉండదని సీపీ సీవీ ఆనంద్ స్పష్టం చేశారు. అందుకే టస్కర్ వాహనంతో ముందు ట్రయల్స్ నిర్వహించాలని సూచించారు. విగ్రహాల ఎత్తు కూడా చిన్నగా ఉండేలా చూసుకోవాలని సలహా ఇచ్చారు. డ్రోన్స్ ఎగుర వేయాలి అంటే ముందుగా తమకు సమాచారం ఇవ్వాలని అన్నారు. డీజే సౌండ్‌తో అనర్థాలు ఎక్కువగా జరుగుతున్నాయని.. శోభాయాత్రలో డీజే సౌండ్స్ తక్కువగా ఉండేలా చూడాలని అన్నారు.24 గంటలు కరెంట్, బ్యాక్ అప్ కోసం జనరేటర్‌లు ఏర్పాటు చేస్తామని అన్నారు. ఆర్టీసీ నుంచి డ్రైవర్లు, కండక్టర్లు అందుబాటులో ఉంటారని తెలిపారు. ప్రసాదాల వితరణ కేంద్రాలను శోభాయాత్రకు అడ్డు లేకుండా ఏర్పాటు చేసుకోవాలని అన్నారు. శోభాయాత్రకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా విజయవంతం చేయడానికి అన్ని ప్రభుత్వ విభాగాలు చర్యలు తీసుకోవాలని సీపీ సీవీ ఆనంద్ సూచించారు.

# సుప్రీం ఆదేశాలను పాటిస్తాం

## స్పష్టం చేసిన మంత్రులు

హైదరాబాద్ : సుప్రీంత ఆదేశాల మేరకు నడుచుకుంటామని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ మేరకు కంచ గచ్చిబౌలి భూములపై డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, ఐటీ–, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుల సంయుక్త ప్రకటన చేశారు. కంచ గచ్చిబౌలి భూములపై సుప్రీంకోర్టు కోర్టు ఆదేశాలను పాటిస్తామని తెలిపారు. సర్వోన్నత న్యాయస్థానం కోరిన సమాచారాన్ని గడువులోపు పంపిస్తామని వెల్లడించారు. సుప్రీంకోర్టుపై రాష్ట్ర ప్రభుత్వానికి పూర్తి విశ్వాసం ఉందని.. న్యాయం గెలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. విద్యార్థులపై కఠినంగా వ్యవహరించవద్దని అదనపు డీజీ సైబరాబాద్ కమిషనర్లను మంత్రులు ఆదేశించారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలోని 400 ఎకరాలను తెలంగాణ ప్రభుత్వం వేలం వేయడాన్ని నిరసిస్తూ



విద్యార్థిలోకం నిరసన వ్యక్తం చేస్తుంది. ఈ నేపథ్యంలో కంచ గచ్చిబౌలి ఐఈ÷ఖ భూముల విషయంలో సుప్రీం కోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. ఐ–ష.. కంచ గచ్చిబౌలి స్థలాల్లో ఎలాంటి పనులు చేయొద్దని ప్రభుత్వాన్ని హెచ్చరించింది. వెంటనే పనులన్నీ ఆపేయాలని.. హైకోర్ట్ రిజిస్టర్ ఇచ్చిన నివేదికలో చాలా కీలక అంశాలు ఉన్నాయని సుప్రీంకోర్టు తెలిపింది. ప్రభుత్వం నెల రోజుల్లో నిపుణుల కమిటీ– వెయ్యాలని ఆదేశించింది. 6 నెల్లలోపు కమిటీ నివేదిక ఇవ్వాలని సూచించింది. ఫారెస్ట్ ను నాశనం చేసే కార్యక్రమం జరుగుతోంది. చెట్లు–.. నెమళ్ళు.. పక్షులు.. వన్య ప్రాణులు ఉన్నాయి. వంద ఎకరాలను ఎలా కొట్టేశారు. ఎలాంటి ఉల్లంఘనలు జరిగినా సీఎస్ బాధ్యత వహించాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. ఈ మేరకు మంత్రులు స్పందించారు. సుప్రీం ఆదేశాలు పాటిస్తామని అన్నారు.

## స్థాయిని మరచి మాట్లాడుతున్న లోకేశ్

అమరావతి : నారా లోకేష్ అవకాశం వచ్చినప్పుడల్లా స్థాయిని మించి మాట్లాడుతు న్నారని మంత్రి నారా లోకేష్‌పై మాజీ మంత్రి అంబటి రాంబాబు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.. వైఎస్ జగన్ పై ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని ఫైర్ అయ్యారు.. కళ్లు నెత్తి మీదకి ఎక్కి... వాపును బలుపు అనుకుని ఒళ్లు బలిసి లోకేష్ మాట్లాడుతున్నాడు.. లోకేష్ నీ స్థాయి ఏంటో తెలుసుకో.. 2019లో పార్టీ ఓడిపోవడానికి మీరు కూడా ఒక కారణం అని గుర్తుంచుకోండి.. తెలుగుదేశం పార్టీకి 23 సీట్లు వస్తే మీరు ఓడిపోయారు.. కూటమికి 164 సీట్లు వస్తే మీరు గెలిచారు అని వ్యాఖ్యానించారు.. అబద్ధాలు ఆడటంలో లోకేష్.. చంద్రబాబును మించిపోయాడు అని ఎద్దేవా చేశారు.. జగన్ తెచ్చిన కంపెనీలను లోకేష్ ఆయనే తెచ్చానని చెప్పుకుంటున్నాడు.. జగన్ తెచ్చిన కంపెనీలకు లోకేష్ శంకుస్థాపన చేస్తున్నాడు.. దావోస్ వెళ్లి చంద్రబాబు, లోకేష్ ఏం కంపెనీలు తెచ్చారు? అని ప్రశ్నించారు. చంద్రబాబు 52 రోజులు పాటు జైలుకి వెళ్లిన ప్రిజనరి అని లోకేష్ గుర్తుపెట్టుకోవాలని అంబటి సెటైర్లు వేశారు.. మీ సహచర మంత్రివర్గ సభ్యులు.. నీ గురించి ఏం చెప్పుకుంటున్నారో ముందు తెలుసుకోవాలన్న ఆయన.. జగన్ కి జెడ్ ప్లస్ సెక్యూరిటీ ఇచ్చామని లోకేష్ చెప్తున్నాడు.. జగన్ మిర్చి యార్డుకు వచ్చినప్పుడు పోలీసులు సెక్యూరిటీని కల్పించలేదు.. జగన్ ప్రజల్లోకి వస్తే మీ సెక్యూరిటీ ఆపలేదు అది గుర్తుపెట్టుకోండి అని హెచ్చరించారు.. మద్దతు ధరతో మిర్చి ఒక బస్తా ప్రభుత్వం కొనుగోలు చేస్తే నేను మీకు నమస్కారం చేస్తాను అన్నారు.. ఇక, మద్యపాన ప్రియులంతా చంద్రబాబుని తిట్టుకుంటున్నారు.. చంద్రబాబు అందించే 99 రూపాయల మద్యం తాగగానే అరగంటలో దిగిపోతుందట అని కామెంట్ చేశారు. మరోవైపు.. వక్ఫ్ బోర్డ్ బిల్లు రాజ్యాంగ విరుద్ధమైనది అందుకే మేం వ్యతిరేకించామని అంబటి రాంబాబు స్పష్టం చేశారు..

## హెచ్‌సియూ భూముల వ్యవహారం

### సచివాలయ ముట్టడికి లెఫ్ట్ విద్యార్థుల యత్నం

హైదరాబాద్ : కంచ గచ్చిబౌలిలోని భూముల వివాదం నేపథ్యంలో తెలంగాణ సచివాలయం ముట్టడికి వామపక్ష విద్యార్థి సంఘాలు యత్నించాయి. ప్రభుత్వ విధానాలను తూర్పార బడుతూ నినాదాలు చేశారు. హెచ్‌సీయూ భూములను కాపాడాలంటూ విద్యార్థి సంఘాల నేతలు ఆందోళనకు దిగారు. ఎస్ఎఫ్ఐ, పీడీఎస్‌యూ నేతలను పోలీసులు అదుపులోకి తీసుకుని పీఎస్‌లకు తరలించారు. మరోవైపు హెచ్‌సీయూ వద్ద నిరసనలు కొనసాగుతున్నాయి. గురువారం ఏబీవీపీ ఆధ్వర్యంలో నిరసనకారులు ఆందోళనకు దిగారు. లోపల జరుగుతున్న పనులను అడ్డుకుంటామన్నారు. హెచ్‌సీయూ ప్రధాన గేటు దూకి లోపలికి వెళ్లేందుకు యత్నించగా పోలీసులు వారిని అడ్డుకున్నారు. దీంతో హెచ్‌సీయూ వద్ద ఉద్రిక్తత నెలకొంది. నిరసనల నేపథ్యంలో పెద్ద ఎత్తున పోలీసులు అక్కడ మోహరించారు.

## వివేకా హత్య కేసులో వేధింపులు

కడప : తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి కేసులో విచారణ జరుగుతోంది.. అయితే, విచారణ పేరుతో మా కుటుంబాన్ని వేధిస్తున్నారని అంటూ ఈ కేసులో సాక్షిగా ఉన్న శ్రీనివాస్‌రెడ్డి భార్య పద్మావతి ఆవేదన వ్యక్తం చేశారు.. కడప జిల్లా పులివెందులలో గురువారం మీడియాతో మాట్లాడిన పద్మావతి.. శ్రీనివాస్ రెడ్డి ఆత్మహత్యపై పోలీసులు మళ్లీ మా కుటుంబ సభ్యులను విచారిస్తున్నారు.. విచారణ పేరుతో మా కుటుంబ సభ్యులను వేధిస్తున్నారు.. కేసు విషయం పోలీసులు పొద్దుటూరు, బెంగళూరులో కలిశారని తెలిపారు.. అయితే, శ్రీనివాస్ రెడ్డి ఎందుకు చనిపోయాడు అనే విషయం లెటర్‌లో రాశారు.. శ్రీనివాస్ రెడ్డి రాసిన పేరుపై విచారణ చేయకుండా తన మేనల్లుళ్లను పోలీసులు ఎంక్వయిరీ చేస్తున్నారు మండిపడ్డారు.. అయితే, శ్రీనివాస్ రెడ్డి మృతికి కారణం సీఐ శ్రీరామ్ కారణం అని ఆరోపించారు పద్మావతి.. గంగాధర్, జగదీశ్వర్ రెడ్డి, రమణారెడ్డి, పరమేశ్వర్ రెడ్డిలను పోలీసులు ఇబ్బంది పెడుతున్నారు.. శ్రీనివాస్ రెడ్డిని మొదట్లో నిందితుడు అన్నారు.. తర్వాత అనుమానితుడు అని.. ఆ తర్వాత సాక్షి అన్నారి విమర్శించారు.. ఇలా ఒక్కొక్క సమయంలో ఒకోలా పోలీసులు వ్యవహరిస్తున్నారు.. నేను చెబితేనే నా మేనల్లుళ్లు తోట వద్దకు వెళ్లి.. నా భర్తను ఆసుపత్రికి తీసుకెళ్లారని తెలిపారు శ్రీనివాస్‌రెడ్డి భార్య పద్మావతి.

## సుప్రీం తీర్పుతో సెంట్రల్ వర్సిటీ విద్యార్థుల హర్షం


హైదరాబాద్ : కంచ గచ్చిబౌలి భూముల విషయంలో రాష్ట్ర ప్రభుత్వ చర్యలు అన్నీ నిలిపివేయాలంటూ సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలపై హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా హెచ్‌సీయూలో విద్యార్థులు సంబురాలు నిర్వహించారు. సుప్రీంకోర్టు తీర్పుతోనైనా రేవంత్ రెడ్డి దుందుడుకు చర్యలు విరమించుకోవాలని విద్యార్థులు సూచించారు. జీవ వైవిధ్యాన్ని కాపాడుకునేందుకు పోరాటం కొనసాగిస్తామని తేల్చిచెప్పారు.

## వక్ఫ్ బోర్డు తీరుపై హైకోర్టు ఆగ్రహం

### ఖురాన్ స్ఫూర్తికి విరుద్ధమన్న జడ్జి

హైదరాబాద్ : దేశవ్యాప్తంగా వక్ఫ్ బోర్డుపై చర్చ జరుగుతున్న వేళ దాని తీరుపై తెలంగాణ హైకోర్టు సీరియస్ అయ్యింది. దివ్య ఖురాన్ స్ఫూర్తిని వక్ఫ్ బోర్డు విస్మరించిందని జస్టిస్ నగేశ్ భీమపాక ఆగ్రహం వ్యక్తం చేశారు. గతేడాది ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను వక్ఫ్ బోర్డు అమలు చేయక పోవడంపై సీరియస్ అయ్యారు. పేదల పక్షాన వక్ఫ్ బోర్డు పనిచేయట్లేదని జస్టిస్ నగేశ్ తీవ్రంగా స్పందించారు. ఈ సందర్భంగా పవిత్ర ఖురాన్‌లోని పేరాలను జస్టిస్ నగేశ్ భీమపాక ఉటంకించారు. పాదరక్షలు విడిచి ఖురాన్‌లోని అంశాలు చదివి వినిపించారు. అలాగే పిటిషనర్లు సైతం ఖురాన్ స్ఫూర్తిని మరిచిపోయారని వ్యాఖ్యానించారు. వక్ఫ్‌బోర్డుపై హైకోర్టులో గతేడాది పలు పిటిషన్లు దాఖలు అయ్యాయి. ముఖ్యంగా ఇబాదత్‌ఖానాను స్వాధీనం చేసుకోవాలని పిటిషనర్ కోర్టును ఆశ్రయించారు. అయితే ఇరువర్గాల వాదనలు విన్న ధర్మాసనం.. గతేడాది మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఇబాదత్ ఖానాను స్వాధీనం చేసుకోవాలని మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది. అలాగే ఇబాదత్ ఖానా నిర్వహణకు కమిటీ– వేయాలని సూచించింది. ఈ నిర్వహణ కమిటీ–లో ఈక్వల్ మెంబర్స్‌కు చోటు– కల్పించాలని ఆదేశించింది. అయితే హైకోర్టు ఇచ్చిన తీర్పును వక్ఫ్ బోర్డు పెడచెవిన పెట్టింది. హైకోర్టు ఆదేశాలను అమలు చేయకుండా నిర్లక్ష్యం వహించింది. దీనిపై పిటిషనర్ మరోసారి ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించగా.. విచారణ చేపట్టిన జస్టిస్ నగేశ్ భీమపాక ధర్మాసనం తీవ్రంగా స్పందించింది. హైకోర్టు ఆదేశాలను అమలు చేయకపోవడంపై అసహనం వ్యక్తం చేసింది. వక్ఫ్ బోర్డు తీరుపై మండిపడింది.

## ఈ అంతరాలు అవాంఛనీయం





కేంద్ర ఓ భావనాత్మక మిథ్య అని ప్రకటించారు ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి దివంగత ఎన్టి రామారావు 1984లో. అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ ప్రజాస్వామికంగా ఎన్నికైన తన ప్రభుత్వాన్ని రద్దు చేయడంతో రాష్ట్రాలపై కేంద్ర ప్రభుత్వం నిరంకుశ ధోరణిని నిరసిస్తూ తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు ఎన్టి రామారావు ఈ ప్రకటన చేశారు. ఎన్టిఆర్ ప్రభుత్వాన్ని రద్దు చేయడంతో కేంద్రం చర్యను నిరసిస్తూ దేశవ్యాప్తంగా అప్పటి ఇందిరాగాంధీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా గొప్ప ఉద్యమం నడిచింది. దీంతో ఢిల్లీ సర్కార్ ఆయనను తిరిగి పదవిలోకి నియమించవలసి వచ్చింది. ఎన్టిఆర్ స్థాపించిన రాజకీయ పార్టీ తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ ఆధ్వర్యంలో చెన్నైలో ముఖ్యమంత్రుల సమావేశానికి దూరంగా ఉండడం ఎంత బాధాకరం. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు గురువు ఎన్టిఆర్, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీకి సీనియర్ జ్యోతిబసు ఇద్దరూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బలంగా ఉండాలని రాజీలేని పోరాటం సాగించినవారే. అయినా అటు చంద్రబాబు నాయుడు కానీ, ఇటు మమతా బెనర్జీ కానీ చెన్నై సమావేశానికి హాజరు కాకపోవడం విచారకరం. చెన్నైలో ప్రతిపక్షాల సమావేశం ఎజెండా చాలా పరిమితం. ఉత్తర భారతంలో హిందీ మాట్లాడే రాష్ట్రాల పార్లమెంటరీ నియోజకవర్గాల ప్రాతినిధ్యం పెంచాలనే భారతీయ జనతా పార్టీ చర్యను వ్యతిరేకిస్తూ నిరసన తెలుపడమే సమావేశం లక్ష్యం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య మరింత సమతుల్యమైన సంబంధాలు తిరిగి పునరుద్ధరించాలని డిమాండ్ చేసేందుకు ఆయా పార్టీలు తమ ఎజెండాను విస్తృతం చేసుకోవాలి. ప్రణాళికా సంఘాన్ని రద్దు చేసి, నీతి ఆయోగ్ ఏర్పాటు చేయడం, జాతీయ అభివృద్ధి మండలి సమావేశాలను జరపకపోవడం వంటి ఏకపక్ష నిర్ణయాల ద్వారా ప్రధాని నరేంద్ర మోడీ రాష్ట్రాల గొంతు నొక్కారని చాలా మంది నమ్ముతున్నారు.చెన్నై సమావేశం తన ఎజెండాను మరింత విస్తృతం చేసి కేంద్రం –రాష్ట్రాల సంబంధాలకు సంబంధించిన ఇతర అంశాలపై కూడా తిరిగి దృష్టి పెడుతుందని ఆశిస్తున్నాం. ఈ అంశాలు రాష్ట్ర నాయకత్వాలను, ముఖ్యంగా మోడీ గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పటి నాటి నుంచీ ప్రభావితం చేస్తూ వచ్చాయి. రాష్ట్రాలను బేఖాతర్ చేయడం జవహర్ లాల్ నెహ్రూ హయాం నుంచే మొదలైంది. 1957లో కేరళలో ప్రజాస్వామికంగా ఎన్నికైన మొదటి కమ్యూనిస్ట్ ఇ.ఎం.ఎస్. నంబూద్రిపాద్ ప్రభుత్వాన్ని రద్దు చేయడంతోనే తొలి అడుగు పడింది.1960వ దశకంలో ఆలిండియా కాంగ్రెస్ రాజకీయంగా బలహీనపడడంతో అనేక సమస్యలు తెరమీదకు వచ్చాయి. ఫలితంగా 1969లో కేంద్ర –రాష్ట్ర ప్రభుత్వాల సంబంధాలపై జస్టిస్ పి.వి. రాజమన్నార్ కమిటీని ఏర్పాటు చేశారు. ఎమర్జెన్సీలో ఓటమి తర్వాత 1980లో ఇందిరా గాంధీ తిరిగి అధికారంలోకి వచ్చిన అనంతరం జస్టిస్ ఆర్.ఎస్ సర్కారియా కమిషన్‌ను ఏర్పాటు చేశారు. ఇది ముఖ్యంగా గవర్నర్ల పాత్రను పరిశీలించింది. అప్పటి అన్ని ప్రభుత్వాలు ఈ సంస్థ విలువను లెక్కచేయలేదు. తమిళనాడులో ఉన్నంత దారుణంగా మరెక్కడా గవర్నర్ దారి తప్పలేదు. భారత ఫెడరల్ వ్యవస్థ నిర్మాణం, రాష్ట్రాలకు కేంద్రానికి మధ్య తలెత్తుతున్న అంశాలను వివరంగా పరిశీలించే మరో కమిషన్ ఏర్పాటుకు సమయం ఆసన్నమైంది. అందువల్ల కొత్తగా చెన్నైలో ఏర్పడిన వివిధ పార్టీలు, సిఎంల సమావేశం హైదరాబాద్‌లో తిరిగి సమావేశమైనప్పుడు అది తన ఎజెండాను మరింత విస్తృతం చేసుకోవాలి. వాస్తవానికి ఆ సమావేశానికి హాజరైన రాజకీయ పార్టీలు స్వయంగా ఓ రిటైర్డ్ న్యాయమూర్తి లేదా సుప్రీం కోర్టు న్యాయమూర్తి అధ్యక్షతన ఓ ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసుకోవచ్చు. అది రాజమన్నారు, సర్కారియా కమిషన్ల సిఫార్సుల అమలును తిరిగి పరిశీలించగలదు. మళ్లీ నియోజకవర్గాల పునర్విభజన అంశాన్ని, భాషా వివాదాల ద్వారా ప్రస్తుతం తలెత్తిన కొత్త సమస్యలకు చక్కటి పరిష్కారాలను చూపగలదు. భారతదేశం ఓ ఫెడరల్ వ్యవస్థ, రాష్ట్రాల యూనియన్ అని కేంద్ర ప్రభుత్వానికి గుర్తు చేయడానికి భారత రాష్ట్రాలు ముఖ్యంగా, దక్షిణాది రాష్ట్రాలు సంఘటితం కావడం ఆసక్తికరమైన పరిణామం. ఇది హిందీ హాట్ ల్యాండ్ అని పిలుచుకునే ఉత్తరాది రాష్ట్రాలకు, కేంద్రానికి, దక్షిణాది రాష్ట్రాలకు మధ్య పెరుగుతున్న దూరాన్ని పదే పదే గుర్తు చేసే పరిణామం. ప్రధాని నరేంద్ర మోడీ, హోం మంత్రి అమిత్ షా గుజరాత్ కే చెందినవారు కావడంతో ఈ అంతరాన్ని పూడ్చడంలో పెద్దగా కృషి జరగలేదు. కేంద్ర ప్రభుత్వంలో దక్షిణాది భారతీయ నాయకులలో ఎవరూ ఆ స్థాయిలో లేకపోవడం తో బలమైన రాజకీయ ముద్ర పడలేదు. గతంలో ఉత్తరాదికి, దక్షిణాదికి మధ్య ఉన్న సైకలాజికల్ లోటును దూరం భర్తీ చేయడానికి దక్షిణాది రాష్ట్రాలలో శక్తివంతమైన రాజకీయ నాయకులను కేంద్ర ప్రభుత్వంలో చేర్చుకునేవారు. దీంతో ఆ లోటు భర్తీ అయ్యేది. ఇటీవల సంవత్సరాల్లో అలాంటి ప్రాతినిధ్యం తగ్గడమే కాక, అధికారంలో ఉన్న రాజకీయ పార్టీ ఉత్తర భారతదేశ ఆధిపత్యాన్ని పెంచింది. దక్షిణాదికి చెందిన, దేశ రాజకీయాల్లోనే చరిత్ర సృష్టించిన ప్రధాని పి.వి నరసింహారావు పట్ల పదవి తొలగిపోయిన తర్వాత ఢిల్లీ పెద్దలు చూపిన దురదృష్టకరమైన ప్రవర్తన, దురుసు ప్రవర్తన అటువంటి ప్రాంతీయ పక్షపాతానికి స్పష్టమైన ఉదాహరణే. చెన్నై సమావేశంలో పాల్గొన్నవారు తమ తదుపరి సమావేశంలో ఉత్తరప్రదేశ్ వంటి బడా రాష్ట్రాన్ని చిన్నచిన్న రాష్ట్రాలుగా తగ్గించడం గురించి ప్రస్తావించవచ్చు. లోక్‌సభ సభ్యుల సంఖ్య పెంపును స్తంభింపజేయాలని డిమాండ్ చేయవచ్చు. అలాగే లోక్‌సభ సీట్ల సంఖ్యలో ఏ రాష్ట్రానికి 10శాతం కన్నా ఎక్కువ వాటా ఉండకూడదనే మరో డిమాండ్ కూడా చేయవచ్చు. ఉత్తరప్రదేశం వంటి రాష్ట్రాన్ని రెండు లేదా నాలుగు చిన్న రాష్ట్రాలుగా విభజించాలనే డిమాండ్ తరచు వినిపిస్తూనే ఉంది.చెన్నై సమావేశంలో భారత రాష్ట్ర సమితికి చెందిన నాయకుడు కెటి రామారావు లోక్‌సభ సీట్ల సంఖ్య పెంచడం కంటే, ఎక్కువమంది ఇతరులు చేసిన ముఖ్యమైన సూచనలకు అనుకూలంగా, అనర్గళంగా మాట్లాడారు. నిజమైన లెజిస్లేచర్ సంస్కరణలు రాష్ట్రాల శాసన సభలలో సీట్ల సంఖ్యను పెంచడంతో ప్రారంభం కావాలి. అసెంబ్లీలో మెరుగైన, మరింత మెరుగ్గా ప్రజలకు ప్రాతినిధ్యం కల్పించడమే డీ లిమిషన్ లక్ష్యం అయితే, ఆ మార్పు రాష్ట్రాల స్థాయినుంచే మొదలు కావాలి. ఎందుకంటే ఓటర్లు ఆసక్తిగా దృష్టి పెట్టే రోజువారీ సమస్యలను వాస్తవానికి రాష్ట్ర ప్రభుత్వాలే పరిష్కరిస్తాయి. అన్ని రాజకీయ పార్టీలు, పంచాయతీలు, మున్సిపల్ సంస్థలకు అధికారాలు, సాధికారత కల్పించేందుకు కట్టుబడి ఉండాలి. ఇది రాజ్యాంగం నిర్దేశించినదే అయినా, అతి తక్కువ రాష్ట్రాలే.. అదీ కొద్దిగా పంచాయతీ, మున్సిపల్ సంస్థలకు అధికారాలు ఇస్తున్నాయి. పలు రాష్ట్రాలలో అంతర్లీనంగా ఉన్న సమస్యలు, ఫిర్యాదులపై చెన్నై సమావేశం దృష్టి పెట్టింది. చెన్నై సమావేశం తర్వాత జరిగే తదుపరి సమావేశం కోసం దేశం ఎదురు చూస్తోంది. చెన్నై సమావేశాన్ని ఏర్పాటు చేసి పలు కీలక అంశాలను చర్చకు పెట్టిన తమిళనాడు సిఎం స్టాలిన్ అభినందనీయుడు. రాజకీయ ప్రాతినిధ్యం, పాలనాపరమైన అధికారాల పరిధి వంటి అంశాలకన్నా, కేంద్ర, –రాష్ట్ర సంబంధాలను మరింత విస్తృతంగా చర్చించే ప్రజాస్వామిక సైద్ధాంతిక పరమైన అవసరం ఉంది. కేంద్రంలో కొన్ని శక్తులు భారత దేశం రాష్ట్రాల యూనియన్ అనే ఆలోచనకు సవాల్ విసురుతూనే ఉన్నాయి. రాజ్యాంగం నిర్వచించినట్లుగా నేటి భారత్ అనేది వేర్వేరు రాష్ట్రాలను చట్టబద్ధంగా విలీనం చేయడం ద్వారా ఏర్పడిన ఫెడరల్ వ్యవస్థ. అదే భారతదేశం. ప్రతి భారతీయుడు రాజ్యాంగానికి బద్ధుడై ఇండియా అంటే భారత్ అని తన దేశాన్ని అంగీకరిస్తారు. భారత్‌ను నాగరికపరంగా, చట్టబద్ధమైన సంస్థగా నిర్వచించవచ్చు. పటిష్టమైన రాజ్యాంగం నిబద్ధత, విధేయతను పునరుద్ఘాటిస్తుంది.

## ప్రియుడి మోజులో కన్నపిల్లను కడతేర్చిన కసాయి

### రజితను, ప్రియుడిని అరెస్ట్ చేసిన పోలీసులు

సంగారెడ్డి : అమీన్‌పూర్ లో తల్లి తన కడుపున పుట్టిన పిల్లలకు విషమిచ్చి కడతేర్చిన ఘటన సంచలనంగా మారిన విషయం తెలిసిందే. అమ్మతనానికి మాయని మచ్చగా రజిత అనే మహిళ ప్రియుడి మోజులో పడి ముగ్గురు పిల్లలను మృత్యుఒడికి చేర్చింది. ఈ ఘటనపై కేసునమోదు చేసి దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు రజితను అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేశారు. ముగ్గురు పిల్లల్ని చంపిన తల్లి రజితను పోలీసులు అరెస్ట్ చేశారు. తల్లి రజితతో పాటు– ప్రియుడు శివను అరెస్టు చేసి రిమాండ్ కు పంపించారు. ఓ పార్టీలో శివ అనే వ్యక్తితో రజితకు పరిచయం ఏర్పడింది. పదో తరగతి వరకు శివతో కలిసి రజిత చదువుకుంది. ఆ పరిచయం కాస్త అక్రమసంబంధానికి దారితీసింది. గత కొన్ని నెలల నుంచి శివతో వివాహేతర సంబంధాన్ని కొనసాగిస్తోంది రజిత. ఈ క్రమంలో శివతో కలిసి బతకాలని రజిత ప్లాన్ చేసింది.. పెళ్లి అయి ముగ్గురు పిల్లలు ఉన్నందున తనతో ఉండేందుకు ప్రియుడు శివ నిరాకరించాడు. పిల్లల్ని చంపి వస్తే తనతో జీవించేందుకు అవకాశం ఇస్తానని శివ చెప్పాడు. పిల్లలకు పెరుగులో విషం కలిపి చంపేయాలని రజితకు సలహా ఇచ్చాడు. పిల్లలు చచ్చిపోతే భర్త చెన్నయ్యను పోలీసులు అరెస్టు చేస్తారని ఐడియా ఇచ్చాడు. ప్రియుడు శివ ఇచ్చిన ఐడియాతోనే ముగ్గురు పిల్లల్ని చంపి కడుపు నొప్పి నాటకం ఆడింది తల్లి రజిత. పిల్లలు ముగ్గురు సాయికృష్ణ (12), మధుప్రియ (10), గౌతమ్ (8) కూడా విగతజీవులై పడిపోయారు. భార్య రజిత కడుపునొప్పిగా ఉందని చెప్పడంతో చెన్నయ్య ఆమెను ఆస్పత్రిలో చేర్పించాడు. మొదట పోలీసులు చెన్నయ్య మీదే అనుమానం పెట్టుకున్నారు. కానీ, విచారణలో రజిత అసలు బాగోతం వెలుగుచూసింది.

## దొంగహామీలతో ప్రజలను మోసం చేశారు

### గిరిజనులకు మంత్రి పదవి లేకుండా చేశారు

### మాజీ మంత్రి హరీష్ రావు విమర్శలు

హైదరాబాద్ : దొంగ హామీలతో అధికారంలోకి వచ్చిన రేవంత్ రెడ్డి.. తులం బంగారం, 2 లక్షల రుణమాఫీ, యువతులకు స్కూటీలు ఏమయ్యాయని మాజీ మంత్రి హరీష్ రావు ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి హామీలు సగం.. సగం.. ఆగం ఆగం.. అయ్యాయి.. దేవుళ్ళను మోసం చేసిన రేవంత్ రెడ్డి ప్రజలను మోసం చేయడం పెద్ద విషయం కాదని అన్నారు. ఈ మేరకు మాజీ మంత్రి హరీష్ రావు కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. ఈ సందర్భంగా హరీష్ రావు మాట్లాడుతూ.. సేవాలాల్ జయంతి కేసీఆర్ అధికారంలో ఉన్నప్పుడు అధికారికంగా ప్రకటించారు.. గిరిజనులకు 10 శాతం రిజర్వేషన్ కల్పించిన ఘనత బిఆర్ఎస్ పార్టీది.. బంజారా భవన్ ఏర్పాటు– చేశారు, తండాలను గ్రామపంచాతీలుగా ఏర్పాటు–, మంచినీటి సరఫరా ఏర్పాటు, పాలమూరు బిడ్డ, నల్లమల బిడ్డ అనే రేవంత్ రెడ్డి ఈ ప్రాంత ప్రజలకు పూర్తి స్థాయిలో రుణమాఫీ ఎందుకు చేయలేదు.. రైతు బంధు వర్ష కాలంలో 8 వేల కోట్లు–, యాసంగిలో 4 వేల కోట్లను ప్రజలకు ఎగ్గొట్టిన ఘనుడు రేవంత్ రెడ్డి.. కరోనా సమయంలో కేసీఆర్ రైతు బంధు ఇచ్చిండు.. రేవంత్ రెడ్డి కుటు–ంబ ఆదాయమే ముఖ్యం.. అయితే లూటీ– లేకుంటే లాఠీ.. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఫోర్త్ సిటీ– పేరున వేల ఎకరాల భూమిని లాక్కుంటు–న్నారు.. 16 నెలల అవుతున్న పూర్తి స్థాయిలో రుణమాఫీ చేయలేదు.. కేసీఆర్ కిట్టు–, రమజాన్ టోఫా, రైతు బంధు, ఫీజు రీయింబర్స్ మెంట్ లు బంద్ చేశారని మండిపడ్డారు. గిరిజనులకు మంత్రి పదవి ఇవ్వని రేవంత్ రెడ్డి ప్రభుత్వం.. ప్రభుత్వ భూములు అమ్ముకోవడమే రేవంత్ రెడ్డి పని.. 2 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని ఆశ చూపిన రేవంత్ రెడ్డి.. 2 కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చిన నరేంద్ర మోడీ మోసం చేశారు.. దమ్ముంటే గన్మెన్లు, పోలీసులు లేకుండా బోయిన్ గుట్ట తండాకురా...రుణమాఫీ అయిందా లేదా చెబుతారు అని సీఎం రేవంత్ రెడ్డికి సవాల్ విసిరారు.

## సామర్లకోట మున్సిపల్ చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం

### కలెక్టర్‌కు నోటీసు ఇచ్చిన 22 మంది కౌన్సిలర్లు

కాకినాడ : ఆంధ్రప్రదేశ్‌లో పలు జడ్పీ, మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, ఎంపీపీలపై అవిశ్వాస తీర్మానాలు పెడుతోన్న క్రమంలో, కాకినాడ జిల్లా సామర్లకోట మున్సిపాలిటీలో సొంత పార్టీ మున్సిపల్ చైర్మన్ పై అవిశ్వాస తీర్మానానికి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు సిద్ధం అయ్యారు.. మున్సిపల్ చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానానికి అనుమతి కోరుతూ కలెక్టర్ కి 22 మంది వైసీపీ కౌన్సిలర్లు లేఖ రాశారు .. సామర్లకోట మున్సిపాలిటీలో మొత్తం 31 మంది కౌన్సిలర్లు ఉన్నారు.. 2021 మార్చి 10న జరిగిన ఎన్నికల్లో 29 మంది వైసీపీ, ఇద్దరు టీడీపీ కౌన్సిలర్లు గెలుపొందారు.. వైసీపీ కౌన్సిలర్ గా గెలిచి 2021 మార్చి 17న చైర్‌పర్సన్ గా అరుణ బాధ్యతలు స్వీకరించారు.. అయితే, రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వానికి సపోర్ట్ చేస్తూ టీడీపీతో సఖ్యతగా ఉంటున్నారని చైర్మన్ పై 22 మంది కౌన్సిలర్లు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.. చైర్మన్ పై అవిశ్వాస తీర్మానం పెట్టాలని కలెక్టర్ ను కలిశారు 22 మంది వైసీపీ కౌన్సిలర్లు.. అయితే, తనపై అవిశ్వాసం పెట్టే ప్రయత్నం చేస్తూ అవమానిస్తున్నారని ఏడ్చారు చైర్మన్ అరుణ... టీడీపీ ఎమ్మెల్యే రాజప్పతో అభివృద్ధి కోసం కలిసి పనిచేస్తున్నానని అంటు–న్నారు.. మరోవైపు చైర్మన్ కు వ్యతిరేకంగా ఉన్న వైసీపీ కౌన్సిలర్లు మాత్రం ఉభయ గోదావరి జిల్లాల పార్టీ రీజినల్ కోఆర్డినేటర్ గా ఉన్న బొత్స ను కలిసి చైర్మన్ మార్చి తీరాలని కోరారు..

### సుప్రీం తీర్పు విద్యార్థుల విజయం: కెటిఆర్

హైదరాబాద్ : కంచ గచ్చిబౌలి పర్యావరణ పరిరక్షణ కోసం సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు పట్ల బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధన్యవాదాలు తెలిపారు. ఇది హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థుల విజయం. విద్యార్థుల నిస్వార్థ నిరంతర స్ఫూర్తివంతమైన పోరాటం వల్లనే ఈ సానుకూల తీర్పు వచ్చింది. కంచ గచ్చిబౌలి భూముల పరిరక్షణ కోసం మద్దతు ఇచ్చిన ఉద్యమకారులు, సెలబ్రెటీలు, పర్యావరణ ప్రేమికులు, మీడియా, సోషల్ మీడియా.. ప్రతి ఒక్కరికీ విద్యార్థుల తరపున ధన్యవాదాలు అని కేటీఆర్ పేర్కొన్నారు.

## సంపాదకీయం

# హద్దుల్లో ఉంటూ.. పాలన సాగించాలి!

ప్రజాసంక్షేమం, అభివృద్ధి గాలికి పోయింది. ఎవరు అధికారంలో ఉన్నా తమకు అనుకూలమైన పనులు నెరవేర్చుకోవడంలో బిజీగా ఉన్నారు. అన్నీ రాజకీయాల చుట్టే తిరుగుతున్నాయి. ఎమ్మెల్యేల అనర్హతపై సుప్రీం తీర్పు రిజర్వ్ చేసింది. ఏం తీర్పు రాబోతోందో అన్నది సర్వత్రా ఉత్కంఠగా ఉంది. గతంలో ఉన్నట్లుగానే చట్టాలు ఉన్నాయని, కొత్తగా ఉప ఎన్నికలు రావడానికి అవకాశం లేదని సిఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీ వేదికగా వ్యాఖ్యలు చేశారు. దీనిపైనా సుప్రీం ధర్మాసనం ఘాటు వ్యాఖ్యలు చేసింది. సిఎంకు నియంత్రణ లేదా అని ప్రశ్నించింది. అంటే నేతలు ఏం మాట్లాడుతున్నారో వారికి అర్థం కావడం లేదు. ఇకపోతే బిసి రిజర్వేషన్లపై ఢిల్లీ వేదికగా మొత్తం ప్రభుత్వమే తరలి వెళ్లి ధర్నా చేసింది. సిఎం రేవంత్ సహా మంత్రులు, కాంగ్రెస్ పరివారం వెళ్లింది. నిజానికి ఇదంతా ఓ పద్దతి ప్రకారం జరగాల్సిన వ్యవహారం. రాజ్యాంగ విలువలు, నిబంధనలతో కూడుకున్న విషయం. దీనిపై తేల్చండి అంటూ..ఢిల్లీకి వెళ్లారు. ధర్మయుద్ధం అంటూ పెద్దపెద్ద మాటలు మాట్లాడారు. కాంగ్రెస్ తాను ఇచ్చిన,ఇస్తున్న హామీలకు కేంద్రాన్ని బాధ్యులుగా చేసి విమర్శలు చేయడం సరికాదు. ఇకపోతే హైదరాబాద్‌కు ధీటుగా ఫ్యూచర్ సిటీని నిర్మిస్తామని ఇప్పటికే రేవంత్ రెడ్డి ప్రకటించారు. అక్కడ పరిశ్రమలు, ఐటి సంస్థలను అభివృద్ధి చేస్తామని తెలిపారు. మరి కొత్తగా ఇప్పుడు వివాదంలోకి వచ్చిన 400 ఎకరాల్లో ఐటి పార్కులు అభివృద్ధి చేస్తామని డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క చెప్పడం దారుణం కాక మరోటి కాదు. ఓ వైపు ఆందోళనలు జరుగు తున్నా, సుప్రీం విచారణ చేస్తున్నా ఇలాంటి వ్యవహారాల్లో సంయమనం పాటించడంలో పాలకులు విఫలం అవుతున్నారు. నిజానికి ఈ 400 ఎకరాలను అర్జంటుగా అమ్మి డబ్బులు చేసుకోవాలన్న ఆత్రుత పాలకుల్లో ఉంది. ఇకపోతే బిఆర్ఎస్ నేతలు గత పాపాలను వదిలి కొత్తగా కాంగ్రెస్ మాత్రమే పాపాలు చేస్తున్నదన్న రీతిలో తెగ రెచ్చిపోయి మాట్లాడుతున్నారు. దీంతో తమ పాపాల తాలూకు వాసనలు రాకుండా చూసుకోవాలన్న పనిలో పడ్డారు. అందుకే విపక్ష బిఆర్ఎస్ తాను చేసిన తప్పులను కప్పి పుచ్చుకునేందుకు నానా తంటాలు పడుతోంది. గతంలో చేసిన తప్పులు ఒక్కొక్కటిగా బయటపడడంతో ఎదురుదాడి మంత్రం ప్రయోగిస్తోంది. తామంతా సుద్దపూసలం అన్నట్లుగా కెసిఆర్, కెటిఆర్, హరీష్ రావులు పాడిందే పాటగా పాడుతున్నారు. ఓ వైపు దర్యాప్తు సంస్థలు ఒక్కో అవినీతి పుట్టను తవ్వి పెడుతున్నారు. ఫోన్ ట్యాపింగ్, ప్రాజెక్టల కుంభకోణాలు,అవినీతి, ధరణి ఇలా ఒక్కటేమిటి అనేక రకాలుగా అవినీతి చెదను గుర్తించారు. వారి పదేళ్ల పాలనలో వందేళ్ల విధ్వంసం జరిగిందని విమర్శలు వచ్చాయి. గతంలో కరెంట్, మంచినీళ్లు, సాగునీటి ఆందోళనలను పత్రికల్లో రాకుండా, సోషల్ మీడియాలో రాకుండా మేనేజ్ చేసిన ఘనులు వీరు. ఏదైనా వార్త వస్తే విలేకర్లపై కేసులు పెట్టారు.ఈ క్రమంలో గతంలో, ఇప్పుడు అందరినీ కలుపుకుని అవినీతికి పాల్పడ్డ చెదపురుగులను ఏరిపారేయాల్సిందే. అలాగే రాజకీయంగా వారిని ఎండగట్టాల్సిందే. ప్రజలు నేరుగా బాధితులు కనుక ..ఈ విషయంలో ప్రజలే తమ అభిప్రాయాలను వ్యక్తం చేయాలి. ఇప్పుడున్న పరిస్థితుల్లో అభివృద్ధి, సంక్షేమ రంగాల్లో సమతుల్యతను పాటిస్తూ.. ముందుకు సాగాలి. ప్రజాప్రభుత్వమన్న పేరు వచ్చేందుకు కృషి అసలుసిసలు కృషి చేయాలి. ఇంటాబయట విమర్శలను ఎదుర్కొంటున్న క్రమంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిజాయితీగా ముందుకు సాగాలి. కఠినంగా వ్యవహరించడం కూడా అలవర్చుకోవాలి. నిర్ణయాలు తీసుకోవడంలో నిక్కచ్చిగా వ్యవహరించాలి. ఎన్నికల హామీలను అమలు చేసేలా వ్యూహాలను అమలు చేసుకోవాలి. ఉచిత పథకాలకు పాతరేయాలి. సన్న బియ్యం ఇస్తున్నామని చంకలు గుద్దుకోకుండా..అర్హులకు అదీ ధరలు పెంచి ఇవ్వాలి. ఈ క్రమంలో కాంగ్రెస్ నేతలు కూడా నిజాలు గుర్తించి మసలుకోవాలి. ఎందుకంటే కాంగ్రెస్ ఓ జాతీయ పార్టీ. జాతీయ పార్టీలో పెత్తనం రకరకాలుగా ఉంటుంది. కాంగ్రెస్‌లో స్వేచ్ఛగా బాధ్యతలు నిర్వహించే అవకాశం ఉండదు. సీనియర్లు కావచ్చు..జూనియర్లు కావచ్చు...పార్టీ, ప్రభుత్వ ప్రతిష్ట పెరేందుకు అవసరమైన మేరకు మాత్రమే నడుచుకుంటే తప్ప ముమ్మందు కాంగ్రెస్ మరిన్ని విజయాలు సాధించలేదు. బీఆర్ఎస్ పాలనకు.. కాంగ్రెస్ పార్టీ పాలనకు తేడా అన్నది పనుల్లో చూపాలి. ప్రాంతీయ పార్టీ కావడం వల్ల అక్కడ పార్టీ చీఫ్ కేసీఆర్ చెప్పిందే వేదం.. చేసిందే చట్టం. ఆయన ఎవరి మాటా వినాల్సిన పని లేకుండా నిరంకుశంగా పదేళ్లు పాలించారు. పదేళ్లలో ఏం చేశారో ఇప్పుడు చూస్తున్నాం. కరువు వచ్చిందంటే కాంగ్రెస్ తెచ్చిందని బుర్రలేని మాటలు మాట్లాడుతున్నారు. ఇది రైతులు కూడా అర్థం చేసుకోగలరు. సిఎం రేవంత్ కూడా ప్రజలకు ఇచ్చిన హామీలు, చేయాల్సిన పనులు లక్ష్యంగానే ముందుకు సాగాలి. వ్యక్తిగత వ్యవహారాలకు ప్రాధాన్యం ఇవ్వరాదు. మంత్రులు కావచ్చు.. లేదా ఎమ్మెల్యేలు కావచ్చు ప్రజాభీష్టం మేరకు నడుచుకోవాలి. బిఆర్ఎస్ అవినీతిని ఎండగట్టడమే పాలన కాదు. పనులు కూడా చేస్తూ పోవాలని గుర్తించాలి. ఎపిలో జరుగుతున్న అభివృద్ధి పనుల వేగాన్ని గుర్తించాలి. చంద్రబాబు ప్రజల సంక్షేమం కోరి ముందుకు అడుగేస్తున్నారు. పెండింగ్ పనుల్లో వేగం పెంచారు. ఇచ్చినహామీలను అమలు చేస్తూనే ఇవ్వని అనేకానేక పనులకు సంబంధించి క్షేత్రస్థాయిలో పరిష్కరించే ప్రయత్నాలు చేపట్టారు. సాగు,తాగునీటి రంగాలను చక్కదిద్దే ప్రయత్నాలను ముమ్మరం చేశారు.వేగంగా సమస్యల పరిష్కారానికి చర్యలకు పూనుకుంటున్నారు. ఈ క్రమంలో వచ్చే వర్షాకాలం నాటికి నీటి నిల్వలు పెంచడం, సాగునీటి రంగాన్ని ఆధునీక రించడం వంటి ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలి.

# వెట్టి చాకిరిలో ప్రైవేట్ టీచర్లు




### సమస్యలను పట్టించుకోని ప్రభుత్వం

హైదరాబాద్ : ప్రైవేట్ రంగంలో విద్యారంగ పటిష్టతకు పాటుపడుతూ సామాజిక సేవ చేస్తున్న ప్రైవేట్ టీచర్లను కార్మికులుగా గుర్తించి వారికి పెన్షన్,పిఎఫ్ తదితర సౌకర్యాలు కల్పించాలని, వారిని కార్మికులగా గుర్తించాలని ప్రైవేట్ పాఠశాలల టీచర్లు కోరుతున్నారు. ఇప్పుటు ప్రైవేట్ టీచర్లు అనేక వృత్తిగతమైన ఇబ్బందులు ఎదుర్కొటున్నారు. ఈ క్రమంలో మళ్లీ విద్యావ్యాపారం మొదలయ్యింది. పిల్లలను విద్యావంతులుగా తీర్చిదిద్దే పెద్ద బాధ్యతను మోస్తున్న ప్రైవేట్ టీచర్లు అంతకుమించిన సమస్యలనూ భరిస్తున్నారు. పనిగంటలు పెంచి, ఇతర పనులను కూడా విధుల్లో చేర్చి ప్రైవేట్ టీచర్లను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారు. ముఖ్యంగా వేసవిసెలవుల్లోనూ విధులు నిర్వహించాలని యాజమాన్యాలు హుకూం జారీ చేస్తున్న తీరు తమను వెట్టి కార్మికులుగా చేస్తోందని అన్నారు. టీచర్లనే సేల్స్ మ్యాన్‌లను చేస్తూ ఇంటింటికి తిరిగి విద్యార్థుల సంఖ్యను పెంచాలని ఒత్తిడి చేస్తున్నారు. ప్రైవేట్ టీచర్లకు నిబంధనల ప్రకారం ఇవ్వాల్సిన సెలవుల్లోనూ వివక్ష చూపుతున్నాయి వేసవి సెలవులను సైతం యాజమాన్యాలు సరిగా ఇవ్వకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. వేసవి సెలవుల్లో విద్యార్థుల అడ్మిషన్లు పెంచే పనిని కూడా టీచర్లకే అప్పజెప్పడం దారుణం అన్నారు. వేసవిలో జీతాలుకూడా ఇవ్వడం లేదన్నారు. ధైర్యంచేసి ఏ టీచరైనా ప్రశ్నిస్తే ప్రైవేట్ అంటే ఇలానే ఉంటుందని, ఉంటే ఉండండి లేకుంటే వెళ్లిపోండని హుకూం జారీ చేస్తున్నాయని అంటున్నారు. ప్రైవేట్ టీచర్లు తెలంగాణ రాష్ట్రంలో 3 లక్షల మందికి పైగా ఉన్నారని దాదాపు తెలంగాణలోని 90 శాతం మంది విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే బాధ్యత వీరిపై ఉందన్నారు. ఉద్యోగం ఉండాలంటే ఇవన్నీ చేయాలని యాజమాన్యాలు ఆదేశాలు జారీ చేస్తున్నాయి. దీంతో తప్పని పరిస్థితిలో ప్రైవేట్ టీచర్లు అన్ని పనులు చేయాల్సి వస్తుందన్నారు. ప్రైవేట్ టీచర్ల ఉద్యోగ భద్రత గాలిలో దీపం లాంటిదని, ఎప్పుడు ఉంటుందో, ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి ఉందన్నారు. ఊడిగం చేస్తున్న ఉద్యోగభద్రత లేదన్నారు. దీంతో అభద్రతా భావంతో ప్రైవేట్ టీచర్ కొట్టుమిట్టాడుతున్నాడు. అసలే అర కొర జీతాలు ఇస్తూ, మరోవైపు అన్ని పనులు నెత్తిన వేస్తూ ఎదురు చెప్పితే ఉద్యోగాలు ఉండవని యాజమాన్యాలు బ్లాక్‌మేల్ చేస్తున్నాయని పలువురు ప్రైవేట్ టీచర్లు ఆవేదన వ్యక్తం చేశారు. పాఠాలు చెబుతూ, ఇతర రాత పనులు చేస్తూ క్లర్క్‌గా, విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు క్యాన్వాసింగ్ కూడా చేస్తూ ప్రచారకర్తలుగా పనులు నిర్వహిస్తున్నారు. దీంతో పనుల ఒత్తిడిలో అసలు పని బోధన చేయలేక పోతున్నామని ప్రైవేట్ టీచర్లు వాపోతున్నారు. వేలరూపాయలను విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి వివిధ ఫీజుల పేరుతో యాజమాన్యాలు వసూళ్లు చేస్తూ ఖజానా నింపుకుంటున్నాయి. పాఠశాల ఆస్తులను పెంచుకుంటున్నాయి. కాని అటు విద్యార్థులకు, ఇటు ఉపాధ్యాయులకు సరైన సౌకర్యాలు కల్పించడం లేదన్నారు. తమ సమస్యలను గతంలో అనేకసందర్భాల్లో అధికారులకు, మంత్రులకు వివరించినా పట్టించుకోవడం లేదు. ముఖ్యంగా మహిళా టీచర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పాఠశాల సాధారణ సమయాలతో పాటు ప్రత్యేక తరగతుల పేరుతో గంటల కొద్దీ క్లాసులు ఏర్పాటు చేయడంతో మహిళా ఉపాధ్యాయులు శారీరక సమస్యలకు గురవుతున్నారు. పి.ఎఫ్, వైద్య, ఇతర సదుపాయాల నిమిత్తం ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. తమ సమస్యలపై ఆయన సానుకూలంగా పరిశీలిస్తామని హామీ ఇచ్చిన అమలు కావడం లేదని అన్నారు.

# పర్యావరణ విధ్వంసం మానాలి

### ప్రకృతి వైపరీత్యాలతో అతలాకుతలం

న్యూఢిల్లీ : పర్యావరణ సమతుల్యత దెబ్బతినడం,ప్యారిస్ ఒప్పందానికి అనుగుణంగా నడచుకోక పోవడం వంటి కారణాలతో దేశంలో ఏటేలా ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. ప్లాస్టిక్ వాడకం కూడా ఓ కారణంగా చెప్పుకోవాలి. దీంతో కాలువలు, నదులు, సముద్రాలు మురికి కూపాలుగా మారాయి. హిమానీ నదాలు కరగి పోతున్నాయి. దీంతో ప్రతికూల వాతావరణ పరిస్థితులు సాధారణం అయ్యాయి. దేశంలో ఎన్నడూ లేనంతగా రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలు ఏటేటా నమోదవుతున్నాయి. దేశంలో భానుడు భగ్గు మంటున్నాడు. పచ్చదనానికి ప్రాధాన్యం లేకుండా పోయింది. ఏటా మే వచ్చిందంటే గరిష్ట ఉష్ణోగ్రతలు 45 డిగ్రీలు దాటుతుండటంతో ఇండ్ల నుంచి బయటికొచ్చేందుకు జనం జంకుతున్నారు. వేడిగాలుల తీవ్రత అధికంగా ఉంటోంది. ఏటేటా భారీ వర్షాలు కురిసినా లక్షల క్యూసెక్కుల నీరు సముద్రం పాలు కాక తప్పలేదు. సముద్రం పాలు కాకుండా నీటిని ఒడిసి పట్టి తరవాతి కాలంలో ఉపయోగించే ప్రణాళికలు ఇంకా రూపుదిద్దు కోవడం లేదు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఈ తరహా ఆలోచనలు చేయక పోవడంతో ఏటా వరదల్లో ప్రజలు మునిగిపోతున్నారు. నదులు ఉప్పొంగినప్పుడు వేలాదిగ్రామాలు వరదల్లో చిక్కుకుంటున్నాయి. వర్షాలు కురిసిన ప్రతిసారీ కృష్ణా,గోదావరి జలాలు మళ్లీ సముద్రం పాలు కాక తప్పడంలేదు. వరదల్లో ప్రజల కష్టాలు వర్ణనాతీతంగా ఉన్నా పట్టించుకోలేదు. ఉత్తరాదిలో వరదలు ముంచెత్తుతున్నాయి. బీహార్,గుజరాత్,అసోం ,కేరళ తదితర రాష్ట్రాల్లోని అనేక ప్రాంతాలు, పట్టణాలు వరదనీటిలో మునిగిపోతున్నాయి. వరదలు వస్తే తక్షణ చర్యలు తీసుకునే అవకాశం లేకుండా పోతోంది. నగరాలతో పాటు, సమీప ప్రాంతాల్లో ఉన్నచెరువులను కుంటలను ఆక్రమించుకున్న కారణంగా కుండపోత వర్షంతో లోతట్టు ప్రాంతాలు జలమయమవుతున్నాయి. ప్రకృతి విధ్వంసం వల్ల వాతావరణ విపరీత ధోరణులు కానవస్తున్నాయి. వరదలు పంటలను, ప్రజలను నష్టాలపాల్జేశాయి. దేశంలో ఒక ప్రాంతంలో కరువు, మరో ప్రాంతంలో సాధారణ స్థాయి కంటే కొన్ని రెట్ల అధిక వర్షాలు పడటం పర్యావరణ సమస్య తీవ్రతకు సంకేతం. దీనిని అధిగమించే ప్రణాళికలు చేయాలి. పర్యావరణంపై ప్రజల్లో చైతన్యం తీసుకుని రావాలి.

# బీజేపీతోనే దేశాభివృద్ధి సాధ్యం

హైదరాబాద్ : ప్రధాని మోదీ పాలనలో దేశం అన్నిరంగాల్లో అభివృద్ధి చెందుతుందని, బీజేపీ ప్రభుత్వం తెల్లరేషన్ కార్డు కల్గిన ప్రతి ఒక్కరికీ ఐదు కిలోల బియ్యం మూడు సంవత్సరాల నుంచి ఉచితంగా అందిస్తోంది నరేంద్ర మోదీ సారథ్యంలోని బీజేపీ ప్రభుత్వం' అని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కోలన్ శంకర్ రెడ్డి, రంగారెడ్డి జిల్లా మైనారిటీ మోర్చానాయకుడు ముహ్మద్ నయీమ్ అన్నారు. మామిడిపల్లి గ్రామంలోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సన్నబియ్యం పథకంలో కూడా బీజేపీ ప్రభుత్వం 50 శాతం సబ్సిడీ ఇస్తుందని, ఇప్పటి వరకు అందించిన ఉచిత బియ్యంలో కేంద్ర ప్రభుత్వం వాటా ఎంత అంటే తెలంగాణ రాష్ట్రంలో మొత్తం 76 లక్షల తెల్లరేషన్ కార్డులు ఉన్నాయని తెలిపారు. వీటి ద్వారా 2.80 కోట్ల పేద ప్రజలకు లబ్ధిచేకూరుతుందన్నారు. కేంద్రప్రభుత్వం సుమారు 56 శాతం బరిస్తోందన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం 44 శాతం మాత్రమే బరిస్తుందన్నారు. తెలంగాణ రాష్ట్రంలోని రేషన్ షాపుల్లో ఎక్కడ కూడా మోదీ పేరు కానీ, ఆయన ఫొటో కానీ పెట్టలేదన్నారు. ఇప్పుడు ప్రవేశపెట్టిన సన్నబియ్యం పథకంలో కూడా కేంద్ర ప్రభుత్వం వాటా 41శాతం ఉందని, ఈ పథకం ద్వార రాష్ట్ర ప్రభుత్వానికి భారం అధికంగా పడుతుందన్నారు. దీనికి రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం, ఆ పార్టీ నాయకులు చేసే హడావిడి అంతాఇంతా కాదన్నారు. మొత్తం రాష్ట్ర ప్రభుత్వమే ఇచ్చినట్టే ప్రకటించుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ మోర్చా అధ్యక్షుడు పెరమోని నరేష్‌యాదవ్, గురజాని గణేష్‌గౌడ్, గుజ్జుల పద్మారావు, యాతం మహేందర్‌యాదవ్, యాతం శ్రీకాంత్, చిల్కూరి శంకర్, కర్ణకోట జగదీష్, ఆదిల అర్జున్, ఆదిల నర్సింహ, ఆదిల బలరాజ్, పాల్గొన్నారు.

# వేసవి ఎండల్లో అగ్నిప్రమాదాలు

### అడవుల్లో మంటల నివారణకు చర్యలు

ఆదిలాబాద్ : వేసవి ఎండలు తీవ్రం అవుతున్నందున అగ్నిప్రమాదాలు జరక్కుండా గ్రామాల్లో జాగ్రత్తలు పాటించాలని అధికారులు క్షేత్రస్థాయిలో అధికారులను ఆదేశించారు. అలాగే అడవుల్లో మంటలు చెలరేగకుండా అటవీ అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. అలాగే గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని అన్నారు. రైతులు వరి పొలాల్లో చెత్తను కాలబెట్టే సమయంలో సమీప అటవీ సంపదకు నష్టం కలగకుండా ముందస్తు జాగ్రత్తలను తీసుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు. వేసవి కాలంలో అటవీ సంపద అగ్నికి ఆహుతి అవుతుందని, దానిని కాపాడేందుకు స్థానిక వీఆర్వోలు చర్యలు తీసుకోవాలని గ్రామ సంరక్షణ కమిటీలు, వీఆర్వోలు గ్రామంలోని వారందరికీ అటవీసంపద కాపాడుకునే అంశాన్ని వివరించాలన్నారు. ఇకపోతే ఎండాకాలంలో విద్యుత్ వైర్లు ఒకదానికొకటి రాపిడి కావడంతో నిప్పురవ్వలు ఎగిసి పడి ఎండిన ఆకులపై పడి మంటలు వ్యాపించే అవకాశాలు కూడా ఉన్నాయి. ఇలాంటి ఘటనలపై గతంలోనూ ముందస్తు హెచ్చరికలుచేశారు. గ్రామ పటాలు, రైతుల భూములు తదితర వివరాలు దగ్గర పెట్టుకుని ప్రమాదం జరిగిన వెంటనే వెళ్లేలా ప్లాన్ చేసుకోవాలన్నారు. ఎప్పటికప్పుడు తహసీల్దార్లకు తెలియజేయాలని సూచించారు. ఆ తర్వాత మండల నివేదికలను డీఆర్వోకు సమర్పించాలని ఆదేశించారు.


# పవన్ కళ్యాణ్‌తో నాగబాబు భేటీ

### అన్నకు శుభాకాంక్షలు తెలిపిన తమ్ముడు

అమరావతి : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ను గురువారం జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ నాగబాబు మర్యాదపూర్వకంగా కలిశారు. విజయవాడలో వీరిద్దరూ ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. అయితే, ఎమ్మెల్సీగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత నాగబాబుకు డిప్యూటీ సీఎం పవన్ శుభాకాంక్షలు తెలియజేశారు. కాగా, ఇటీవల ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీగా ఎన్నికైన కొణిదెల నాగబాబు.. ఏప్రిల్ 2వ తేదీ నాడు ప్రమాణ స్వీకారం చేశారు. బుధవారం నాడు మధ్యాహ్నం ఎమ్మెల్సీగా ప్రమాణ స్వీకారం చేసిన నాగబాబుకు మెగాస్టార్ చిరంజీవి శుభాకాంక్షలు తెలిపారు. ఆంధ్ర ప్రదేశ్ విధాన పరిషత్ సభ్యుడిగా ప్రమాణస్వీకారం చేసిన తమ్ముడు నాగబాబుకి అన్నయ్య, వదిన ఆత్మీయ అభినందనలు, ఆశీస్సులు తెలియజేస్తున్నామని ఎక్స్ వేదికగా రాసుకొచ్చారు.

# వంశీధరుని కంస విధ్వంసనం

శుకయోగి పరీక్షిత్తుతో రాజా! సరాముడైన శ్యాముడు ధనుశ్శాలకు వెళ్లి వామహస్తంతో ధనుస్సును పైకెత్తి, అల్లెత్రాడు బిగించి, వేదండం- ఏనుగు ఇక్షుదండాన్ని- చెరకు గడను వలె, రెండుగా విరిచాడు. ఆ ధ్వని వీనులకు భయంకరమై కంసుని ధైర్యాన్ని భేదించింది. మీదికి వచ్చిన చాప రక్షకులను రామకృష్ణులిద్దరూ చెరో వింటి తుంట పట్టుకొని కొట్టి మట్టుబెట్టారు. ఇలా మధురా నగరంలో కడు వేడుకతో విహరించి సోదరులు తమ విడుదులకు విచ్చేశారు. ఈ సందర్భంలో అమాత్యుడు చేసిన సూర్యాస్తమయ చంద్రోదయ వర్ణనలు సహృదయ హృదయాహ్లాదకరంగా, సరసంగా సాగినై. ఇందు- చంద్ర ఉదయానికి ముకుళించు కొన్న ఇందీవరాలను- అరవిందాలను (పద్మాలను) ఎంత హృదయంగమంగా ఉత్ప్రేక్షించి వర్ణించాడో వీక్షించండి. తాను కళాధరుడు (చంద్రుడు)- కళలు ధరించిన వాడగు గాక, కమలాలయ- లక్ష్మికి తోబుట్టువగు గాక, సెగకంటి (శివుని) శిగ (తల) నెక్కి నిక్కుగాక, ఇంతవాడైనా అన్యుడైన చందురుని పొత్తు మాకు ఎంతమాత్రమూ అక్కర లేదు. తపనుడు- తపింప జేసేవాడైనప్పటికీ మా పతి తరణి- సూర్యుడే అని ఉత్తమురాలైన నాతి- పతివ్రత స్త్రీ వలె పద్మినీ జాతి మూతి ముడుచుకొందిట! ఆటవెలది ఐనా పై పద్యంలో 'సతీధర్మం' చాలా తేటగా- ఇల్లాలికి దీటైన బాటగా అప్రతిహతంగా నిరూపితమైంది. పోతన గావించిన ఇలాంటి వర్ణనలే భావి ప్రబంధ కవులకు 'మేలుబంతి' అయ్యాయి. శుకుడు- రాజా! ఆ రాత్రి క్రూరుడైన భోజపతి కంసునికి ఓజ (శోభ, వికాసం) చెడి నిద్ర పట్టలేదు. దారుణమైన దుశ్శకునాలు చూచాడు. మృతికి హేతువైన భీతితో అతని మతి అతిగా కలత చెందింది. మరునాడు మల్లయుద్ధానికి సిద్ధమైన రంగంలో కంసుడు ఎత్తయిన మంచెపై మనసులో ఇంచుకైనా శాంతి లేకుండా కూర్చున్నాడు. నందాదులు కంసుని అనుజ్ఞతో ఉన్నత ఆసనాలను అలంకరించారు. రామకృష్ణులు రంగస్థలం ప్రవేశ ద్వారం వద్ద వేచి ఉన్న, తొండంతో కొండలను కూడా పిండి చేయగల 'కువలయాపీడమ'నే మత్త వేదండాన్ని- ఏనుగును చూచి సమీపించారు. అంత, మావటి మురభంజను- కృష్ణునిపై ఆ కుంజరాన్ని ఢీ కొలిపాడు. కువలయాపీడం- భూ వలయాన్ని- మానవజాతిని మిక్కిలిగా పీడించే మద, మోహ, దర్పాలకు చక్కని ప్రతీకం.



ఆధ్యాత్మికం

## దొడ్డి కొమురయ్య పోరాట స్ఫూర్తి ఆదర్శం

### - అదనపు కలెక్టర్ డి.వేణు



**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** దొడ్డి కొమురయ్య పోరాట స్ఫూర్తి మనందరికీ ఆదర్శమని అదనపు కలెక్టర్ డి.వేణు తెలిపారు. గురువారం అదనపు కలెక్టర్ డి.వేణు సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని సమావేశం మందిరంలో నిర్వహించిన దొడ్డి కొమురయ్య 98వ జయంతి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ డి.వేణు దొడ్డి కొమురయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ డి.వేణు మాట్లాడుతూ దొడ్డి కొమురయ్య సాయుధ పోరాటంలో నేలరాలిన తొలి రక్తపు చుక్క అని,నిరంకుశ పాలన నుంచి స్వేచ్ఛ వాయువులు పీల్చేందుకు ఆత్మ గౌరవ పతాకాన్ని ఎగుర వేసేందుకు ప్రాణాలు పణంగా పెట్టిన గొప్ప యోధుడు కొమురయ్య అని, ఆయన చూపిన పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శమని తెలిపారు. మహనీయులను ఒక కులానికో, ఒక వర్గానికో పరిమితం చేయకుండా ఆయన ఆశయాలను నేటితరం ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ అధికారి రంగారెడ్డి, సంఘ అధ్యక్షులు మల్లేశం, జిల్లా అధికారులు, కలెక్టరెట్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ఎల్ఆర్ఎస్ గడువు పెంపు పేదలకు ఊరట

### - రియల్ ఎస్టేట్ ఏజెంట్ల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎరుకల రమేష్



**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** ఎల్ఆర్ఎస్ గడువు పెంపు పేదలకు ఊరటనిచ్చిందని పెద్దపల్లి జిల్లా రియల్ ఎస్టేట్ ఏజెంట్ల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎరుకల రమేష్ అన్నారు. ఎల్ఆర్ఎస్ సర్వర్ సమస్యల కారణంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, గడువు పెంచాలని తమ సంఘం చేసిన విజ్ఞప్తికి ప్రభుత్వం సానుకూలంగా స్పందించిందని ఆయన తెలిపారు. గడువు పెంచినందుకు ప్రభుత్వానికి, స్థానిక ఎమ్మెల్యే విజయరమణా రావుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు .రియల్ ఎస్టేట్ రంగంలో ఏజెంట్ల పాత్ర కీలకమని, కొందరు వ్యక్తులు ఏజెంట్ల వ్యవస్థపై తప్పుడు కథనాలు రాసి వారిని అవమానపరుస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రియల్ ఎస్టేట్ కొనుగోలుదారులు, అమ్మకం దారులకు మధ్య వారధిగా ఉంటూ, వ్యాపారంలో కీలక పాత్ర పోషిస్తున్న ఏజెంట్లపై బురద జల్లడం మానుకోవాలని ఆయన హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల పక్షపాతి అని మరోసారి రుజువైందని ఆయన అన్నారు.

## జనరేటివ్ ఏఐ వర్క్ షాప్‌లో పాల్గొన్న వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కె. కిషన్ కుమార్ రెడ్డి



**కూకట్ పల్లి ఏప్రిల్ 03 (ది క్రైమ్ న్యూస్):** జేఎన్టీయూహెచ్ డిపార్ట్మెంట్ ఆఫ్ ఐటీ విభాగం సీఆర్సీలో "స్పిరిట్ 2025" ఫెస్టివల్ లో భాగంగా జనరేటివ్ "ఏఐ వర్క్ షాప్" ను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కె.కిషన్ కూమార్ రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కె. వెంకటేశ్వరరావు, ప్రిన్సిపల్ ప్రొఫెసర్ జివి నర్సింహ రెడ్డి, హెచ్ఓడి ప్రొఫెసర్ ఉమారాణి వక్తలు గా రవితేజ, ఫౌండర్ ఆఫ్ వర్టొసిటి, డి. నిహార్, కో ఫౌండర్ ఆఫ్ కోడ్ డెల్ ఆచార్యులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కె. కిషన్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఆధునిక ప్రపంచంలో కృత్రిమ మేధస్సును ప్రతి రంగంలో ఉపయోగించి అద్భుతమైన ప్రగతి సాధిస్తున్నారని అన్నారు. కృత్రిమ మేధస్సు రంగంలో విద్యా, ఉపాధి, వ్యాపార పరంగా ప్రపంచ వ్యాప్తంగా అద్భుతమైన అవకాశాలు ఉన్నందున విద్యార్థులు గతంలో జరిగిన పరిశోధనల్లోని లోపాల పై, నూతన ఆవిష్కరణల కోసం బలమైన లక్ష్యాలు నిర్దేశించుకొని, కష్టపడి ఇష్టంతో చదివుకొని ప్రకృతికనుగుణంగా ముందుకు సాగుతూ నూతన పరిశోధనలు చేసి కృత్రిమ మేధస్సు ద్వారా విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని తెలిపారు. కార్యక్రమంలో వర్క్ షాప్ ఫ్యాకల్టీ నవీణ్ కుమార్, స్టూడెంట్ కోఆర్డినేటర్ సుకుమార్ రెడ్డి, కార్తీకేయ శర్మ, ఆచార్యులు , విద్యార్థులు పాల్గొని విజయవంతం చేశారు.

## ఛత్రపతి శివాజీ మహారాజ్‌కు నివాళులర్పించిన ముమ్మారెడ్డి ప్రేమ కుమార్




**కూకట్ పల్లి ఏప్రిల్ 03 (ది క్రైమ్ న్యూస్):** ఛత్రపతి శివాజీ మహారాజ్ వర్ధంతిని పురస్కరించుకొని కెపిహెచ్బి 5వ ఫేస్ లోని జనసేన పార్టీ కార్యాలయంలో కూకట్ పల్లి నియోజకవర్గ జనసేన కంటెస్టెడ్ ఎమ్మెల్యే ముమ్మా రెడ్డి ప్రేమ కుమార్ ముఖ్య అతిథులుగా హాజరై ఛత్రపతి శివాజీ మహారాజ్ చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ప్రేమ కుమార్ మాట్లాడుతూ ఛత్రపతి శివాజీ మహారాజ్ వర్ధంతి ఏప్రిల్ 03 న, మరాఠా యోధుడు రాజు యుద్ధ భూమిలో శౌర్యసాహసాలకు గుర్తుగా జరుపుకుంటారని అన్నారు. ఛత్రపతి శివాజీ మహారాజ్ నైపుణ్యం కలిగిన నాయకుడు, వీర యోధుడు. అతను గెరిల్లా యుద్ధంలో నిపుణుడు. రహస్య సైనిక కార్యకలాపాలను ప్లాన్ చేశాడని, అతని రహస్య యుద్ధం కారణంగా అతన్ని తరచుగా "పర్వత ఎలుక" అని పిలుస్తారని అన్నారు. శివాజీ మహారాజ్ కి రామాయణం, మహాభారతం గురించి చాలా తెలుసనీ, ఆసక్తిగల పాఠకుడనీ, అతను ఎటువంటి అధికారిక పాఠశాల విద్యకు హాజరు కాలేదని గుర్తు చేశారు కార్యక్రమంలో జనసేన నాయకులు కొల్లా శంకర్, భోగాది వెంకటేశ్వరరావు, వేముల మహేష్, కాలిగినీడి ప్రసాద్, ఆత్మూరి మోహన్, పాదం సూర్య, మండల రమేష్, శేఖర్, మారుతి, పులగం సుబ్బు, వీరమహిళ యాళ్ల శిరీష తదితరులు పాల్గొన్నారు.

# గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కట్టుదిట్టమైన చర్యలు

- గర్భిణీ స్త్రీల వివరాలను పకడ్బందీగా ట్రాకింగ్ చేయాలి
- ఉపాధి హామీ కూలీల సంఖ్య పెంచాలి
- అంతర్గాంలో విస్తృతంగా పర్యటించిన జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** మండలంలోని గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు.గురువారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అంతర్గాం మండలంలో విస్తృతంగా పర్యటించారు. అంతర్గం మండల రెవెన్యూ అధికారి కార్యాలయం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయాల ను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ రాజీవ్ యువ వికాసం పథకం కింద ఆఫ్ లైన్ దరఖాస్తులను స్వీకరించాలని, వాటిని ఆన్ లైన్ లో పకడ్బందీగా నమోదు చేయాలని కలెక్టర్ సూచించారు. ఉపాధి హామీ పనులకు సంబంధించి లేబర్ సంఖ్య పెంచాలని, కార్మికులకు ఉపాధి హామీ కూలీ వేతనాలు ఎటువంటి ఆలస్యం లేకుండా జమ చేయాలని కలెక్టర్ ఆదేశించారు.గ్రామీణ ప్రాంతాలలో పారిశుధ్య నిర్వహణ పై అధిక దృష్టి సాధించాలని అన్నారు.ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ద్వారా గర్భిణీ స్త్రీల వివరాలు ట్రాకింగ్ పకడ్బందీగా జరగాలని అన్నారు. 102 వాహనాలు నిర్దేశిత షెడ్యూల్ ప్రకారం గర్భిణీ స్త్రీలను చెకింగ్ కు తీసుకొని రావాలని అన్నారు. డయాగ్నొస్టిక్ హబ్ ద్వారా ఉచిత పరీక్షలు నిర్వహించాలని అన్నారు. ఔట్ పేషెంట్ సేవలు మరింత మెరుగయ్యేలా చూడాలని అన్నారు. ఆసుపత్రిలో మెడిసిన్ రీజిస్టర్ పక్కాగా మెయింటేన్ చేయాలని, వివరాలను ఆన్ లైన్ లో నమోదుద చేయాలని అన్నారు. ఎన్.సి.డి నిర్ధారణ సర్వే సకాలంలో పూర్తి చేయాలని అన్నారు.ప్రభుత్వ పాఠశాలలో చదివి విద్యార్థులకు కనీస అభ్యాసన సామర్థ్యాలు ఉండే విధంగా ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ సూచించారు. తెలుగు ఆంగ్లం, చదవడం, రాయడం తప్పనిసరిగా రావాలని, చిన్న చిన్న గణిత లెక్కలు చేయాలని, ఆ దిశగా నూతన రీతిలో విద్యార్థులకు బోధన జరగాలని అన్నారు.మండలి రెవెన్యూ అధికారి కార్యాలయంలో రికార్డుల నిర్వహణ కట్టుదిట్టం చేయాలని అన్నారు. ప్రజావాణి ద్వారా వచ్చే దరఖాస్తుల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ సూచించారు.ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట ఎంపిడిఓ వేణు మాధవ్, వైద్యాధికారి డాక్టర్ ఉదయ కిరణ్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.





# తెలంగాణలో సన్నబియ్యం పంపిణీ దేశానికి ఆదర్శం

- పేదల కడుపు నింపడానికే సన్న బియ్యం సరఫరా
- పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణ రావు





**పెద్దపల్లి ఏప్రిల్ 03( ది క్రైమ్ న్యూస్ ):** తెలంగాణలో సన్నబియ్యం పంపిణీ దేశానికి ఆదర్శమని పెద్దపల్లి ఎమ్మెల్యే విజయ రమణారావు తెలిపారు. పెద్దపల్లి మండలం చీకురాయిలోని రేషన్ దుకాణంలో గురువారం లబ్ధిదారులకు సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే విజయ రమణారావు మాట్లాడుతూ గ్రామాల్లో పేద ప్రజల ఆకలి గోస తీర్చేందుకు దేశంలోనే మొట్టమొదటి సారిగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా సన్నబియ్యం పంపిణీ చేస్తోందన్నారు. పేదలకు సమృద్ధిగా సన్న బియ్యం రేషన్ షాపుల ద్వారా సరఫరా చేయడం జరుగుతుందని ఎమ్మెల్యే తెలిపారు. రాష్ట్రంలోని రేషన్ షాపులలో తెల్లకార్డు దారులకు ఇక నుంచి ప్రతి నెల సన్న బియ్యం పంపిణీ చేయడం జరుగుతుందని, వానాకాలం వరి పంట కొనుగోలు సమయంలో రైతులకు క్వింటాల్ కు రూ.500 బోనస్ చెల్లించి సన్న రకం ధాన్యం కొనుగోలు చేశామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కొనుగోలు చేసిన సన్న రకం ధాన్యాన్ని మిల్లింగ్ చేయించి పేదలకు ఉచితంగా పంపిణీ చేస్తున్నామని పెద్దపల్లి నియోజకవర్గంలో చౌక ధరల దుకాణాల ద్వారా ఇక నుంచి సన్న రకం బియ్యం మాత్రమే పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రాజయ్యమాజీ జడ్పీటిసి బండారి రాంమూర్తి మార్కెట్ చైర్ పర్సన్ ఈర్ల స్వరూప మాదిరెడ్డి నర్సింహ రెడ్డిమండల సుధాకర్ రెడ్డి, ఓదెల శ్రీనివాస్ నర్రా కుమార్ సదయ్య జక్కుల సందీప్మల్లయ్య శ్రీనివాస్ శెంకర్ తదితరులు పాల్గొన్నారు.

# దాతల సహకారం అభినందనీయం

### - రాష్ట్ర కళాశాల విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్లు ప్రొ. జి. యాదగిరి, ప్రొ. రాజేందర్ సింగ్ ఏ జీవో పి. బాలభాస్కర్

**జమ్మికుంట ఏప్రిల్ 3 (ది క్రైమ్ న్యూస్):** ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని విద్యార్థులకు మధ్యాహ్న భోజనం ఏర్పాటుచేసిన దాతల సహకారం అభినందనీయమని తెలంగాణ రాష్ట్ర కళాశాల విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్లు ప్రొ. జి. యాదగిరి, ప్రొ. రాజేందర్ సింగ్ మరియు అకాడమిక్ గైడెన్స్ ఆఫీసర్ ప్రొఫెసర్ పి. బాలభాస్కర్ అన్నారు. జమ్మికుంట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం దాతలైన కళాశాల పూర్వ విద్యార్థులు, కాటన్ మిల్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బచ్చు భాస్కర్, కాటన్ మిల్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు దొనకొండ మల్లారెడ్డిల సహకారంతో కళాశాల ప్రిన్సిపాల్ డా. బి. రమేష్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన మధ్యాహ్న భోజన పథకాన్ని అంతర్జాల వేదిక ద్వారా వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత కళాశాలలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేసిన దాతలను, కళాశాల ప్రిన్సిపాల్ ను, అధ్యాపకులను వారు అభినందించారు. కళాశాలలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం కల్పించడం వల్ల మరింత మెరుగైన ఫలితాలను సాధించవచ్చునన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విద్యార్థులు బాగా చదువుకొని కేంద్రీయ, రాష్ట్రీయ విశ్వవిద్యాలయాలలో పీజీ సీట్లను సాధించాలని సూచించారు. సమయం వృథా చేయకుండా ఉద్యోగ పోటీ పరీక్షలకు విద్యార్థులు సన్నద్ధమవ్వాలన్నారు. అనంతరం దాతలైన బచ్చు భాస్కర్ మాట్లాడుతూ విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ముందు ముందు కళాశాలకు మరింత తన సహాయ సహకారాలు అందిస్తామన్నారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు దాతయైనా బచ్చు భాస్కర్ ను శాలువా, పుష్ప గుచ్ఛంతో ఘణంగా సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల వైస్-ప్రిన్సిపాల్ డా. ఎస్. ఓదెలు కుమార్ డా. రాజేంద్రం, డా. గణేష్, డా. శ్యామల, డా. మాధవి, వి.కిరణ్ కుమార్, సి. రాజకుమార్, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.





# శ్రీ రామచంద్ర స్వామి దేవాలయ వార్షిక బ్రహ్మోత్సవాలు

### - అలియాబాద్‌లో ఏప్రిల్ 05 నుంచి..

**శామీర్ పేట, ఏప్రిల్ 03 (ది క్రైమ్ న్యూస్) :** శ్రీ రామచంద్ర స్వామి దేవాలయ వార్షిక బ్రహ్మోత్సవాలు ఏప్రిల్ 5 తారీకు నుంచి ప్రారంభమ వుతున్నాయని గురువారం ఆలయ అర్చకులు తెలిపారు. శామీర్ పేట మండలం అలియాబాద్ గ్రామంలో ఈనెల 5వ తేదీ నుంచి 12వ తేది వరకు శ్రీ రామచంద్ర స్వామి దేవాలయ వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. 5వ తేదిన గణపతిపూజ, స్వస్తివచనము, భేరిపూజ, 6న శ్రీరామ చంద్రస్వామి అభిషేకము, ఎదుర్కోలు, సీతారాముల కళ్యాణం, 10న నాకబలి,12న తెల్లవారు జామున స్వామివారి రథోత్సవం, జాతర నిర్వహించనున్నట్లు తెలిపారు.



# పేదల ఆకలి తీర్చింది నాడు ఎన్టీఆర్.. నేడు రేవంత్ రెడ్డి

- ప్రజా పాలన దరఖాస్తుల ఆధారంగా కొత్త రేషన్ కార్డులు సన్నవడ్లకు బోనస్..
- రేషన్ షాపుల్లో సన్న బియ్యం దేశంలోనే చారిత్రాత్మకం - దశలవారీగా ఇచ్చిన హామీలన్నీ తీర్చుతాం







**పెద్దపల్లి ఏప్రిల్ 03 ( ది క్రైమ్ న్యూస్ ):** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సన్న బియ్యం పథకాన్ని ఓదెల మండల కేంద్రం లో కొలనూరు గ్రామం లో ఉన్న రేషన్ దుకాణలల్లో గురువారం రోజున స్థానిక నాయకులతో కలిసిఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు రేషన్ కార్డుదారులకు సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు ఈ సందర్బంగా వారు మాట్లాడుతూనాడు దివంగత నేత, మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు అధికారంలోకి వచ్చినప్పుడు రూ.2కే కిలో బియ్యాన్ని ప్రవేశపెట్టి పేదల ఆకలి తీర్చాడని, ఈరోజు సీఎం రేవంత్ రెడ్డి దొడ్డు బియ్యానికి బదులు సన్న బియ్యాన్ని అందిస్తూ మరో చరిత్ర సృష్టించాడని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు అన్నారు. సన్న బియ్యం పంపిణీ దేశంలోనే చారిత్రాత్మక నిర్ణయం అని కొనియాడారు. సన్న బియ్యం వల్ల రాష్ట్రంలో ప్రభుత్వానికి అదనంగా 3 వేల కోట్ల రూపాయల భారం పడినప్పటికీ పేదల సంక్షేమం పట్ల ఉన్న నిబద్ధతతో ప్రభుత్వం బరిస్తోందన్నారు. ప్రజా పాలనలో ఇచ్చిన దరఖాస్తుల ఆధారంగా త్వరలోనే అర్హులైన అందరికీ తెల్ల రేషన్ కార్డులను అందించనున్నట్టు చెప్పారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం పేదల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిందని, డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు, రేషన్ కార్డులు, సన్న బియ్యం, కొత్త పింఛన్లు ఇవ్వకుండా ప్రజలను దగా చేసిందని అన్నారు. సన్న వడ్ల పంటలను ప్రోత్సహించేందుకు క్వింటాలకు రైతులకు 500 రూపాయల బోనస్ చెల్లించడం జరుగుతుందని చెప్పారు. రాష్ట్రంలోనే పెద్దపల్లి నియోజకవర్గంలో అత్యధికంగా సన్న వడ్లను పండిస్తున్నారని తెలిపారు. దశలవారీగా ప్రజలకు ఇచ్చిన అన్ని హామీలను నెరవేర్చుతామని ఆయన స్పష్టం చేశారు. ఇప్పటికే ఉచిత బస్సు ప్రయాణం, గృహజ్యోతి పథకం కింద ఉచిత కరెంటు, రూ. 500 కే గ్యాస్, సన్న బియ్యం పంపిణీ, రైతులకు ఏకకాలంలో 2 లక్షల రూపాయల రుణమాఫీ, సన్న వడ్లకు 500 రూపాయల వంటి స్కీములను అమలు చేస్తున్నామని చెప్పారు. అనంతరం 49.50 లక్షల రూపాయలతో పలు అభివృద్ధి కార్యక్రమాలకు పెద్దపల్లి ఎమ్మెల్యే శ్రీకారం చుట్టారు. ఓదెల మండల కేంద్రంలో ఎస్సీ సబ్ ప్లాన్, ఎం.జి.ఎన్.ఆర్.ఈ.జి.ఎస్, ఎస్.డి.ఎఫ్ మరియు పలు గ్రాంట్ల ద్వారా నూతన సీసీ రోడ్ల నిర్మాణం అలాగే స్పెషల్ రిపైర్స్ స్కూల్ కిచెన్ షెడ్స్ మరియు హెల్త్ సెంటర్ నిర్మాణం కోసం మొత్తం ?49.50 లక్షల రూపాయల నిధులతో పలు అభివృద్ధి పనులకు స్థానిక నాయకులతో కలిసి శంకుస్థాపనలు చేశారు ఈ కార్యక్రమంలో పెద్దపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ ఈర్ల స్వరూప కాంగ్రెస్ పార్టీ ఓదెల మండల అధ్యక్షులు,మూల ప్రేమ సాగర్ రెడ్డి సింగిల్ చైర్మన్అల్లా సుమన్ రెడ్డిగోపు నారాయణ రెడ్డి డైరెక్టర్లు, మాజీ సర్పంచ్ ఆకుల మహేందర్ రెడ్డి రజినీకాంత్, చికట్ల మందయ్య, బైరి రవి ఢిల్లీ శెంకర్ ఎంపీటీసీ లు మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు గ్రామస్తులు మరియు యూత్ కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# త్వరలో నవజాత శిశు కేంద్రం ప్రారంభం

- ఆసుపత్రికి చేరుకున్న 35 లక్షల విలువ గల పరికరాలు
- మాతా శిశు ఆసుపత్రిని తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష



**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** పెద్దపల్లి మాతా శిశు ఆసుపత్రిలో నవ జాత శిశు కేంద్రం త్వరలో ప్రారంభించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు.గురువారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష పెద్దపల్లి పట్టణంలోని మాతా శిశు సంరక్షణ కేంద్రాన్ని తనిఖీ చేశారు. మాత శిశు సంరక్షణ కేంద్రంలో నవజాత శిశు కేంద్రం ఏర్పాటుకు వచ్చిన పరికరాలను కలెక్టర్ పరిశీలించారు. జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ ఐఓసిఎల్ సంస్థ వారు కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సిఎస్ఆర్) క్రింద వార్మర్స్, డబుల్ సర్ఫర్ ఫోటో థెరపీ, ఆటోక్లేవ్, సక్షన్ అపారేటస్ బబ్ల్ సి పాప్, వెంటిలేటర్ ఇన్ఫుశాన్ పంప్, సిరంజ్ పంప్ పోర్టబుల్ రే వంటి పరికరాలను అందించారని కలెక్టర్ తెలిపారు.నవజాత శిశు కేంద్రం ఏర్పాటుకు అవసరమైన 35 లక్షల విలువ చేసే వివిధ వైద్య పరికరాలు మాత శిశు ఆసుపత్రికి చేరుకున్నాయని, వీటిని త్వరగా అమర్చి నవ జాత శిశు కేంద్రం ప్రారంభానికి అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రసవాల సంఖ్య పెరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రి పరిసరాలో శానిటేషన్ పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని చెప్పారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీధర్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ అన్న ప్రసన్న కుమారి, పిల్లల వైద్య నిపుణులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ సీతారాముల బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి

### - ఆలయ కార్య నిర్వహణ అధికారి కంది సుధాకర్



**ఇల్లందకుంట ఏప్రిల్ 3 (ది క్రైమ్ న్యూస్):** శ్రీ సీతారాముల బ్రహ్మోత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లు ఆలయ కార్య నిర్వహణ అధికారి కంది సుధాకర్ తెలిపారు. ఈ సందర్భంగా ఈవో విలేకరులతో మాట్లాడుతూ అపర భద్రాద్రిగా పేరుగాంచిన శ్రీ సీతారామచంద్రస్వామి బ్రహ్మోత్సవాలు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. సీతారాముల బ్రహ్మోత్సవాలు ఈనెల 4వ తేదీ నుండి ప్రారంభమవుతాయని ఆరవ తేదీన శ్రీ సీతారామచంద్రస్వామి కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరుగుతుందని భక్తులు దూర ప్రాంతాల నుండి అధిక సంఖ్యలో భక్తులు కళ్యాణ మహోత్సవంలో పాల్గొంటారని వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ఈవో తెలిపారు. వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని త్రాగునీటికి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేసినట్లు అలాగే చలువ పందిళ్లను వేసినట్లు తెలిపారు. కళ్యాణ మహోత్సవం రోజున భక్తులకు భోజన ఏర్పాట్లను జమ్మికుంట మిల్లర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమం కూడా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

## రేషన్ షాపుల్లో ప్రధాన మంత్రి మోడీ చిత్ర పటాన్ని ఏర్పాటు చేయాలి..



**కమాన్ పూర్, (ది క్రైమ్ న్యూస్):** కమాన్ పూర్ మండలంలోని గ్రామాల్లో గల అన్ని చౌక ధరల (రేషన్ షాపుల్లో ) దుకాణాల్లో ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ చిత్ర పటం ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతూ.. తహసీల్దార్ వాసంతికి గురువారం బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. దేశ వ్యాప్తంగా గరీబ్ కళ్యాణ్ యోజన పథకం ద్వారా ఉచిత రేషన్ బియ్యం కేంద్ర ప్రభుత్వం అందజేస్తుందని ఈ సందర్భంగా ప్రధాన మంత్రి చిత్ర పటన్ని రేషన్ షాపుల్లో ఉంచాలిసిన భాద్యత ఉందని వినతి పత్రంలో పేర్కొన్నారు. వినతి పత్రం అందజేసిన వారిలో బీజేపీ మండల అధ్యక్షులు కొయ్యడ సతీష్ యాదవ్, నాయకులు మట్ట శంకర్, జంగపెల్లి అజయ్, మల్లారపు అరుణ్ కుమార్, బర్ల సదానందం, సాగంటి లక్ష్మణ్ స్వామి, పిడుగు రమేష్, కొమ్ము శ్రీనివాస్, బోగే రవితేజ, గోపు పర్వతాలు, మండల సంతోష్, జంగపెల్లి శేఖర్, అగ్గి శ్రవణ్ లతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి ప్రశంస పత్రాన్ని అందుకున్న జమ్మికుంట మున్సిపల్ కమిషనర్...




**జమ్మికుంట ఏప్రిల్ 3 (ది క్రైమ్ న్యూస్):** జమ్మికుంట: రాష్ట్ర స్థాయి కమిషనర్ లతో సి. డి. ఎం. ఏ. శ్రీదేవి గారు అధ్యక్షతన ఏం. సి. ఆర్ , హెచ్. ఆర్. డి. హైద్రాబాద్ లో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశ అనంతరం రాష్ట్ర స్థాయిలో ఆస్తి పన్నుల వసూళ్లలో మొదటి స్థానంలో నిలిచిన జమ్మికుంట మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ అయాజ్ కు సి.డి. ఎం. ఏ. టి కె శ్రీదేవి గారి చేతుల మీదుగా ప్రశంస పత్రాన్ని, మరియు ఎల్లప్పుడు ఉత్తమా ప్రతిభ కనబరుస్తున్నందున అవార్డ్ (కాన్సెంట్ అచీవర్ అవార్డ్) గురువారం అందజేశారు. ఈ సందర్భంగా కమిషనర్ అయాజ్ మాట్లాడుతూ జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలోని మా మున్సిపల్ సిబ్బంది, ప్రజలు, ప్రజా ప్రతినిధులు, సామాజిక సంఘాల నేతల సహకారంతో ఇంత గొప్ప ప్రశంస పత్రాన్ని అందుకోగలిగామని, దీనికి సహకరించిన ప్రతి ఒక్కరికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు

**ముత్తారం.ఏప్రిల్.03.(ది క్రైమ్ న్యూస్):** ముత్తారం మండలం ఖమ్మంపల్లి గ్రామానికి చెందిన తీర్థాల కొమురెల్లి పై కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలించారు.ఎస్సై గోపతి నరేష్ తెలిపిన వివరాల ప్రకారం ఖమ్మంపల్లి గ్రామానికి చెందిన తీర్థాల సురేష్ కు గ్రామంలో స్థలం కలదు.ఈ స్థలంపై తీర్థాల కొమురెల్లి అనే వ్యక్తితో భూ వివాదం కొనసాగుతోంది.ఈ నెల 1న సాయంత్రం సమయంలో తీర్తాల కొమురెల్లి వచ్చిసురేష్‌తో గొడవ పడి పక్కనే ఉన్న పైప్‌తో కొట్టాడు. అనంతరం గొడ్డలితో దాడి చేశాడు.ఈ సంఘటన మొత్తం సీసీ కెమెరాలో రికార్డు అయింది.తీర్థాల సురేష్ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

## మృతుల కుటుంబలకు 10వేల రూ, ఆర్థిక సహాయం

### - మండల కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి తుంకి రమేష్



**శామీర్ పేట, ఏప్రిల్ 03 (ది క్రైమ్ న్యూస్) :** మండలంలోని మజీద్ పూర్ గ్రామానికి చెందిన తుంకి బాలమ్మ, గొట్టిముక్కుల ఎల్లయ్య అనారోగ్యంతో బుధవారం మృతి చెందారు. వారి కుటుంబలకు గురువారం మండల కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి తుంకి రమేష్ 10 వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వారి కుటుంబానికి ప్రతి ఒక్కరు ఆదుకొని మనోధైర్యాన్ని కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి డైరెక్టర్ తుంకి బిక్షపతి, మండల యూత్ కాంగ్రెస్ నాయకుడు కుడుముల వెంకటేష్, తుంకి స్వామి, తుంకి లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## రేషన్ షాపులలో సన్నబియ్యం పంపిణీ



**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** పెద్దపల్లి మండలంలోని గ్రామాల్లో గురువారం రేషన్ సన్నబియ్యం పంపిణీ కార్యక్రమం ప్రారంభించారు. బ్రాహ్మణపల్లిలో డిప్యూటీ తహసీల్దార్ విజేందర్ సన్నబియ్యం పంపిణీ ప్రారంభించారు. మాజీ సర్పంచ్ లు గాండ్ల మల్లేశం, బొల్లం తిరుపతి, పిప్పాల శ్రీనివాస్, సూత్రపు పరమేశ్వర్, దాసరి రాజేశం, మేకల భాస్కర్, మూల రమేష్, పూదరి కిషన్, మ్యాకల రాజయ్య, ఓదెల రాజు, పడాల రాజయ్య, కాంపెల్లి చంద్రశేఖర్, గురిజాల లక్ష్మయ్య, నీలి రాజేశం, డీలర్ రవి, గ్రామస్థులు పాల్గొన్నారు. రాగినేడులో ప్రారంభ కార్యక్రమంలో గుమ్మడి విజయ్, సోమ చంద్రయ్య, నాగపూరి తిరుపతి, తొడేటి తిరుపతి, తదితరులు పాల్గొన్నారు. అలాగే అన్ని గ్రామాల్లో సన్నబియ్యం పంపిణీ ప్రాంభమంతో లబ్దిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## స్వామి వారిని దర్శించుకున్న శ్రీ శ్రీ విద్యారణ్య భారతి స్వామిజి





**ధర్మపురి, ఎప్రిల్ 3, (ది క్రైమ్ న్యూస్):** ధర్మపురి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి దేవస్థానమునకు శ్రీ శ్రీ శ్రీ విద్యారణ్య భారతి స్వామిజి విరూపాక్ష మఠం అనంతపూర్ (ఆంధ్ర) దత్తాత్రేయ మహా సంస్థానం వారు గురువారం శ్రీ స్వామివారిని దర్శించుకున్నారు. వీరికి దేవస్థానం పక్షాన పూర్ణకుంభంతో మేళతాళాలతో అర్చకులు వేదపండితులు స్వాగతం పలికిన పిదప దర్శనం అనంతరం శ్రీస్వామివారి శేష వస్త్రం ప్రసాదం చిత్రపటం దేవస్థానం కార్యనిర్వహణాధికారి సంకటాల శ్రీనివాస్ దేవస్థానం చైర్మన్ జక్కు రవీందర్ అందించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం కార్యనిర్వహణాధికారి సంకటాల శ్రీనివాస్, దేవస్థానం చైర్మన్ జక్కు రవీందర్, ధర్మకర్తలు, ఉప ప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసా చార్యులు, ముఖ్య అర్చకులు రమణయ్య, అర్చకులు నంబి నరసింహ మూర్తి, చక్రపాణి వామనాచార్య, చక్రపాణి కిరణ్ సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్ సిబ్బంది అర్చకులు పాల్గొన్నారు.

## అనుమానాస్పదంగా యువకుని మృతి

### ఆత్మహత్య కాదు పక్క హత్యేనంటున్న కుటుంబ సభ్యులు



**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** పెద్దపల్లి పట్టణంలోని మారుతి నగర్ ఫైర్ స్టేషన్ దగ్గర ఓ ఇంట్లో అద్దెకు ఉంటున్న ఆర్టిజన్ ఉద్యోగి ఒడ్డబోయిన రాజ్ కుమార్ అనే వ్యక్తి గురువారం తెల్లవారుజామున ఉరివేసుకొని అనుమానాస్పదంగా మృతి చెందాడు. మృతుని బంధువులు తెలిపిన వివరాల ప్రకారం పెద్దపల్లిలో నివాసం ఉంటున్న తమ కుమారుడు రాజ్ కుమార్ ఆత్మహత్య చేసుకునే అంత పిరికివాడు కాదని ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంటే తలకు తీవ్ర గాయాలు ఉన్నాయని, కాళ్లు చేతులకు సైతం గాయాలు ఉన్నాయని ఇది ఆత్మహత్య కాదని పక్క ప్లాను ప్రకారమే హత్య చేశారని మృతుని తల్లి ఒడ్డ బోయిన సాంబలక్ష్మి పెద్దపల్లి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. రాజ్ కుమార్ భార్య అయిన తమ కోడలు పై పక్క అనుమానం ఉందని, ఇంటి యజమాని మృతుడు అయిన తమ కుమారునితో గొడవ పడినట్లు స్థానికులు తెలిపారని వారిపైనే అనుమానం ఉన్నట్లు పేర్కొన్నారు.రాజ్ కుమార్ ది పక్క హత్య అని కుటుంబ సభ్యులు తేల్చి చెప్పారు. సమాచారం అందుకున్న పెద్దపల్లి పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించి క్లూస్ టీం తో దర్యాప్తు చేపట్టారు.

# ఓసీపీ.1 ప్రాజెక్టు అధికారులకు ఆత్మీయ సన్మానం



**యైటింక్లయిన్ కాలనీ. (ది క్రైమ్ న్యూస్):** పదోన్నతిపై బదిలి అవుతున్న అధికారులకు సింగరేణి రామగుండం ఓసీపీ.1 ప్రాజెక్ట్ ఉద్యోగులు ఆత్మీయ సన్మానంతో వీడ్కోలు తెలిపారు. గురువారం ప్రాజెక్ట్ ఆవరణలో ప్రాతినిధ్య సంఘం ఐఎన్టియూసి మైన్ పిట్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న యూనియన్ కేంద్ర కమిటీ కార్యదర్శి గడ్డం తిరుపతి యాదవ్ రామగుండం ఓసీపీ.1 ప్రాజెక్టులో మేనేజర్ గా బాధ్యతలు నిర్వహించి, ఓసిపి.3 ప్రాజెక్టు అధికారిగా పదోన్నతిపై బదిలీ అయిన మేనేజర్ ఉదయ్ హరిజన్ ను, రక్షణ అధికారిగా బాధ్యతలు నిర్వహించి, ఇల్లందు ఏరియా కోయగూడెం ఓసిపి.2 ప్రాజెక్టు మేనేజర్ పదోన్నతితో బదిలీపై వెళుతున్న పేరాల శ్రీనివాసరావు లను శాలువాలతో సన్మానించి వీడ్కోలు తెలిపారు. అలాగే ఉదయ్ హరిజన్ స్థానంలో బదిలీపై ఇక్కడికి వచ్చిన డి. రమేష్ కు తిరుపతి యాదవ్ బొకే అందించి స్వాగతించారు. ఈ సందర్భంగా ఉదయ్ హరిజన్, శ్రీనివాసరావు మాట్లాడుతూ.. క్రమ శిక్షణ గల ఈ ప్రాజెక్ట్ నుండి ఎంతో నేర్చుకున్నాననీ, ఇక ఇక్కడ సుదీర్ఘకాలం పనిచేసే అవకాశం ఇచ్చిన, యాజమాన్యానికి, ప్రాజెక్టు అధికారులకు, ఉద్యోగులకు కృతజ్ఞతలు తెలిపారు. ఇంకా ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు అధికారి జె. రాజశేఖర్, అధికారుల సంఘం ప్రతినిధి ఎల్ వినాయక్, యూనియన్ పిట్ కార్యదర్శి గునుగంటి వెంకట్ స్వామి గౌడ్, ఎఐటియూసి నాయకులు తిరుపతిరావు, సంక్షేమ అధికారి సాయికృష్ణ, ఉద్యోగులు పాల్గొన్నారు.

# అనాథ పిల్లలకు అండగా యాదవ సంఘం



**ధర్మపురి, ఎప్రిల్ 3, (ది క్రైమ్ న్యూస్):** తల్లిదండ్రులను కోల్పోయిన ఇద్దరు అనాథ పిల్లలకు మనోధైర్యాన్ని ఇస్తూ ఇద్దరి పిల్లలకు బాసటగా నిలిచారు జిల్లా మండల యాదవ సంఘము నాయకులు. గురువారం ధర్మపురి మండలంలోని నక్కలపేట గ్రామానికి చెందిన పుట్ట నర్సయ్య యాదవ్ సంవత్సరం క్రితం మరణించగా గత 5 రోజుల క్రితం పుట్ట జమున యాదవ్ మరణించింది. విరిద్దరూ భార్యభర్తలు మరణించగా వారి కుమారులు పుట్ట శరత్, సన్నీ ఇద్దరు అనాథలు అయ్యారు. ఈ విషయం తెలుసుకొని జిల్లా, మండల యాదవ సంఘము నాయకులు ధర్మపురి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సంగ నర్సింహులు యాదవ్ ఆధ్వర్యంలో మండల యాదవ నాయకులు 11000ల రూపాయలు, మరియు ఎ ఎం సి వైస్ చైర్మన్ సంగ నర్సింహులు యాదవ్, యాదవ సంఘ మండల అధ్యక్షులు 50 బియ్యం బస్తాలు ఇచ్చి వారి కుటుంబానికి భగవంతుడు మనోధైర్యంను ఇవ్వాలని కోరుకుంతున్నట్లు యాదవ సంఘము నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల అఖిల భారత యాదవ మహా సభ అధ్యక్షులు పలుమారి మల్లేష్ యాదవ్, రాష్ట్ర కార్యదర్శి బొబ్బిలి వెంకట స్వామి యాదవ్, దండవేణి గంగామల్లు యాదవ్ మాజీ డైరెక్టర్, జెల్ల పెద్ద బుచ్చన్న యాదవ్, బుసా మల్లేష్ యాదవ్, జెల్ల చిన్న బుచ్చన్న యాదవ్, జంగం శేఖర్ యాదవ్, సమ్మెట తిరుపతి యాదవ్, తాడుక తిరుపతి యాదవ్, యాదగిరి గంగామల్లు యాదవ్, తిరు పతి, మల్లేష్, మురళి, మండేన్న, బుచ్చన్న, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# మంథని ప్రభుత్వ ఆసుపత్రిలో మరింత మెరుగ్గా స్త్రీ వైద్య సేవలు

**- జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**

**- నూతనంగా స్త్రీ వైద్య నిపుణురాలు డాక్టర్ బి. సోనిని నియమించిన జిల్లా కలెక్టర్, డి ఎం అండ్.హెచ్ ఓ అన్న ప్రసన్న**



**మంథని, (ది క్రైమ్ న్యూస్):** మంథనిలోని ప్రభుత్వ ఆసుపత్రిలో మరింత మెరుగ్గా స్త్రీ వైద్య సేవలు అందించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.మంథనిలోని ప్రభుత్వ ఆసుపత్రిలో డాక్టర్ బి.సోని,స్త్రీ వైద్య నిపుణురాలనికాంట్రాక్టు ప్రాతిపదికన రిక్రూట్ చేసుకున్నారు.ఆసుపత్రిలోనిమహిళా రోగులకు ఇక నుంచి మరింత మెరుగ్గా వైద్య సేవలు అందించ బడుతాయని తెలిపారు. గర్భిణీ స్త్రీలకు అవసరమైన రోగులు ఈ సేవలను వినియోగించుకోవాలని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా పౌర సంబంధాల అధికారి కార్యాలయం, పెద్దపల్లి చే జారీ చేయనైనది.

# ముందస్తు అరెస్టులపై బీజేపీ ఖండన



**యైటింక్లయిన్ కాలనీ. (ది క్రైమ్ న్యూస్):** చలో హెచ్.సి.యు కార్యక్రమానికి కాలనీ నుండి తరలి వెళ్తున్న బిజెపి నాయకులను గోదావరిఖని రెండవ పట్టణ పోలీసులు గురువారం అరెస్టు చేశారు. ముందస్తు సమాచారం అందుకున్న పట్టణ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎన్. ప్రసాద్ రావు ఆదేశాల మేరకు పోలీసులు ఉదయం తెల్లవారు జామున ఇళ్లకు వెళ్లి, నాయకులు ఆకుల శశికుమార్, ఐలవేణి అనిల్ కుమార్ లను అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్ తరలించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా నాయకులు ముకిరి రాజు మాట్లాడుతూ.. హైదరాబాద్ లోని సెంట్రల్ యూనివర్శిటీ హెచ్.సి.యు భూములను కాపాడుకునేందుకు పోరాడుతున్న విద్యార్థులను ముందస్తు అరెస్టు లను చేయడం, అప్రజా స్వామీకమని ఆరోపించారు. క్యాంపస్‌లోనీ 400 ఎకరాల భూమిని రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేటీకరించడాన్ని వ్యతిరేకిస్తూ, నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులపై, పోలీసులు లాఠీ ఛార్జి చేయడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.

# సమిష్టి కృషితో ఉత్పత్తి లక్ష్యాలను సాధించాం

## • ఆర్.జి-త్రీ జి.యం నరేంద్ర సుధాకరరావు

**రామగిరి(ది క్రైమ్ న్యూస్)ఏప్రిల్ 03:** సమిష్టి కృషితోనే ఏరియాకు నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను సాధించామని రామగుండం-త్రీ ఏరియా జనరల్ మేనేజర్ నరేంద్ర సుధాకరరావు అన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను రామగుండం-త్రీ ఏరియాకు నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని సాధించినందుకు గాను గురువారం ఓ.సి.పి-టు ఉపరితల గని లో ఏర్పాటు చేసిన అభినందన సభకు రామగుండం-త్రీ ఏరియా జనరల్ మేనేజర్ నరేంద్ర సుధాకరరావు ముఖ్య అతిథిగా హాజరై అధికారులకు, ఉద్యోగులకు అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2024-25 ఆర్థిక సంవత్సరానికి యాజమాన్యం రామగుండం-త్రీ ఏరియాకు నిర్దేశించిన 62.50 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యానికి గాను 104 శాతంతో 65.11 లక్షల టన్నుల బొగ్గును ఉత్పత్తి చేయడంలో భాగంగా ఓ.సి.పి-టు ఉపరితల గనికి నిర్దేశించిన 27.50 లక్షల టన్నుల లక్ష్యానికి గాను 30.10 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించినందుకు సంబంధిత అధికారులకు, ఉద్యోగులకు అభినందనలు తెలియజేశారు. సింగరేణి సంస్థకు అద్భుతమైన నాయకత్వంతో చక్కని మార్గదర్శకత్వం అందిస్తున్న సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.బలరామ్ కి, ఎప్పటికప్పుడు దిశానిర్దేశం చేస్తున్న డైరెక్టర్లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. అలాగే సంస్థలోని వివిధ విభాగాల ఉన్నతాధికారులకు, కార్మిక సంఘాల నాయకులకు, ప్రభుత్వ విభాగాల ఉన్నతాధికారులకు, స్థానిక ప్రజా ప్రతినిధులకు, పరిసర ప్రాంతాల ప్రజలకు, కాంట్రాక్టర్లకు, కాంట్రాక్ట్ ఉద్యోగులకు, పాత్రికేయులకు కృతజ్ఞతలు తెలిపారు. అంతేకాకుండా ఈ లక్ష్య సాధనలో ఎప్పటికప్పుడూ తగిన సహాయ సహకారాలను అందిస్తున్న తెలంగాణ రాష్ట్ర మంత్రివర్యులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు కి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఉద్యోగులందరూ భవిష్యత్తులో ఇదే ఒరవడిని కొనసాగిస్తూ నిర్దేశించిన లక్ష్యాలను సమిష్టి కృషితో, భద్రతతో సాధిస్తూ సింగరేణి సంస్థ అభివృద్ధికి తోడ్పడాలని, అలాగే 2025-26 ఆర్థిక సంవత్సరానికి నిర్దేశించిన లక్ష్యాలను భద్రతతో సాధించాలని కోరారు.ఈ కార్యక్రమంలో గుర్తింపు ప్రాతినిధ్య సంఘాల నాయకులు యం.రామచంద్రారెడ్డి, కోట





రవీందర్ రెడ్డి, ప్రాజెక్ట్ ఆఫీసర్ సి.హెచ్.వెంకటరమణ, ప్రాజెక్ట్ ఇంజనీర్ చంద్రశేఖర్, మేనేజర్ కె.వి.రామారావు, పిట్ సెక్రటరీలు వెంకటస్వామి, రామిండ్ల మనోహర్, ఇతర అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

# అధికారులు సమీక్షల్లో - ధాన్యం దళారుల చేతుల్లో

**● కోతలు మొదలైనా..ప్రారంభం కాని కొనుగోలు కేంద్రాలు ● కోట్ల రూపాయలు నష్టపోతున్నా- దళారుల వైపే రైతుల చూపు**

**● కొనుగోలు కేంద్రాలపై ఆశలు వదులుకుంటున్న రైతన్నలు ● అల్లుడు వచ్చేదాకా అమాస ఆగుతుందా?**

**(ది క్రైమ్ న్యూస్) బ్యూరో:** నువ్వు ఎక్కాల్సిన రైలు ఒక జీవితకాలం లేటు అన్నాడు వెనుకటికి ఓ మహానుభావుడు. అచ్చం ఇలాగే ఉంది ధాన్యం కొనుగోలు కేంద్రాల పరిస్థితి. ఏప్రిల్ మొదటి వారంలోనే కోతలు ప్రారంభం అవుతాయి అన్న సంగతి అధికారులకు నాయకులకు తెలియని విషయం కాదు. అయినా కూడా అధికార యంత్రాంగం అంతా సమీక్షలతోనే కాలం గడుపుతున్నారు. ముందుగ నాట్లేసిన రైతులు కోతలు మొదలుపెట్టి విధిలేని పరిస్థితుల్లో దళారులను ఆశ్రయిస్తున్నారు. సందట్లో సడే మియా అన్నట్టు ఇదే అదనుగా మిల్లర్లు తమ చేతివాటాన్ని చూపిస్తూ రైతులను నిలువునా ముంచుతున్నారు. విచిత్రం ఏమిటంటే మిల్లర్ల వద్ద కొంత మోసపోయినా పర్వాలేదు కానీ కొనుగోలు కేంద్రాలతో వేగలేక చస్తున్నామంటున్నారు కొందరు రైతులు. ఆ వివరాలు వారి మాటల్లోనే.... మేరుగు రాజ్ కుమార్ పెద్దపల్లి జిల్లా ఓదెల మండలం షానగొండ గ్రామానికి చెందిన ఈ రైతు హార్వెస్టర్ తో తన పొలాన్ని కోసిన వెంటనే పచ్చివడ్ల ను మిల్లుకు తరలించే ప్రయత్నంలో ఉండగా ది క్రైమ్ న్యూస్ కాసేపు అతనితో మాట్లాడడం జరిగింది.

ప్ర : మీ గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రం లేదా?

రైతు : ఉన్నది కానీ ఇంకా ఓపెన్ చెయ్యలే

ప్ర : ట్రాక్టర్ కు పరదాలు కట్టినవు కదా? మరి ఈ వడ్లను ఎక్కడికి తీసుకెళ్తున్నావు?

రైతు : డైరెక్ట్ మిల్లుకు ( సుల్తానాబాద్)

ప్ర : ఎందుకు?

రైతు : వడ్లు అమ్ముకునుటానికి.. అల్లుడు అచ్చేదాక అమాస ఆగుతదా?

ప్ర : మరి అక్కడ రేటు క్వింటాలకు ఎంత పెడుతున్నారు?

రైతు : తేమను బట్టి రేటు. 1700 నుండి మొదలు 2000 వరకు కూడా పడుతాంది .

ప్ర : మరి కొంత నష్టపోతున్నావు కదా?

రైతు : అయినా మంచిదే వీళ్ళతోటి ఎవ్వడు ఏడవాలే ? సెంటర్ ఓపెన్ కాలేదు... ఇప్పుడు నేను ఈ వడ్లను యేడ పొయ్యాలే? సరే ఎన్నో ఓ కాడ పోస్తా... పరదాలకు కిరాయి.. పొద్దు మాకు అక్కడే ఉండి తేమ వచ్చేదాకా నేర్పాలే .. మబ్బు గడగడ అంటే మళ్ళీ కుప్ప పొయ్యాలే.. కప్పు కప్పాలే... తెల్లారి.. మల్ల నేర్పాలే.. వాళు సెంటర్ ఓపెన్ చేసేది ఎప్పుడు? నాకు బార్దాన్ ( సంచులు ) ఇచ్చేది ఎప్పుడు? నేను నింపేది ఎప్పుడు?

హమాలీలు కాంటా పెట్టేది ఎప్పుడు?లారీ వచ్చేది ఎప్పుడు? నా వడ్లు పోయేది ఎప్పుడు? నాకు పైసలు వచ్చేది ఎప్పుడు? అందుకే ఈ తలకాయ నొప్పి వద్దని మిల్లుకు కొంటబోతున్న.

ప్ర : మాది ప్రజా ప్రభుత్వం, ఇందిరమ్మ రాజ్యంలో రైతుల క్షేమమే మా ఆశయం.. ఒక్క గింజ కూడా కటింగ్ లేకుండా మద్దతు ధరకు కొంటాం అంటున్నారు కదా? మరి నీవు నష్టపోతున్నవ్?

రైతు : అయినా మంచిదే.. నెలల కానంగా వడ్ల కావలి కాసినా కూడా... సెంటర్ ఇన్చార్జిలతో ఇబ్బంది అయితాంది. వాళ్లకి అనుకూలంగా ఉన్నోళ్లకే కాంటాలు ఏస్తరు... బస్తాలు పంపిస్తరు అది కూడా ఇంతో అంతో తడపంది పని అయితలేదు . ఈ గందరగోళం కంటే ఇలా తెగనమ్ముకొనుడే నయం.

ప్ర : మరి మిల్లు వాళ్ళు డబ్బులు సకాలంలోఇస్తారా? ఎగనామం పెడతారా?

రైతు : ఎంటనే కావాలంటే కటింగ్ తోటి ఇస్తరు. వద్దనుకుంటే 15 రోజులు వాయిదా.. మొత్తానికి పైసలు అయితే ఎటుపోవు.. నమ్మకమే.. వాయిదా వచ్చిందంటే అకౌంట్లకు ట్రాన్స్ఫర్ చేస్తరు.





ప్ర : సరే ఇక నేను నిన్ను విసిగించను కానీ చివర్లో ఒక ప్రశ్న అడుగుతా కరెక్ట్ గా సమాధానం చెప్పు.

రైతు :ఊ ... అడుగు.

ప్ర : ప్రభుత్వ కొనుగోలు సెంటర్లలో పోసి అమ్ముకుంటే రైతుకు లాభమా? ఇలా మిల్లుకు డైరెక్ట్ గా తీసుకపోతే లాభమా?

రైతు : సెంటర్లో పోసుకుంటేనే లాభం... కానీ ఇంకా సెంటర్లు ఓపెన్ కాలేదు కదా శాన టైం వేస్ట్ అయితది. మల్ల ఈ అకాల వర్షాలతోటి భయం. కొంచెం తేడా అయితే కొంపలు మునుగుతయ్.. అందుకే నష్టపోయినా మంచిదే అని ఇట్లనిర్ణయం తీసుకున్న...

ది క్రైమ్ న్యూస్ బ్యూరో : మంచిదే అన్న పోయి వస్తా....

రైతు : రైట్ మంచిది.. నాక్కూడా పని ఉన్నది. ఇది ధాన్యం కొనుగోలు విషయంలో ప్రస్తుతం రైతులు ఎదుర్కొంటున్న సమస్య ఇది. మరి దీనికి ఏదైనా పరిష్కారం ఉందా? అయితే వేచి చూడాల్సిందే.

# పూర్వ విద్యార్థులు మిత్రుని కుటుంబానికి ఆర్థిక సాయం

**- యాభై ఏడు వేల ఐదు వందల రూపాయలు**



**ధర్మారం, ఎఫ్రిల్, 3 (ది క్రైమ్ న్యూస్):** పూర్వ విద్యార్థులు మిత్రుని కుటుంబానికి ఆర్థిక సాయంంగా 57500 వేల రూపాయలు అందించారు. ధర్మారం మండలంలోని నంది మేడారం గ్రామానికి చెందిన దేవి రాజ నర్సింగ్ ఇటివల అనారోగ్యంతో మృతి చెందగా కలిసి చదువుకున్న మిత్రుడు దేవి రాజ నర్సింగ్ మరణ వార్త తెలుసుకొని 1991?1992 బ్యాచ్ 10వ తరగతి పూర్వ విద్యార్థులు తోటి విద్యార్థి అయిన దేవి రాజ నర్సింగ్ దినకర్మ రోజున 57 వేల ఐదు వందల రూపాయల చెక్కును అతని కుటుంబానికి అందించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా రాజ నర్సింగ్ భార్య కుమారుడు వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు కన్నా తిరుపతి, కాంపెల్లి రాజేశం, సామంతులు రాజమల్లు, సామంతులు నార్సింగం, మిట్ట తిరుపతి, ఎండి మైబుబ్, వెల్పుల తిరుపతి, ఫేంచికల సత్యనారాయణ, వెల్పుల మల్లేశం, తదితరులు పాల్గొన్నారు.

# హిందూ సామ్రాజ్య స్థాపకుడు ,ఓటమి ఎరుగని ధీరుడు చత్రపతి శివాజీ మహారాజ్

**- వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు అర్పించిన బొంతల కళ్యాణ్ చంద్ర**




**కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 3(ది క్రైమ్ న్యూస్):** హిందూ సామ్రాజ్య స్థాపకుడు , హైందవ వీరత్వానికి ప్రతీక , ఓటమీ ఎరుగని ధీరుడు చత్రపతి శివాజీ మహారాజ్ అని బిజెపి జిల్లా అధికార ప్రతినిధి, సెంట్రల్ ఫిలిం సెన్సార్ బోర్డు సభ్యులు బొంతల కళ్యాణ్ చంద్ర కొనియాడారు. చత్రపతి శివాజీ మహారాజ్ వర్ధంతిని పురస్కరించుకొని కరీంనగర్ నగరపాలక సంస్థ 8వ డివిజన్ అలుగునూర్ పరిధిలోని శ్రీ వెంకటేశ్వర కాలనీలో గల జెండా ప్రాంగణం వద్ద చిత్రపతి శివాజీ మహారాజ్ చిత్రపటానికి కళ్యాణ్ చంద్ర ఘన నివాళులు అర్పించి మాట్లాడారు.మొఘల్ సామ్రాజ్య పతనాన్ని శాసించి, హైందవ ధర్మ రక్షణ, స్థాపన కోసం వీరోచిత పోరాటాలు చేసిన ధీరుడు , యోధులు , మహనీయులు చత్రపతి శివాజీ మహారాజ్ అన్నారు. శివాజీ అవలంబించిన యుద్ధ నైపుణ్య వ్యూహాలతో సుదీర్ఘకాలం అనేక యుద్ధాలు చేసి , వందలాది కోటలు తన ఆధీనంలో ఉంచుకొని , లక్షలాదిమందితో సైన్యాన్ని తయారు చేశారని తెలిపారు. కొండలపై సాంకేతిక విలువలతో శత్రు దుర్భేద్యమైన కోటలను నిర్మించడంలో చత్రపతి శివాజీ మహారాజ్ ప్రపంచ ఖ్యాతిని సొంతం చేసుకున్నారన్నారు.

# సాగునీటిపై ప్రతిపక్షాల విమర్శలు అవాస్తవం

## ◆ అభివృద్ధిని చూసి ఓర్వలేకనే విమర్శలు



**తొర్రూరు, (ది క్రైమ్ న్యూస్):** సాగునీటిపై ప్రతిపక్షాల విమర్శలు అవాస్తవమని కాంగ్రెస్ పార్టీ తొర్రూరు మండల అధ్యక్షుడు సుంచు సంతోష్ అన్నారు. గురువారం డివిజన్ కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంతోష్ మాట్లాడుతూ..... వేసవిలో పంటలు ఎండిపోకుండా సాగునీరు అందించేందుకు స్థానిక ఎమ్మెల్యే యశస్విని రెడ్డి కృషి చేస్తుందని తెలిపారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో పంటలు ఎండిపోకుండా ప్రభుత్వం నీరు విడుదల చేస్తుందని తెలిపారు. ఎమ్మెల్యేను బద్నాం చేసేందుకు బీఆర్ఎస్, బిజెపి నాయకులు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. మండలంలోని కస్నా తండాలో నీరు అందక పొలాలు ఎండిపోయాయని బిజెపి నాయకులు అవాస్తవాలు ప్రచారం చేశారని, మండలంలో పంటలు ఎండిపోకుండా ఎమ్మెల్యే ఎస్సారెస్పీ కాలువల ద్వారా నీరు అందించారని గుర్తు చేశారు. ప్రజా ప్రభుత్వంలో సంక్షేమ కార్యక్రమాలు విజయవంతంగా కొనసాగుతుంటే ఓర్వలేని ప్రతిపక్ష నాయకులు బురద జల్లుతున్నారని దుయ్యబట్టారు. ఇప్పటికైనా పాలకుర్తి ఎమ్మెల్యే పై దుష్ప్రచారాలు మానుకోకపోతే నియోజకవర్గ ప్రజలు తగిన బుద్ధి చెప్పడం ఖాయమన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ జిల్లా నాయకులు గంజి విజయపాల్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ తొర్రూరు పట్టణ అధ్యక్షుడు సోమ రాజశేఖర్, వివిధ గ్రామాల అధ్యక్షులు మోకాటి వెంకన్న, వెన్నెం సోమిరెడ్డి, ఎర్ర వెంకటరెడ్డి, యూత్ పట్టణ అధ్యక్షుడు మహేష్ యాదవ్, కాంగ్రెస్ నాయకులు ఎర్ర మల్లారెడ్డి, వెంకన్న యాదవ్, ఎనగందుల శ్రీనివాస్, రమేష్, బానోత్ నరసింహ నాయక్, మురళి నాయక్, మధుసూదన్, భగ్య నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# ఆహార భద్రతకు ప్రజా ప్రభుత్వం పెద్దపీట

## - సన్న బియ్యం పంపిణీ పేదలకు వరం





**తొర్రూరు, (ది క్రైమ్ న్యూస్):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సన్న బియ్యం పంపిణీ పేదలకు వరమని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సోమ రాజశేఖర్ అన్నారు. పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి హనుమాండ్ల ఝాన్సీ రాజేందర్ రెడ్డిల ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని గురువారం పట్టణ కేంద్రంలోని రేషన్ షాపులలో డిప్యూటీ తహసిల్దార్ నర్సయ్యతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న ప్రతి నిరుపేద కుటుంబానికి సన్న బియ్యం అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ పథకాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. ఆహార భద్రతకు ప్రజా ప్రభుత్వం పెద్దపీట వేసిందన్నారు. గత ప్రభుత్వంలో రేషన్ బియ్యం పంపిణీలో మాఫియాలు ఉండేవని, ఇప్పుడు వాటిని శాశ్వతంగా నిర్మూలించామని తెలిపారు. ప్రజా ప్రభుత్వంలో అర్హులందరికీ రేషన్ కార్డులు జారీ చేస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో రాగానే ఇచ్చిన 6 గ్యారంటీలను నెరవేరుస్తూనే ప్రభుత్వ ఉద్యోగ నియమాలు చేపట్టామని అన్నారు. ఇచ్చిన మాట ప్రకారం ప్రభుత్వం సన్న బియ్యం పంపిణీ పథకాన్ని చేపట్టినట్టు తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేస్తుందన్నారు. ప్రభుత్వం పంపిణీ చేస్తున్న సన్నబియ్యంను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు గంజి విజయపాల్ రెడ్డి, డీలర్ల సంఘం డివిజన్ అధ్యక్షుడు కాంతాల సోమిరెడ్డి, కాంగ్రెస్ నాయకులు మంగళపల్లి రామచంద్రయ్య, జీనుగ సురేందర్ రెడ్డి, దొంగరి రేవతి శంకర్, కిషన్ యాదవ్, వెంకన్న యాదవ్, ముద్దసాని సురేష్, మనోహర్, జలగం వెంకన్న, యూత్ పట్టణ అధ్యక్షుడు మహేష్ యాదవ్, రేషన్ డీలర్లు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# నాగకేసర పువ్వులతో ఆరోగ్యప్రయోజనాలు పుష్కలం..!

## ఇలా వాడితే అనేక సమస్యలకు దివ్యౌషధం..!!



సహజంగా వచ్చే సీజనల్ వ్యాధులను అరికట్టడంలో నాగకేసర్ అద్భుతంగా పనిచేస్తుంది. నాగకేసర పువ్వుతో జలుబును తగ్గించుకోవచ్చు. అందుకు గాను.. ఈ పువ్వును తీసుకుని బాగా నలిపి పేస్ట్‌లా చేసి ఆ మిశ్రమాన్ని నుదుటిపై రాసుకుంటే జలుబు తగ్గుతుందని నిపుణులు చెబుతున్నారు. నేటి జీవనశైలిలో కడుపు సంబంధిత సమస్యలు సర్వసాధారణం. అజీర్ణం, అసిడిటీ, గుండెల్లో మంట, గ్యాస్, కడుపునొప్పి, వాపు వంటి సమస్యలను అధిగమించడానికి నాగకేసర్ వాడితే ఉపశమనం కలుగుతుంది. . దీని కోసం, మీరు ఒక గ్లాస్ గోరు వెచ్చని నీటిలో కొద్దిగా నాగకేసర పువ్వులతో తయారు చేసిన పొడి, తేనె కలిపి తీసుకుంటే, అజీర్ణం, అసిడిటీ, గ్యాస్, కడుపునొప్పి, కడుపు ఉబ్బరం వంటి సమస్యలు తగ్గుతాయి. చాలా మందికి వెక్కిళ్లు వచ్చాయంటే ఒక పట్టాన తగ్గవు. అటువంటి పరిస్థితిలో నాగకేసర పువ్వుల పొడితో వెక్కిళ్లను తగ్గించుకోవచ్చు. అందుకు గాను ఆ పువ్వుల పొడిని తేనెతో కలిపి తీసుకోవాలి. అదే పొడిని చెరుకు రసంతో కలిపి కూడా తీసుకోవచ్చు. దీంతో వెక్కిళ్లు తగ్గిపోతాయి. ప్రస్తుత కాలంలో చాలా మందికి 40ఏళ్లు కూడా దాటకుండానే కీళ్ల నొప్పుల సమస్య కూడా సర్వసాధారణమైపోతోంది. ఈ సమస్య నుంచి బయటపడాలంటే నాగకేసర్ చక్కటి ఔషధంగా పనిచేస్తుంది. దీని కోసం, నాగకేసర గింజల నూనెను కీళ్లపై లేదా నొప్పి ఉన్న ప్రదేశాలపై నెమ్మదిగా మర్ధన చేయాలి.. ఇది నొప్పి నుండి ఉపశమనాన్ని కలిగిస్తుంది. దీంతో కీళ్ల నొప్పులు తగ్గుతాయి. నాగకేసర పువ్వుల పొడిని తేనెతో కలిపి తీసుకుంటుంటే జ్వరం కూడా తగ్గుతుంది. పావు టీస్పూన్ తేనెను అర టీస్పూన్ పొడితో కలిపి తీసుకోవాలి. దీన్ని రోజుకు 2 సార్లు తీసుకోవాల్సి ఉంటుంది. నాగకేసర పువ్వుల పొడిని తేనెతో కలిపి తీసుకుంటుంటే పైల్స్, ఆస్తమా వంటి సమస్యలు తగ్గుతాయి. ఆ మిశ్రమాన్ని రోజుకు 1 లేదా 2 సార్లు తీసుకోవాలి. నాగకేసర నూనెను గాయాలు, పుండ్లపై రాస్తుంటే అవి త్వరగా మానుతాయి. ఒక గ్లాస్ గోరు వెచ్చని నీటిలో అర టీస్పూన్ నాగకేసర పువ్వుల పొడిని కలిపి తాగితే తలనొప్పి తగ్గుతుంది. చాలా మంది మహిళలు బహిష్టు సమయంలో అధిక రక్తస్రావంతో ఇబ్బంది పడుతుంటారు. బహిష్టు రక్తస్రావం సాధారణమైనప్పటికీ, అధిక రక్తస్రావం అనారోగ్యకరం. మీరు ఈ సమస్యతో బాధపడుతున్నట్లయితే, నాగకేసరిని ఈ విధంగా ఉపయోగించండి. ఇందుకోసం 250-500 మి.గ్రా.నగకేసర్ పొడిని పాలవిరుగుడుతో కలిపి మూడు రోజులపాటు తినాలి. ఇది కాకుండా మీ రోజువారీ ఆహారంలో మజ్జిగ తీసుకోండి. ఇలా చేయడం వల్ల మెనోరేజియా సమస్య నుంచి త్వరగా ఉపశమనం లభిస్తుంది

# తెల్ల జుట్టు నల్లగా మార్చడానికి హెన్నా అవసరం లేదు.. ఈ ఒక్కటి చాలు..!

తెల్లజుట్టును నల్లగా మార్చేందుకు రకరకాల బ్యూటీ ప్రొడక్ట్స్‌ను వాడుతుంటారు. కానీ ఈ రకమైన ఉత్పత్తులు మీ జుట్టును తాత్కాలికంగా నల్లగా చేసే రసాయనాలను ఉపయోగిస్తాయని, అవి దీర్ఘకాలంలో తీరని నష్టాన్ని కలిగిస్తాయని మీకు తెలుసా? అందుకే సహజసిద్ధంగా జుట్టును నల్లగా మార్చుకోవడం ఉత్తమం అంటున్నారు నిపుణులు. అందుకు ఒక మంచి రెసిపీని కూడా సూచించారు. దానికోసం పెద్దగా కష్టపడనక్కర్లేదు కూడా. మన వంటింట్లో ఎప్పుడూ రెడీగా ఉండేదే.. అదే కాఫీపొడి. అవును, ఇది తెల్లజుట్టును నల్లగా మార్చడంలో అద్భుతంగా పనిచేస్తుందంటున్నారు నిపుణులు. అదెలాగో చూద్దాం. సహజంగా తెల్ల జుట్టును నల్లగా మార్చడానికి కాఫీ నుండి రంగును తయారు చేసుకోవచ్చు. దీని కోసం, రెండు పెద్ద చెంచాల కాఫీ పొడి, ఒక కప్పు కండీషనర్ తీసుకోండి. ఈ రెండింటినీ బాగా కలపండి. తర్వాత ఆ పేస్ట్‌ని జుట్టుకు బాగా పట్టించి గంటపాటు అలాగే ఉంచాలి. అప్పుడు మీ జుట్టును నీటితో మాత్రమే కడగాలి. షాంపూ వాడకూడదు. అలాగే మరో విధానంలో కాఫీపొడి తీసుకొని అందులో అలోవెరా జెల్ కలపండి. ఇప్పుడు ఈ పేస్ట్‌ని జుట్టుకు పట్టించి గంటపాటు అలాగే ఉంచాలి. తర్వాత మీ జుట్టును సాధారణ నీటితో కడగాలి. ఇప్పుడు కూడా షాంపూ ఏమాత్రం ఉపయోగించకూడదు. కాఫీ తెల్లని జుట్టును నల్లగా మార్చడానికి చాలా బాగా పనిచేస్తుంది. ఇది హెన్నా కంటే ఎక్కువ ప్రయోజనకరం. కాఫీ మీ జుట్టుకు సహజంగా పోషణను అందిస్తుంది, ఇది జుట్టుకు అనేక విధాలుగా ప్రయోజనకరంగా ఉంటుంది. బ్రౌన్ కలర్ జుట్టు సహజంగా కూల్ గా కనబడేలా చేస్తుంది. కాఫీపొడితో మీ జుట్టు చక్కని మెరుపు సంతరించుకుంటుంది. కాఫీ లోపలి నుండి జుట్టుకు మెరుపు తెచ్చేలా పనిచేస్తుంది. దీనితో పాటు, ఇది తలలో కొల్లాజెన్‌ను పెంచుతుంది. కాబట్టి మెరిసే జుట్టు కావాలంటే కాఫీని ఇలా వాడండి. అంతేకాదు, కాఫీ జుట్టుకి మంచి కండీషనర్ కూడా. మీ జుట్టు లోపలి నుండి తేమగా ఉండేలా కాఫీ పనిచేస్తుంది. కాఫీలోని గుణాలు మీ జుట్టును సహజంగా సిల్కీగా చేస్తాయి. ఈ సూచనలు అన్నీ కేవలం మీకు అవగాహన కోసం మాత్రమే.. వీటిని ప్రయోగించేముందు నిపుణుల సలహాకూడా తీసుకుంటే మంచిది.

# ఖాళీ కడుపుతో ఈ నీళ్లు తాగండి.. దీని లాభాలు చూస్తే షాకవుతారు.!

బెండకాయ చాలా మందికి ఇష్టమైన కూరగాయ. దీంతో ఎన్నో రకాల వంటకాలు తయారుచేస్తాం. కొందరు పచ్చి బెండకాయలు కూడా తింటారు. అయితే బెండకాయను నీటిలో నానబెట్టి, ఆ నీటిని తాగితే అనేక ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయని నిపుణులు చెబుతున్నారు. నాలుగు లేత బెండకాయలు తీసుకొని వాటిని శుభ్రంగా కడిగి, నిలువుగా, అడ్డంగా ముక్కలుగా కోసి మంచినీటిలో రాత్రంతా నానబెట్టి, ఉదయం ఆ నీటిని వడపోసి తాగాలి. దీంతో కలిగే లాభాలు తెలిస్తే ఆశ్చర్యపోతారు.. బెండకాయలో ప్రోటీన్, కార్బోహైడ్రేట్లు, ఫైబర్, మాంగనీస్, విటమిన్ సి,బి, ఫోలిక్ యాసిడ్, పుష్కలంగా ఉంటాయి. ఇది ఆకలిని తగ్గిస్తుంది. తద్వారా బరువు తగ్గడానికి సహాయపడుతుంది. అలాగే, ఫెన్నెల్ వాటర్ శరీరాన్ని హైడ్రేట్ గా ఉంచడానికి, జీవక్రియను పెంచడానికి సహాయపడుతుంది. బెండకాయలో మాంగనీస్ ఉంటుంది. ఇది జీవక్రియ, రక్తంలో చక్కెర నియంత్రణకు కీలకమైన ఖనిజం. బెండకాయలో విటమిన్ మరియు యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉన్నాయి. ఇది రక్తాన్ని శుద్ధి చేయడంతోపాటు టాక్సిన్స్‌ను బయటకు పంపుతుంది. ఇది చర్మం వృద్ధాప్య ఛాయలు తగ్గిస్తుంది. మచ్చలు ఇతర చర్మ సమస్యలను తగ్గించడంలో సహాయపడుతుంది. బెండకాయ రోగనిరోధక వ్యవస్థపై సానుకూల ప్రభావాన్ని చూపుతుంది. బెండకాయలో ఫ్లేవనాయిడ్స్, పాలీఫెనాల్స్ వంటి యాంటీఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. కళ్లకు , ఎముకలకు బెండకాయ చాలా మంచిది. మధుమేహ వ్యాధిగ్రస్తులకు బెండకాయ మంచి ఔషధం. ఉదయాన్నే ఖాళీ కడుపుతో బెండకాయలు నానబెట్టిన నీటిని తాగితే రక్తంలో చక్కెర స్థాయి అదుపులో ఉంటుంది. కొలెస్ట్రాల్ స్థాయిలను అదుపులో ఉంచడంలో సహాయపడుతుంది. గుండె ఆరోగ్యానికి మేలు చేస్తుంది. బెండకాయలో క్యాన్సర్ నిరోధక గుణాలు ఉన్నాయి. పేగు క్యాన్సర్ వచ్చే ప్రమాదాన్ని తగ్గిస్తుంది. కంటి ఆరోగ్యాన్ని మెరుగుపరుచడంలో బెండకాయ సహాయపడుతుంది. బరువు తగ్గడానికి, రక్తపోటు నియంత్రణలో బెండకాయ సహాయపడుతుంది. ముఖ్య గమనిక ఏంటంటే ఇప్పుడు మనం చెప్పుకున్న విషయాలన్నీ కేవలం అవగాహన కోసం మాత్రమే.. వీటిని ప్రయోగించేముందు నిపుణుల సలహా తీసుకోవడం మంచిది.

# ప్రభుత్వ పాఠశాలలో సిసి కెమెరాలు ప్రారంభం



**మానకొండూర్ (ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో పిఎంశ్రీ నిధులతో నూతనంగా ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు,పది కంప్యూటర్లను గురువారం ఎంఈఓ మధుసూదనా చారి, స్థానిక సిఐ లక్ష్మీనారాయణ ప్రారంభించారు. అనంతరం సిఐ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ..... పాఠశాలలో ఏర్పాటు చేసిన కంప్యూటర్ల ద్వారా నాణ్యమైన ఆదునిక విద్యను పొందాలని విద్యార్థులకు సూచిస్తూ అత్యవసర పరిస్థితులలో 100కు డయల్ చేయాలని విద్యార్థులకు తెలియజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు దాసి శ్రీనివాస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# సిసి రోడ్డు పనులకు శంకుస్థాపన చేసిన సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి...



**కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 3(ది క్రైమ్ న్యూస్):** నగరంలోని నలభై అయిదవ డివిజన్ సాయినగర్ లో సుడా నిధులు పది లక్షలతో సిసి రోడ్డు నిర్మాణానికి సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నరేందర్ రెడ్డి మాట్లాడుతూ నగరంతో పాటు గ్రామాలలో అవసరమైన చోట సుడా నిధులు వెచ్చించి పలు అభివృద్ధి పనులు చేపడుతున్నామని కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా పని చేస్తుందన్నారు. కార్యక్రమంలో తాజా మాజీ కార్పొరేటర్ పిట్టల వినోద శ్రీనివాస్, డిఈ రాజేంద్ర ప్రసాద్, ఏఈ సతీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా యువనాయకుని జన్మదిన వేడుకలు



**తిమ్మాపూర్ (ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం మల్లాపూర్ గ్రామానికి చెందిన యువ నాయకుడు సింగసాని రంజిత్ పుట్టినరోజు వేడుకలను తాజా మాజీ ఉపసర్పంచ్ బుడిగే పర్శరాములు గౌడ్ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు కేక్ కట్ చేసి రంజిత్ కు శాలువా కప్పి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో దుంబాల చందు, పాశం బన్నీ, పాశం సాయి, పల్లె సాయికిరణ్, పాశం రాము, పాశం వంశీ తదితరులు పాల్గొన్నారు.

# పాదాల్లో కనిపించే ఈ లక్షణాలు.. గుండెపోటుకు సంకేతం కావొచ్చు..



ఇటీవల గుండె సంబంధిత వ్యాధులతో బాధపడుతోన్న వారి సంఖ్య రోజురోజుకీ పెరుగుతోంది. చిన్న వయసు వారు కూడా గుండె పోటుకు గురికావడం అందరినీ కలవరపెడుతోంది. అయితే గుండె జబ్బులను త్వరగా గుర్తించి, చికిత్స అందిస్తే ప్రాణాలను కాపాడుకోవచ్చని నిపుణులు సూచిస్తుంటారు. పలు రకాల లక్షణాల ఆధారంగా గుండెపోటును ముందుగానే గుర్తించవచ్చని నిపుణులు చెబుతున్నారు. ఇలాంటి ఓ లక్షణం గురించి ఇప్పుడు తెలుసుకుందాం.. శరీరంలో కొలెస్ట్రాల్ పెరగడం వల్ల గుండె సంబంధిత వ్యాధులు వస్తాయని ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. ఎలివేటెడ్ కొలెస్ట్రాల్, కాళ్ల వాపు గుండె జబ్బుకు ప్రాథమిక సంకేతాలుగా నిపుణులు చెబుతున్నారు. కాళ్లలో వాపు గుండె వైఫల్యానికి సంకేతంగా నిపుణులు చెబుతున్నారు. రక్తప్రసరణలో సమస్యలు కూడా గుండె వైఫల్యానికి కారణమ తెలిసిందే. రక్త ప్రసరణలో సమస్య ఉంటే.. పాదాలలో నీరు నిండుతుంది. దీంతో ఇది పాదం వాపునకు దారి తీస్తుంది. అందుకే కాళ్లలో వాపు గుండె జబ్బుకు ప్రాథమిక సంకేతంగా చెబుతుంటారు. అందుకే కాళ్లు వాపునకు గురైతే ఎట్టి పరిస్థితుల్లో లైట్ తీసుకోకూడదని నిపుణులు చెబుతున్నారు. ఎందుకంటే ఇది అనేక తీవ్రమైన అనారోగ్య సమస్యలకు దారి తీస్తుందని చెబుతున్నారు. పాదాలు, చీలమండలు, పొత్తికడుపు వాపు గుండె సంబంధిత వ్యాధుల ప్రమాదాన్ని పెంచుతుంది. కాళ్లు, పాదాలలో వాపును పెరిఫెరల్ ఎడెమా అంటారు. దీంతో కాళ్లు బరువుగా ఉంటాయి. చర్మంలో కూడా వాపు లక్షణాలు కనిపిస్తాయి. బూట్లు ధరించడంలో ఇబ్బంది ఉంటుంది. అలాగే వాపు కూడా పాదాలు వేడిగా, గట్టిగా మారడానికి కారణమవుతుందని నిపుణులు చెబుతున్నారు. ఈ చిట్కాలు పాటించాలి..చెడు కొలెస్ట్రాల్ పెరుగుదల గుండె సంబంధిత వ్యాధులకు దారితీస్తుందని తెలిసిందే. అలాంటి పరిస్థితిలో, తీసుకునే ఆహారంలో మార్పులు చేసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. ఆయిల్ ఫుడ్‌ను వీలైనంత వరకు తగ్గించాలి. ప్రతీ రోజూ కచ్చితంగా వ్యాయామం చేయడాన్ని అలవాటుగా మార్చుకోవాలి. తీసుకునే ఆహారంలో ఉప్పును పూర్తిగా తగ్గించాలి. శరీరంలో సోడియం పరిమాణం పెరిగితే అది వాపునకు దారి తీస్తుందని నిపుణులు చెబుతున్నారు. ఇలాంటి పరిస్థితిల్లో సమయాన్ని వృథా చేయకుండా వైద్యుడిని సంప్రదించాలని సూచిస్తున్నారు.

# స్పోర్ట్స్

# వైరల్‌గా మారిన శుభ్‌మన్ గిల్ పోస్ట్

చిన్నస్వామి వేదికగా రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుపై గుజరాత్ టైటాన్స్? ఘన విజయం సాధించింది. బుధవారం జరిగిన మ్యాచ్?లో గుజరాత్ 8 వికెట్ల తేడాతో నెగ్గింది. ఆర్సీబీ నిర్దేశించిన 170 పరుగుల లక్ష్యాన్ని గుజరాత్ 17.5 ఓవర్లలోనే ఛేదించింది. అయితే మ్యాచ్ అనంతరం గుజరాత్ కెప్టెన్ శుభ్?మన్ గిల్ షేర్ చేసిన పోస్ట్ వైరల్?గా మారింది. ఇది విరాట్ కోహ్లీకి కౌంటర్ ఇస్తున్నట్లుగా ఉందంటూ నెటిజన్లు అభిప్రాయడుతున్నారు. 170 పరుగుల ఛేదనను గుజరాత్ దీటుగానే ఆరంభించింది. కానీ, అంతలోనే? 4.4 ఓవర్ వద్ద తొలి వికెట్ కోల్పోయింది. భువనేశ్వర్ కుమార్ బౌలింగ్‌లో ఓపెనర్ గిల్ (14 పరుగులు) క్యాచౌట్‌గా పెవిలియన్ చేరాడు. అయితే గిల్ ఔటైనప్పుడు విరాట్ కోహ్లీ గట్టిగా అరుస్తూ సెలబ్రేట్ చేసుకున్నాడు. ఆ సమయంలో ప్రేక్షకుల అరుపులతో స్టేడియం ఒక్కసారిగా మార్మోగిపోయింది. మీటర్‌పై శబ్దం 126 డెలిబుల్స్‌గా నమోదైంది. అయితే తాను ఔటైన సందర్భంలో ప్రత్యర్థి జట్టు అతిగా సంబరాలు చేసుకోవడంపైనే గిల్ కౌంటర్ ఇచ్చాడని అభిమానులు కామెంట్ చేస్తున్నారు.'ఈ గ్రౌండ్‌లో ఆర్సీబీని 170 పరుగుల్లోపే కట్టడి చేయడం బాగుంది. పిచ్ కూడా ఒక్కోసారి ఒక్కోలా స్పందిస్తుంటుంది. ఇక్కడ 250 స్కోర్ చేసే ఛాన్స్ కూడా అయితే త్వరగా వికెట్లు తీస్తేనే ప్రత్యర్థిపై ఆధిపత్యం ప్రదర్శించేందుకు వీలుంటుంది. తొలి 8 ఓవర్లలో ఫాస్ట్ బౌలర్లకు మంచి ఆరంభం దక్కింది. త్వరగా ఆర్సీబీ వికెట్లు తీస్తేనే మ్యాచ్‌పై పట్టు దొరుకుతుందని భావించాం. మా బౌలర్లు కూడా అలాగే శ్రమించారు. పిచ్‌ను బట్టి



మా బ్యాటింగ్‌లో మార్పులు చేసుకున్నాం' అని మ్యాత్ తర్వాత గిల్ పేర్కొన్నాడు. తాజా మ్యాచ్‌తో గుజరాత్‌కు రెండో విజయం సాధించింది. ప్రస్తుతం 4 పాయింట్లతో నాలుగో స్థానంలో కొనసాగుతోంది. మరోవైపు మూడింట్లో రెండు మ్యాచ్‌ల్లో గెలుపుతో ఆర్సీబీ ఖాతాలో కూడా 4 పాయింట్లు ఉన్నాయి. మెరుగైన రన్‌రేట్ కారణంగా ఆర్సీబీ మూడో స్థానంలో ఉంది.



## ప్రత్యర్థిని గట్టిగా దెబ్బకొట్టిన సిరాజ్

రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరును తమ సొంత గడ్డపై గుజరాత్ టైటాన్స్? చిత్తుగా ఓడించింది. బుధవారం జరిగిన ఈ మ్యాచ్?లో గుజరాత్ 8 వికెట్ల తేడాతో నెగ్గింది. గుజరాత్? బౌలర్ మహమ్మద్ సిరాజ్ ప్రత్యర్థిని గట్టిగా దెబ్బకొట్టాడు. మూడు వికెట్లతో సత్తా చాటి 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'?గా ఎంపికయ్యాడు. అయితే సిరాజ్ గత సీజన్ వరకూ ఆర్సీబీతోనే కలిసి ఆడాడు. ఇదే చిన్నస్వామి మైదానంలోనే ప్రాక్టీస్‌తో పాటు వికెట్లు కూడా తీశాడు. ఇప్పుడు వాళ్లకే ప్రత్యర్థిగా బరిలోకి దిగి తన ఫైర్ చూపించాడు. మూడో ఓవర్?లోనే యంగ్ బ్యాటర్ దేవదత్ పడిక్కల్ (4)ను క్లీన్ బౌల్డ్ చేసి వికెట్ల వేట ప్రారంభించాడు. ఆ తర్వాత డేంజర్ బ్యాటర్ ఫిల్ సాల్ట్? లివింగ్ స్టోన్?ను పెవిలియన్ చేర్చి ప్రత్యర్థిని దెబ్బ కొట్టాడు. సిరాజ్ దెబ్బకు ఆర్సీబీ మూడు కీలక వికెట్లు కోల్పోయింది. ఇలా గుజరాత్ విజయంలో సిరాజ్ కీలక పాత్ర పోషించాడు. ఆర్సీబీతో ఉన్న అనుబంధాన్ని సిరాజ్ గుర్తుచేసుకున్నాడు. 'నేను ఇక్కడ ఏడేళ్లు ఆడాను. నా జెర్సీ రెడ్ నుంచి బ్లూ కి మారిపోయింది. ఇక్కడికి వచ్చాక కాస్త ఎమోషనల్ అయ్యాను. కానీ, బౌలింగ్ చేస్తున్నప్పుడు ఇవేవీ ఆలోచించను. నేను రొనాల్డో ఫ్యాన్?. అందుకే వికెట్ తీసిన సమయంలో అలా సెలబ్రేట్ చేసుకుంటున్నా. ఇంటర్నేషనల్ క్రికెట్?కు బ్రేక్ వచ్చినప్పుడు నా తప్పులు తెలుసుకున్నా. ఫిట్‌నెస్‌పై వర్కౌట్ చేశా' అని సిరాజ్ పేర్కొన్నాడు.

## ఒంటిచేత్తో అదిరిపోయే క్యాచ్

### బాబర్ అజామ్ ఫీల్డింగ్ ప్రతిభకు అభిమానులు ఫిదా

హామిల్టన్‌లోని సెడాన్ పార్క్ వేదికగా పాకిస్తాన్, న్యూజిలాండ్ మధ్య జరిగిన రెండో వన్డేలో పాకిస్తాన్ తడబడ్డప్పటికీ, బాబర్ అజామ్ తన అద్భుతమైన ఫీల్డింగ్‌తో అందరి దృష్టిని ఆకర్షించాడు. బ్యాటింగ్‌లో నిలకడగా రాణించే బాబర్, ఫీల్డింగ్‌లోనూ తన సత్తా చాటుతూ అద్భుతమైన ఒంటిచేత్తో క్యాచ్‌తో అభిమానులను ఉర్రూతలూగించాడు. ఈ క్యాచ్‌ను చూసిన అభిమానులు, మాజీ క్రికెటర్లు, విశ్లేషకులు ఆశ్చర్యానికి గురయ్యారు. "ఇది క్యాచ్ ఆఫ్ ది సెంచరీ!" అని పలువురు ప్రశంసించారు. న్యూజిలాండ్ టాప్ ఆర్డర్ దూకుడుగా ఆడుతున్న సమయంలో, 9వ ఓవర్‌లో మూడో బంతికి ఈ అద్భుతమైన దృశ్యం కనిపించింది. మహ్మద్ వసీం జూనియర్ బౌలింగ్‌లో కివీస్ ఓపెనర్ రైస్ మారియు ఫ్లిక్ చేయడానికి ప్రయత్నించగా, బంతి లీడింగ్ ఎడ్జ్ తీసుకొని ఆఫ్-సైడ్ వైపుకు ఎగిరిపోయింది. కవర్స్ వద్ద ఫీల్డింగ్ చేస్తున్న బాబర్ తన కుడివైపు గాల్లోకి ఎగిరి, ఒంటిచేత్తో అద్భుతంగా క్యాచ్ పట్టాడు. ఈ క్యాచ్‌ను చూసిన ప్రేక్షకులు ఒక్కసారిగా ఆనందంతో కేరింతలు కొట్టారు. ఈ అద్భుతమైన క్యాచ్‌తో బాబర్ అజామ్ మైదానంలో తన నైపుణ్యాన్ని మరోసారి నిరూపించుకున్నాడు. ఫీల్డింగ్‌లో పాకిస్తాన్ జట్టు బలహీనంగా ఉందన్న విమర్శలకు ఈ క్యాచ్ సరైన సమాధానంగా నిలిచింది. బాబర్ కేవలం బ్యాటింగ్‌లోనే కాకుండా, ఫీల్డింగ్‌లోనూ మిగతా క్రికెటర్లకు స్ఫూర్తిగా నిలుస్తున్నాడు. ఈ అద్భుతమైన క్యాచ్ కేవలం మైదానంలోనే కాకుండా, సోషల్ మీడియాలోనూ విపరీతంగా వైరల్ అయింది. అభిమానులు బాబర్ అజామ్ ఫీల్డింగ్‌ను పొగుడుతూ చ%ద్ఝుఝితీూటఝుఎజ్ఞ్ఎష్ట్ర% అనే హ్యాష్‌ట్యాగ్ ట్రెండ్ చేయించారు. భారత మాజీ క్రికెటర్ వీరేంద్ర సెహ్వాగ్ సహా అనేక మంది క్రికెట్ నిపుణులు ఈ క్యాచ్‌పై ప్రశంసలు కురిపించారు. ఒక అభిమాని ట్వీట్ చేస్తూ "బాబర్ అజామ్ సిరీస్‌లో రాణించకపోయినా, ఈ ఒక్క క్యాచ్‌తో అందరి హృదయాలను గెలుచుకున్నాడు" అని పేర్కొన్నారు. మరొకరైతే "ఇది ఏదైనా ఐసీసీ టోర్నమెంట్‌లో జరిగి ఉంటే, ఈ క్యాచ్ హాల్ ఆఫ్ ఫేమ్‌లో చోటు దక్కించుకునేదే!" అని కామెంట్ చేశారు. కానీ, బాబర్ అజామ్ క్యాచ్ వార్తల్లో నిలిచినప్పటికీ, మ్యాచ్ పాకిస్తాన్ జట్టుకు అనుకూలంగా సాగలేదు. న్యూజిలాండ్ బ్యాట్స్‌మెన్ మిచెల్ హే 78 బంతుల్లో 99 పరుగులు చేసి జట్టును భారీ స్కోర్‌కి తీసుకెళ్లాడులి. చివరి బంతికి ఫోర్ కొట్టినప్పటికీ, అతను సెంచరీ మిస్ చేసుకోవడం క్రికెట్ అభిమానులకు నిరాశ కలిగించింది. 292 పరుగుల లక్ష్యాన్ని ఛేధించేందుకు పాకిస్తాన్ బరిలోకి దిగింది. అయితే టాప్ ఆర్డర్ పూర్తిగా విఫలమైంది. బాబర్ అజామ్ ఒక్క పరుగుకే ఔటయ్యాడు. ఫహీమ్ అష్రఫ్ (73), కన్కషన్ సబ్ నసీమ్ షా (51) తప్ప మిగతా బ్యాట్స్‌మెన్ పెద్దగా పోరాటం చేయలేకపోయారు. పాకిస్తాన్ 41.2 ఓవర్లలో 208 పరుగులకు ఆలౌటైంది, దీంతో న్యూజిలాండ్ 84 పరుగుల తేడాతో గెలిచి సిరీస్‌ను 2-0తో కైవసం చేసుకుంది.



## విరాట్ వేలి గాయం పెద్దదేమీ కాదు

### ఆర్సీబీ కోచ్ ఆండీ ఫ్లవర్ వివరణ

### సిరాజ్ ను రిటైన్ చేసుకోనందుకు బాధ లేదు

గుజరాత్ టైటాన్స్ తో మ్యాచ్ సందర్భంగా గాయపడిన స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీకి సంబంధించిన అప్డేట్ వచ్చింది. ప్రస్తుత తన పరిస్థితిని గురించి ఆర్సీబీ కోచ్ ఆండీ ఫ్లవర్ వివరించాడు. విరాట్ కి అయిన వేలి గాయం పెద్దదేమీ కాదని, ప్రస్తుతం తాను ఫైన్ గానే ఉన్నాడని వ్యాఖ్యానించాడు. ఇక చిన్నస్వామి స్టేడియంలో జరిగిన లీగ్ మ్యాచ్ లో టాస్ ఓడి ఫస్ట్ బ్యాటింగ్ చేసిన ఆర్సీబీ.. నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్లక 169 పరుగులు చేసింది. ఆల్ రౌండర్ లియామ్ లివింగ్ స్టన్ (40 బంతుల్లో 54, 1 ఫోర్, 5 సిక్సర్లు) టాప్ స్కోరర్ గా నిలిచాడు. హైదరాబాదీ పేసర్ మహ్మద్ సిరాజ్ మూడు వికెట్లతో సత్తా చాటాడు. అనంతరం గుజరాత్ ఛేదనను 17.5 ఓవర్లలో 2 వికెట్లకు 170 పరుగులు చేసి, పూర్తి చేసింది. బ్యాటర్ జోస్ బట్లర్ (39 బంతుల్లో 73 నాటౌట్, 5 ఫోర్లు, 6 సిక్సర్లు) విధ్వంసక ఫిఫ్టీతో చెలరేగాడు. తాజా విజయంతో గుజరాత్ పాయింట్ల పట్టికలో టాప్-4కి ఎగబాకింది. నిజానికి ఆర్సీబీ తరపునే సిరాజ్ కు గుర్తింపు వచ్చింది. ఐపీఎల్లో ఆడిన తరవాత కోహ్లీ ప్రోత్సాహంతో జాతీయ జట్టు వరకు చేరుకున్నాడు. ఇక గతేదాడి వేలంలో సిరాజ్ ను ఆర్సీబీ రిటైన్ చేసుకోలేదు. దీంతో గుజరాత్ టైటాన్స్ తనను వేలంలో దక్కించుకుంది. ఇక బెంగళూరులో ఆడిన అనుభవం ఉన్న సిరాజ్.. పరిస్థితులను బాగా ఉపయోగించుకుని మూడు వికెట్లు సాధించాడు. దీంతో గుజరాత్ ఈ మ్యాచ్ లో పై చేయి సాధించింది. సిరాజ్ ను రిటైన్ చేసుకోనందుకు బాధేమీ లేదని, ప్రస్తుతమున్న బౌలింగ్ లైనప్ తో హేపీగానే ఉన్నామని ఫ్లవర్ తెలిపాడు. పవర్ ప్లేలో దూకుడుగా ఆడబోయి, ఆర్సీబీ బొక్కాబోర్లా పడింది. వేగంగా పరుగులు సాధించాలని చూసి, నాలుగు వికెట్లన పవర్ ప్లేలో కోల్పోయామని, అదే దెబ్బకొచ్చిందని ఫ్లవర్ తెలిపాడు. ఇక జీటీ మాత్రం.. ఛేదనలో నింపాదిగా ఆడి, వికెట్లను కాపాడుకుని, చివర్లో విజృంభించిందని ప్రశంసించాడు. ఇక ఈ మ్యాచ్ లో ఫలితం ద్వారా టోర్నీలో ఆర్సీబీ తొలి పరాజయాన్ని ఎదుర్కొంది. మరోవైపు జీటీ మాత్రం రెండో విజయాన్ని సాధించింది. ప్రస్తుత పాయింట్ల పట్టికను పరిశీలించినట్లయితే తాజా ఫలితంతో ఆర్సీబీ టాప్ ప్లేస్ నుంచి మూడో స్థానానికి దిగజారింది. గుజారత్ టైటాన్స్ నాలుగో ప్లేస్ ను దక్కించుకుంది. ఇక గురువారం మాజీ చాంపియన్స్ సన్ రైజర్స్ హైదరాబాద్, డిఫెండింగ్ చాంపియన్స్ కోల్కతా నైట్ రైడర్స్ తో తలపడ్నుతుది. గతేడాది ఆడిన మూడు మ్యాచ్ ల్లో కోల్ కతానే నెగ్గింది. లీగ్ మ్యాచ్ లో నాలుగు పరుగులతో నెగ్గిన కేకేఆర్.. ఆ తర్వాత జరిగిన క్వాలిఫయర్ 1, ఫైనల్లో ఎనిమిదేసి వికెట్లతో విజయం సాధించింది. దీంతో ఈ సారి కేకేఆర్ పై విజయం సాధించాలని సన్ పట్టుదలగా ఉంది.

## మీరు జర్నలిస్ట్‌లా.. స్క్రిప్ట్ రైటర్లా?

### ఓ మీడియా ప్రతినిథిపై సూర్యకుమార్ యాదవ్ ఆగ్రహం

ఓ మీడియా ప్రతినిథిపై టీమిండియా టీ20 కెప్టెన్, ముంబై ఇండియన్స్ స్టార్ బ్యాటర్ సూర్యకుమార్ యాదవ్ ఆగ్రహం వ్యక్తం చేశాడు. 'మీరు జర్నలిస్ట్‌లా.. స్క్రిప్ట్ రైటర్లా'అని మండిపడ్డాడు. తనపై తప్పుడు కథనాలను ప్రచురించారని సోషల్ మీడియా వేదికగా అసహనం వ్యక్తం చేశాడు. టీమిండియా యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్.. దేశవాళీ క్రికెట్‌లో ముంబై జట్టును వీడుతున్నట్లు వార్తలు వచ్చాయి. వచ్చే సీజన్ నుంచి అతను గోవాకు ప్రాతినిథ్యం వహించనున్నాడు. ఈ విషయాన్ని జైస్వాల్ కూడా అంగీకరించాడు. గోవా జట్టు కెప్టెన్సీ ఆఫర్ ఇవ్వడంతోనే తాను ఈ నిర్ణయం తీసుకున్నానని తెలిపాడు. ముంబై క్రికెట్ అసోసియేషన్‌కు తాను ఎంతో రుణపడి ఉంటానని కూడా చెప్పాడు. జాతీయ జట్టు తరఫున మ్యాచ్‌లు లేనప్పుడు గోవా తరఫున దేశవాళీ మ్యాచ్‌లు ఆడుతానని తెలిపాడు. అయితే యశస్వి జైస్వాల్‌తో పాటు ముంబై జట్టులోని ఇతర ఆటగాళ్లతో కూడా గోవా క్రికెట్ అసోసియేషన్ టచ్‌లో ఉందని ఓ మీడియా కథనాన్ని ప్రచురించింది. అందులో సూర్యకుమార్ యాదవ్ కూడా ముంబై జట్టును వీడేందుకు సిద్ధమయ్యాడని పేర్కొంది. ఈ కథనంపై ఆగ్రహం వ్యక్తం చేసిన సూర్యకుమార్ యాదవ్.. అందుకు సంబంధించిన స్క్రీన్ షాట్‌ను షేర్ చేస్తూ సదరు జర్నలిస్ట్‌పై మండిపడ్డాడు. కామెడీ సినిమాలు చూడటం మానేసి ఇలాంటి వార్తలు చదవడం మొదలుపెడుతానని సెటైర్లు పేల్చాడు.'నువ్వు స్క్రిప్ట్ రైటరా? జర్నలిస్ట్‌వా..? ఇక నుంచి నవ్వుకోవాలంటే కామెడీ సినిమాలు చూడటం మానేసి ఈ ఆర్టికల్స్ చదవడం మొదలుపెట్టాలి. ఇదో చెత్త కథనం' అని సూర్యకుమార్ యాదవ్ ట్వీట్ చేశాడు. సూర్య విమర్శలతో సదరు మీడియా సంస్థ ఈ ఆర్టికల్‌ను అప్‌డేట్ చేసింది. సూర్యకుమార్ యాదవ్ ఈ వార్తలను ఇంకా ధృవీకరించలేదని పేర్కొంది.



## అత్యధిక వికెట్లు తీసిన పేసర్ల జాబితాలో భువీ

ఐపీఎల్ 2025లో జరిగిన రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, గుజరాత్ టైటాన్స్ మ్యాచ్‌లో, భారత అనుభవజ్ఞులైన పేసర్ భువనేశ్వర్ కుమార్ చరిత్ర సృష్టించాడు. ఐపీఎల్ చరిత్రలో అత్యధిక వికెట్లు తీసిన పేసర్ల జాబితాలో భువి మూడో స్థానాన్ని దక్కించుకున్నాడు. చిన్నస్వామి స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో, తొలుత బ్యాటింగ్ చేసిన ఆతిథ్య జట్టు 169 పరుగులు చేసింది. అనంతరం గుజరాత్ టైటాన్స్ బ్యాటింగ్ ప్రారంభించగా, భువనేశ్వర్ కుమార్ తన స్వింగ్ బౌలింగ్‌తో మొదటి బ్లోనే ఇచ్చాడు. పవర్‌ప్లేలో గుజరాత్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌ను అవుట్ చేసి, జట్టుకు కీలకమైన ముందంజ అందించాడు. ఐదో ఓవర్ నాలుగో బంతికి గిల్ భారీ షాట్ ఆడాలని ప్రయత్నించాడు. అయితే, బాల్ మిస్టైమ్ అవ్వడంతో లియామ్ లివింగ్‌స్టోన్ అద్భుతమైన క్యాచ్ పట్టి అతన్ని పెవిలియన్‌కు పంపాడు. ఈ వికెట్‌తో, భువనేశ్వర్ ఐపీఎల్‌లో అత్యధిక వికెట్లు తీసిన పేసర్ల జాబితాలో డ్వేన్ బ్రావో రికార్డును సమం చేశాడు. ఇప్పుడు భువనేశ్వర్ కుమార్ 183 వికెట్లతో బ్రావో సరసన చేరాడు. భువనేశ్వర్ తక్కువ మ్యాచ్‌ల్లోనే ఈ ఘనత సాధించడంతో ఇది మరింత ప్రత్యేకంగా మారింది. అతడు 178 ఇన్నింగ్స్‌ల్లో 183 వికెట్లు తీసి, 158 ఇన్నింగ్స్‌ల్లో 183 వికెట్లు తీసిన బ్రావోతో సమంగా నిలిచాడు. ఐపీఎల్ చరిత్రలో అత్యధిక వికెట్లు సాధించిన బౌలర్లు: 1. యుజ్వేంద్ర చహల్ %-% 206 వికెట్లు (161 ఇన్నింగ్స్‌లు) 2. పియూష్ చావ్లా %-% 192 వికెట్లు (191 ఇన్నింగ్స్‌లు) 3. డ్వేన్ బ్రావో %-% 183 వికెట్లు (158 ఇన్నింగ్స్‌లు) 4. భువనేశ్వర్ కుమార్ %-% 183 వికెట్లు (178 ఇన్నింగ్స్‌లు) 5. రవిచంద్రన్ అశ్విన్ %-% 183 వికెట్లు (211 ఇన్నింగ్స్‌లు) 6. సునీల్ నరైన్ %-% 181 వికెట్లు (177 ఇన్నింగ్స్‌లు) ఈ జాబితాలో భువనేశ్వర్ కుమార్, బ్రావో, రవిచంద్రన్ అశ్విన్ సమంగా ఉన్నా, భువీ తక్కువ ఇన్నింగ్స్‌ల్లో ఈ ఘనత సాధించడం ప్రత్యేకమైన విషయం. ఇక భువీ తన ఫామ్ కొనసాగిస్తే, ఈ లీగ్‌లో అత్యధిక వికెట్ల వేటలో మరింత పైకి వెళ్లే అవకాశం ఉంది. ఈ అరుదైన భువనేశ్వర్ రికార్డు ఐపీఎల్ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోనుంది. ప్రస్తుతం %=జదీ%-గుజరాత్ టైటాన్స్ మ్యాచ్‌లో అతడి అద్భుతమైన ప్రదర్శన ఫ్యాన్స్‌ను ఉత్సాహపరుస్తోంది. భువీ ఇప్పటికీ భారత క్రికెట్‌కు విలువైన బౌలర్ అని ఈ రికార్డుతో మరోసారి రుజువయ్యింది! ఇరుజట్ల ప్లేయింగ్-11 రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు: రజత్ పాటిదార్ (కెప్టెన్), ఫిల్ సాల్ట్, విరాట్ కోహ్లీ, దేవదత్ పడిక్కల్, లియామ్ లివింగ్‌స్టోన్, జితేష్ శర్మ (వికెట్ కీపర్), టిమ్ డేవిడ్, కృనాల్ పాండ్యా, భువనేశ్వర్ కుమార్, జోష్ హేజిల్‌వుడ్, యశ్ దయాల్. ఇంపాక్ట్ ప్లేయర్స్: సుయాష్ శర్మ, రసిఖ్ దార్ సలామ్, మనోజ్ భాండాగే, జాకబ్ బెతేల్, స్వప్నిల్ సింగ్. గుజరాత్ టైటాన్స్: శుభ్‌మాన్ గిల్ (కెప్టెన్), సాయి సుదర్శన్, జోస్ బట్లర్, షారుక్ ఖాన్, రాహుల్ తెవాటియా, అర్షద్ ఖాన్, రషీద్ ఖాన్, సాయి కిషోర్, మహమ్మద్ సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణ, ఇషాంత్ శర్మ. ఇంపాక్ట్ ప్లేయర్స్: మహిపాల్ లోమ్రోర్, గ్లెన్ ఫిలిప్స్, అనుజ్ రావత్, వాషింగ్టన్ సుందర్, షెర్ఫాన్ రూథర్‌ఫోర్డ్.



# విశ్వేజి



## రక్తదానం చేస్తే డయాబెటిస్ ప్రమాదం తగ్గుతుందా? గుండెకు ప్రయోజనమా?

### కీలక విషయాలు బయటకి

రక్తదానం చేయడం అనేది చాలా గొప్ప విషయం. ఒక ఆరోగ్యకరమైన వ్యక్తి చేసే రక్తదానం ఆపదలో లేదా ఎమర్జెన్సీలో ఉన్న వారికి సహాయపడుతుందని మనందరికీ తెలిసిందే. అయితే రక్తదానం వల్ల ఇతరులకు సహాయం చేయడం కంటే సొంత ఆరోగ్యానికి కూడా ఎక్కువే సహాయం చేసినట్లవుతుందని అనేక అధ్యయనాలు సూచిస్తున్నాయి. అంటే సాధారణ జనాభా కంటే క్రమం తప్పకుండా రక్తదానం చేసేవాళ్లు ఆరోగ్యంగా ఉండవచ్చు. రక్తదానం చేయడం వల్ల డయాబెటిస్ ప్రమాదాన్ని తగ్గించవచ్చా రక్తదానం చేయడం వల్ల టైప్ 2 డయాబెటిస్ ప్రమాదాన్ని తగ్గించవచ్చని నిపుణులు చెబుతున్నారు. ఈ విషయమై ఇంకా లోతుగా అధ్యయనాలు కొనసాగుతున్నాయని చెప్పారు. రక్తదానం.. ఆహారం, వ్యాయామానికి ప్రత్యామ్నాయం కానప్పటికీ ఇది అదనపు రక్షణ పొరను అందిస్తుందని చెబుతున్నారు. రక్తదానం క్యాన్సర్ ప్రమాదాన్ని తగ్గించగలదా? లండన్ లోని ఫ్రాన్సిస్ క్రిక్ ఇన్‌స్టిట్యూట్ చేపట్టిన ఓ అధ్యయనం..తరచుగా రక్తదానం చేయడం, బ్లడ్ క్యాన్సర్ ప్రమాదాన్ని తగ్గించడం మధ్య ఊహించని సంబంధాన్ని వెలుగులోకి తెచ్చింది. వయస్సు పెరిగే కొద్దీ మన రక్తం ఏర్పడే మూల కణాలు సహజంగా ఉత్పరివర్తనలను కూడగట్టుకుంటాయి. ఈ ప్రక్రియను క్లోనల్ హెమటోపోయిసిస్ అంటారు. ఈ మార్పులలో కొన్ని లుకేమియా,ఇతర రక్త రుగ్మతల ప్రమాదాన్ని పెంచుతాయి. పరిశోధకులు 60 ఏళ్ల వయసున్న రెండు రకాల ఆరోగ్యవంతమైన పురుషులను పోల్చారు..ఒక గ్రూపు 40 సంవత్సరాల పాటు సంవత్సరానికి మూడు సార్లు రక్తదానం చేయగా..మరొక గ్రూపు మొత్తం ఐదు సార్లు రక్తదానం చేసింది. ఈ పరీక్షలో ఫలితాలు ఆసక్తికరంగా ఉన్నాయి. రెండు గ్రూపులలో జన్యు ఉత్పరివర్తనలు ఒకే సంఖ్యలో ఉన్నాయి, కానీ తరచుగా రక్తం దానం చేసిన వ్యక్తులు క్యాన్సర్‌తో సంబంధం లేని ఎక్కువ ఉత్పరివర్తనాలను కలిగి ఉన్నారు. %్రాశీషవతీవస దీఎ% క్రమం తప్పకుండా రక్తదానం చేయడం వల్ల తాజా రక్త కణాల ఉత్పత్తి పెరుగుతుందని, ఇది జన్యు స్వరూపాన్ని ప్రయోజనకరమైన మార్గాల్లో మార్చగలదని పరిశోధకులు విశ్వసిస్తున్నారు. దీనిపై మరిన్ని పరిశోధనలు అవసరం అయినప్పటికీ ప్రస్తుత ఫలితాలు మాత్రం సంభావ్య రక్షణ ప్రభావాన్ని సూచిస్తున్నాయి. దొరికిందే ఛాన్స్ అని ఫుల్లుగా తింటున్నారా? అతిగా తిన్న తర్వాత కూడా ఆరోగ్యంగా ఉండాలంటే ఇలా చేయండి గుండె ఆరోగ్యం రక్తదానం చేయడం వల్ల కలిగే అత్యంత చక్కగా నమోదు చేయబడిన ప్రయోజనాల్లో ఒకటి హృదయ ఆరోగ్యంపై దాని సంభావ్య ప్రభావం. మీ రక్తం ఎంత మందంగా లేదా సన్నగా ఉంటుంది అనేది గుండె జబ్బులలో ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. రక్తం చాలా మందంగా మారినప్పుడు అది గడ్డకట్టడం, అధిక రక్తపోటు, స్ట్రోక్ ప్రమాదాన్ని పెంచుతుంది. రక్తదానం చేయడం వల్లమీరు రక్త గడ్డకట్టడాన్ని తగ్గించగలుగుతారు. మీ గుండె పంప్ చేయడాన్ని సులభతరం చేస్తారు, గుండె జబ్బుల సమస్యల ప్రమాదాన్ని తగ్గించుకోగలుగుతారు.

## జ్ఞాపకశక్తి మందగిస్తుందా..

## అయితే మెదడును షార్ప్‌గా ఉంచే ట్రిక్స్ ఇవిగో!





మన రోజువారీ జీవనశైలి, ఆహారం, ఒత్తిడి, శారీరక శ్రమలతో మానసిక సామర్థ్యం ప్రభావితమవుతుంది. కొన్నిసార్లు మతిమరపు సమస్యలు, సాధారణంగా గందరగోళం, ఏదైనా గుర్తు పట్టలేకపోవడం, ఏదైనా పని మరిచిపోవడం అనేవి సాధారణమే. కానీ దీర్ఘకాలికంగా జ్ఞాపకశక్తి మందగిస్తే, అది ఆందోళనకరమైన విషయం కావచ్చు. అయితే, సరైన ఆహారం, వ్యాయామం, మానసిక శ్రమ, జీవనశైలి మార్పులు ద్వారా మెదడును ఆరోగ్యంగా ఉంచుకోవచ్చు. మెదడుకు సరైన ఆహారం అందించాలి శరీరానికి, ముఖ్యంగా మెదడుకు అవసరమైన పోషకాలు అందకపోతే జ్ఞాపకశక్తి మందగించవచ్చు. అందుకే, పోషకాహారం తీసుకోవడం అనేది అత్యంత కీలకం. ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్స్ ఉన్న ఆహారాలను తీసుకోవాలి. ముఖ్యంగా చేపలు, అవిసె గింజలు, వాల్‌నట్స్ తినడం మెదడుకు మేలు చేస్తాయి. యాంటీఆక్సిడెంట్లు ఎక్కువగా ఉండే బెర్రీ పండ్లు, గ్రీన్ టీ, క్యారెట్, బీట్‌రూట్ లాంటి ఆహారాలు మెదడును ఉత్తేజితం చేస్తాయి. పెరుగును తినడం వల్ల దానిలోని ప్రొబయాటిక్స్ ఉండటం వల్ల మెదడు పనితీరు మెరుగుపడుతుంది. డార్క్ చాక్లెట్ కూడా జ్ఞాపకశక్తిని పెంచుతుంది. ఇది మెదడుకు కావాల్సిన యాంటీఆక్సిడెంట్లు అందిస్తుంది. అంతే కాకుండా సపోటా, యాపిల్, అవకాడో, స్పినచ్ వంటి ఆహార పదార్థాలు మెదడును శక్తివంతంగా ఉంచుతాయి. వ్యాయామం %ఱ% ధ్యానం చేయడం శారీరక శ్రమ లేకపోతే మెదడు నెమ్మదించిపోతుంది. కాబట్టి వ్యాయామాన్ని నిత్యక్రియగా చేసుకోవాలి. నడక, జాగింగ్, యోగా వల్ల రక్త ప్రసరణను మెరుగుపరిచి మెదడుకు ఆక్సిజన్‌ను సరఫరా చేస్తాయి. ధ్యానం %ఱ% ప్రాణాయామం చేస్తే ఒత్తిడిని తగ్గించడంతో పాటు మెదడును ప్రశాంతంగా ఉంచుతాయి. శరీర ధృఢత్వాన్ని పెంచే వ్యాయామాలైన స్ట్రెచింగ్, స్విమ్మింగ్, డాన్స్ వంటి శారీరక శ్రమలు మెదడు కణాలను ఉత్తేజితం చేస్తాయి. మెదడును శక్తివంతంగా ఉంచే అలవాట్లు క్రాస్‌వర్డ్స్, పజిల్స్, సుదోకు వంటి అలవాట్లు పెంచుకోండి. ఇది మెదడు చురుకుగా ఉండటానికి సహాయపడతాయి. పుస్తకాలు చదవడం వల్ల జ్ఞాపకశక్తిని పెంచుతుంది . కొత్త భాష లేదా నైపుణ్యాన్ని అభ్యాసం చేయడం వల్ల మెదడు వినాశనాన్ని నివారించడంలో సహాయపడుతుంది. చిత్రలేఖనం, సంగీతం, క్రియేటివ్ ఆర్ట్స్ మీ మెదడు ఉత్తేజితంగా ఉండేందుకు సహాయపడతాయి. ఒత్తిడిని నియంత్రించుకోవడానికి ప్రయత్నించండి. రోజుకు 7-8 గంటలు నిద్రపోవడం ద్వారా మెదడు విశ్రాంతి తీసుకుంటుంది. అధిక బరువు మెదడు పనితీరును దెబ్బతీస్తుంది. పాజిటివ్‌గా ఉండడం అలవాటు చేసుకోండి. ఇది సంతోషంగా ఉండే వ్యక్తుల మెదడు చురుకుగా పనిచేస్తుంది. ఇంటి చిట్కాలు బాదం గుడ్డు తీసుకోండి. రోజూ 5-6 బాదం తినడం మెదడు చురుకుగా ఉండేందుకు సహాయపడుతుంది. అదే విధంగా మెంతులు జీలకర్ర నీళ్లు తాగడం అలవాటు చేసుకోండి. ఇవి మెదడుకు అవసరమైన పోషకాలను అందిస్తాయి. తులసి, అశ్వగంధ, బ్రాహ్మి వంటివి తీసుకోండి. ఇవి మెదడు శక్తిని పెంచే సహజమైన ఆయుర్వేద మూలికలుగా పనిచేస్తాయి. జ్ఞాపకశక్తి మందగించకుండా ఉండాలంటే, సరైన ఆహారం, వ్యాయామం, నిద్ర, మెదడుకు మానసిక శ్రమ ఇవన్నీ సమతుల్యంగా ఉండాలి. మన మెదడును ఉపయోగంలో ఉంచే ప్రయత్నం చేయాలి. జీవితంలో చిన్న మార్పులతో మెదడు సామర్థ్యాన్ని మెరుగుపరుచుకోవచ్చు. ఆరోగ్యకరమైన జీవనశైలి పాటించడం ద్వారా మెదడు చురుకుగా ఉండేలా చూసుకోవచ్చు.

## వేసవిలో వేడి నీటితో స్నానం చేస్తే ఏమవుతుంది?

### నిపుణులు ఏమంటున్నారంటే?



శీతాకాలంలో చాలా మంది ఆ చలి నుంచి రక్షణ పొందడానికి, ఆ చలిని తట్టుకోవడానికి ఎక్కువగా వేడినీటితో స్నానం చేస్తుంటారు. ఇలా చేయడం వలన చలి నుంచి ఉపశమనం పొందడంతో పాటు కొంత ఆరోగ్యానికి కూడా మేలు జరుగుతుంది. అలాగే మన మనస్సుకు కూడా చాలా తాజాదనాన్ని అందజేస్తుంది. అయితే ఇప్పుడు వేసవి వచ్చేసింది. బయట ఎండలు ఘోరంగా దంచి కొడుతున్నాయి. బయటికి వెళ్లాలంటే చాలు ఆ ఎండ దెబ్బకు ఎక్కడ చతికిల పెడతామో అని భయం వేస్తుంది. అయితే అంత వేడిలో కూడా కొంత వేడి నీటితో స్నానం చేయడానికి ఇష్టపడుతుంటారు. ఇలా చేయడం వలన ఆరోగ్యానికి మేలు జరుగుతుందని భావిస్తున్నారు. కానీ అది నిజం కాదు. వేసవిలో కూడా వేడి నీటితో స్నానం చేయడం వలన అనేక ఆరోగ్య సమస్యలు వస్తాయి. అలాగే కొన్ని అనుకోని సంఘటనలు జరగవచ్చు. ఆ సమస్యలు ఏంటి? వేసవిలో వేడి నీటితో స్నానం చేయడం వలన ఏం జరుగుతుంది అనేది ఈ స్టోరీలో తెలుసుకుందాం. అధిక రక్తపోటు.. వేసవి కాలంలో వేడి నీటితో స్నానం చేయడం అధిక రక్తపోటు, హృదయ సమస్యలు, మరియు ఇతర ఆరోగ్య సమస్యలను కూడా తీసుకురావచ్చు. వేడి నీరు శరీరంలో రక్త ప్రసరణపై ప్రభావం చూపించి, రక్తపోటు స్థాయిలను పెంచుతుంది. ఇది రక్తపోటు సంబంధిత సమస్యలకు మరింత ప్రమాదం కలిగిస్తుంది. “మండే ఎండలో ఈ షర్బత్ తాగితే చిటికెలో బాడీ కూల్ అయిపోతుంది, రంజాన్ స్పెషల్ కూడా.. ఎలా చేసుకోవాలంటే” అలాగే, వేసవిలో శరీరం ఇప్పటికే అధిక ఉష్ణోగ్రతలకు లోనవుతుంది. వేడి నీటితో స్నానం చేయడం వల్ల చర్మం మరింత తీవ్రంగా ప్రభావితం అవుతుంది. వేడి నీటితో స్నానం చేయడం వల్ల చర్మంలోని కెరాటిన్ కణాలు దెబ్బతింటాయి. తద్వారా చర్మం యొక్క సహజ నూనె ఉత్పత్తి తగ్గిపోతుంది. ఈ కారణంగా చర్మం పొడిగా మారుతుంది. దాని మృదుత్వం తగ్గుతుంది, మరియు దురద వంటి సమస్యలు పెరుగుతాయి. పొడిగా మారుతుంది.. “తరచుగా శృంగారంలో పాల్గొంటే ఈ అరుదైన వ్యాధి వస్తుందట.. లక్షణాలు ఎలా ఉంటాయంటే?” అంతేకాక, వేడి నీటి స్నానాలు చర్మం మీద ప్రదర్శించే ప్రభావాల కంటే మరింత గందరగోళం కూడా సృష్టించవచ్చు. నీటిలో ఉండే క్లోరిన్ అనేది చర్మం యొక్క సహజ నూనె ఉత్పత్తికి అవరోధాన్ని కలిగిస్తుంది, దీంతో చర్మం మరింత పొడిగా, హాని చెందుతుంది. గుండె సంబంధిత ఆరోగ్య సమస్యలు ఉన్న వారు కూడా వేడి నీటితో స్నానం చేయడం వల్ల ప్రమాదానికి గురవవచ్చు. వేడి నీటితో స్నానం చేయడం వల్ల శరీరంలోని హృదయనాళాల మీద తీవ్ర ప్రభావం పడుతుంది, ఇది హృదయ వ్యాధులకు ముప్పు కలిగిస్తుంది. మరొక ముఖ్యమైన విషయం జుట్టు సంరక్షణ. వేసవి కాలంలో వేడి నీటితో స్నానం చేయడం వల్ల జుట్టులోని సహజ తేమ తగ్గిపోతుంది, దీనివల్ల జుట్టు నెరసిపోతుంది. అలాగే చాలా పొడిగా మారుతుంది. ఇది జుట్టుకు నష్టం కలిగించే ఆవకాశాన్ని పెంచుతుంది. వేసవిలో వేడి నీటితో తరచూ స్నానం చేయడం వల్ల చర్మ అలెర్జీలు, దురద, మొటిమలు, మరియు ఇతర చర్మ సమస్యలు పెరిగే అవకాశం కూడా ఉంది. అందుకే వేసవిలో వేడి నీటితో స్నానం చేయకూడదని వైద్యులు, ఆరోగ్య నిపుణులు కూడా సూచిస్తున్నారు. వేసవిలో చల్లగా ఉన్న నీటితో స్నానం చేయడం చర్మానికి, జుట్టుకు మరియు మొత్తం ఆరోగ్యానికి మంచిదని, వేడి నీటితో స్నానం చేస్తే కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొంటున్నారు.

# మార్కెట్

## ట్రంప్ ప్రతీకార సుంకాలు.. నష్టాల్లో మొదలైన స్టాక్ మార్కెట్లు..

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్‌పై ప్రతీకార సుంకాలను ప్రకటించారు. భారత్‌పై 26శాతం ప్రతికార సుంకాలను విధిస్తున్నట్లు ప్రకటించారు. ట్రంప్ సుకాల ప్రభావం గురువారం భారత స్టాక్ మార్కెట్లపై తీవ్ర ప్రభావం పడింది. దాంతో మార్కెట్లు నష్టాల్లో మొదలయ్యాయి. ప్రారంభంలోనే మార్కెట్లు నష్టాలతో మొదలయ్యాయి. సెన్సెక్స్, నిఫ్టీ భారీగా పతనమయ్యాయి. ప్రస్తుతం సెన్సెక్స్ 343.75 పాయింట్లు పతనమై.. 76,273.69 పాయింట్ల వద్ద ట్రేడవుతున్నది. నిఫ్టీ 88.15 పాయింట్లు తగ్గి.. 23,244.20 వద్ద కొనసాగుతున్నది. ట్రేడింగ్‌లో దాదాపు 106 షేర్లు లాభపడగా.. 234 షేర్లు పతనమయ్యాయి. సన్ ఫార్మా, డాక్టర్ రెడ్డీస్, సిప్లా, పవర్ గ్రిడ్ కార్పొరేషన్, శ్రీరామ్ ఫైనాన్స్, ఎన్‌టీపీసీ, బజాజ్ ఫైనాన్స్, టైటాన్ కంపెనీ లాభాల్లో కొనసాగుతున్నాయి. ఇక బజాజ్ ఆటో, ఇన్ఫోసిస్, టీసీఎస్, హెచ్‌సీఎల్ టెక్, టెక్ మహీంద్రా, ఓఎన్‌జీసీ, విప్రో, టాటా మోటార్స్ నష్టాల్లో కొనసాగుతున్నాయి. ఇప్పటికే వరుస నష్టాలతో లక్షల కోట్ల సంపద ఆవిరి కాగా.. గురువారం సైతం భారీగా నష్టాలు పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. అలాగే, అంతర్జాతీయ మార్కెట్లు సైతం నష్టాల్లోనే కొనసాగుతున్నాయి. సుమారు నాలుగు శాతం నాస్డాక్ ఫ్యూచర్స్ డౌన్ అయ్యాయి. స్ట్రెయిట్ టైమ్స్, హంగ్‌సెంగ్, నిక్కీ225 నష్టాల్లో కొనసాగుతున్నాయి. అమెరికాకు ముఖ్యమైన భాగస్వామి అయినప్పటికీ.. ట్రంప్ రెండో ‘టారిఫ్ కింగ్’ భారత్‌ను అభివర్ణించారు. ట్రంప్ నిర్ణయం 50శాతం బేసిస్ పాయింట్లకుపైగా ప్రభావితం చేయగలదని అంతర్జాతీయ బ్రోకింగ్ సంస్థ మాక్వేరీ పేర్కొంది. 26 శాతం సుంకం భారతదేశ జీడీపీపై 30 బిలియన్ల మేర ప్రభావం చూడపే అవకాశం ఉందని పేర్కొంది. 2025 క్యాలెండర్ ఇయర్ చివరి నాటికి భారత్ కలిగి ఉండే 4.3 ట్రిలియన్ డాలర్ల జీడీపీలో దాదాపు 0.7శాతం ఉంటుందని ఐఎంఎఫ్ పేర్కొంది.



## జాబ్ మార్కెట్‌లో నీరసం




### మార్చిలో వైట్-కాలర్ హైరింగ్ తగ్గుముఖం

**నౌకరీ.కామ్ తాజా నివేదికలో వెల్లడి**

ముంబై : దేశీయ జాబ్ మార్కెట్‌ను నీరసం ఆవహించింది. గత నెల మార్చిలో వివిధ రంగాల్లో వైట్-కాలర్ హైరింగ్ తగ్గుముఖం పట్టినట్టు ఓ తాజా నివేదికలో తేలింది. గత ఏడాది మార్చితో పోల్చితే ఈసారి 1.4 శాతం మేర నియామకాలు పడిపోయినట్టు బుధవారం విడుదలైన నౌకరీ.కామ్ రిపోర్టు చెప్తున్నది. దేశ, విదేశాల్లో నెలకొన్న పలు ప్రతికూల పరిస్థితులు.. ఆయా రంగాలను నిస్తేజంలోకి నెడుతున్నాయి. ఈ క్రమంలోనే కొత్తగా ఉద్యోగ-ఉపాధి అవకాశాలు సన్నగిల్లుతున్నాయి. ఇదీ సంగతి.. ఈ ఏడాది మార్చిలో రిటైల్, చమురు-గ్యాస్, విద్యా రంగాల్లో వైట్-కాలర్ కొలువుల్లోకి రిక్రూట్‌మెంట్లు పడిపోయాయి. నిరుడు మార్చితో పోల్చితే రిటైల్‌లో 13 శాతం, చమురు-గ్యాస్‌లో 10 శాతం, విద్యా రంగంలో 14 శాతం చొప్పున కొత్త నియామకాలు దిగజారాయని జాబ్‌స్పీక్ ఇండెక్స్ డాటా ఆధారంగా నౌకరీ.కామ్ రూపొందించిన నివేదికలో తేటతెల్లమైంది. నౌకరీ జాబ్‌స్పీక్ అనేది ఓ నెలవారీ సూచీ. ఇది నౌకరీ.కామ్ డాటాబేస్ రెజ్యూమ్‌పై రిక్రూటర్లు చేసే ఉద్యోగ సంబంధిత అన్వేషణలు, కొత్త ఉపాధి అవకాశాల ఆధారంగా భారతీయ జాబ్ మార్కెట్, నియామక కార్యకలాపాలను ప్రతిబింబిస్తుంది. కాగా, అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ రెండోసారి ఎన్నికైన దగ్గర్నుంచి.. మారిన దేశ, విదేశీ మార్కెట్ పరిస్థితులు నియామకాలను పెద్ద ఎత్తునే ప్రభావితం చేస్తున్నట్టు విశ్లేషకులు పేర్కొంటున్నారు. కఠిన వీసా నిబంధనలు, ప్రతీకార సుంకాలు, వాణిజ్య ఆంక్షలు.. కంపెనీలను దెబ్బతీస్తున్నాయంటున్నారు. హైదరాబాదీ యునికార్న్‌లు వెనుకంజ ఈ ఏడాది మార్చిలో యునికార్న్ హైరింగ్ పవర్‌హౌజ్‌గా చెన్నై నిలిచింది. చెన్నైకి చెందిన స్టార్టప్ సంస్థలు రిక్రూట్‌మెంట్లలో 29 శాతం వృద్ధిని కనబర్చాయి. ఈ విషయంలో ఢిల్లీ-ఎన్‌సీఆర్ 23 శాతంతో రెండో స్థానంలో ఉన్నాయి. ఇక హైదరాబాద్‌లోని యునికార్న్‌లు 17 శాతంతో సరిపెట్టుకున్నాయి. కాగా, బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్ యునికార్న్‌లు దూకుడు మీదున్నాయి. నియామకాల్లో ఈ రంగాల సంస్థలు 36 శాతం వృద్ధిని చూపాయి. రూ.8,500 కోట్లు విలువ కలిగిన స్టార్టప్ కంపెనీలనే యునికార్న్‌లుగా పిలుస్తారన్న సంగతి విదితమే.

## తులం బంగారం లక్ష?

### ట్రంప్ టారిఫ్‌లతో గోల్డ్ రేట్లు భారీగా పెరుగుతాయన్న అంచనాలు

### త్వరలోనే దేశీయ మార్కెట్‌లో తులం ధర లక్ష మార్కును చేరే అవకాశం

న్యూఢిల్లీ : రేపోమాపో తులం బంగారం ధర లక్ష రూపాయలను చేరే అవకాశాలు కనిపిస్తున్నాయి. దేశీయ మార్కెట్‌లో ఇప్పటికే ఆల్‌టైమ్ హైలో కదలాడుతున్న గోల్డ్ రేట్లను.. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ టారిఫ్‌లు మరింత పరుగులు పెట్టించే వీలుందన్న అంచనాలు వినిపిస్తున్నాయి మరి. ఇదే జరిగితే 24 క్యారెట్ 10 గ్రాములు లక్ష రూపాయలను దాటేసే రోజు ఎంతో దూరంలో లేదనే అంటున్నారంతా. బుధవారం స్పాట్ మార్కెట్‌లో డిమాండ్ అంతగా లేకపోవడంతో ఫ్యూచర్ ట్రేడింగ్‌లో తులం విలువ రూ.154 తగ్గి రూ.90,721గా నమోదైంది. అయితే మంగళవారం మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్‌పై జూన్ డెలివరీకి గోల్డ్ కాంట్రాక్ట్సుకుగాను ఆల్‌టైమ్ హైని తాకుతూ రూ.91,400 పలకడం గమనార్హం. అలాగే స్పాట్ మార్కెట్‌లో 24 క్యారెట్ తులం తొలిసారి రూ.94,150గా పలికిన సంగతి విదితమే. మరోవైపు గ్లోబల్ మార్కెట్‌లో పసిడి ధర ఔన్స్ 3,100 డాలర్లను అధిగమించింది. స్టాక్ నష్టాలతో.. ట్రంప్ టారిఫ్‌లు, ఆర్థిక మందగమనం భయాల నడుమ భారత్‌సహా ప్రపంచవ్యాప్తంగా స్టాక్ మార్కెట్లు తీవ్ర ఒడిదుడుకులకు లోనవుతున్నాయి. దీంతో మదుపరులు తమ పెట్టుబడుల రక్షణార్థం పసిడివైపు చూస్తున్నారు. దీనికితోడు హోల్‌సేల్, రిటైల్ జ్యుయెల్లర్స్ నుంచి డిమాండ్ కూడా ఉండటంతో మార్కెట్‌లో పుత్తడి ధరలు వేగంగా పెరుగుతూపోతున్నాయి.

# మంగళగిరిని అద్భుతంగా అభివృద్ధి చేస్తా

**క్రమంగా వరుసగా అభివృద్ధి కార్యక్రమాలు**

**ఉండవల్లిలో మన ఇల్లు -మన లోకేష్ కార్యక్రమం**

**దంపతులకు తొలిగా శాశ్వత నివాస పట్టా అందచేత**

**అభివృద్ధి కార్యక్రమాలను పూర్తి చేస్తామని లోకేశ్ హామీ**



గుంటూరు : యువగళం పాదయాత్రలో ఇచ్చిన హామీలో భాగంగా మంగళగిరి నియోజకవర్గంలోని తాడేపల్లి మండలం ఉండవల్లిలో సీతామహాలక్ష్మికి మంత్రి నారా లోకేష్ ఇంటి పట్టా అందించారు. గురువారం మంగళగిరి నియోజకవర్గం ఉండవల్లిలో మన ఇల్లు మన లోకేష్ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా రాజమండ్రి గోవిందు, సీతామహాలక్ష్మి దంపతులకు ఉండవల్లిలో తొలి శాశ్వత ఇంటి పట్టాను మంత్రి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కుప్పం, హిందూపూర్ లాగా మంగళగిరిని టిడిపి కంచుకోటగా నిర్మిస్తానని అన్నారు. ఈరోజు కూటమి ప్రభుత్వంలో పేదలందరికీ ఉచితంగా ఇంటి పట్టాలు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నాం.. దశాబ్దాలుగా నివాసం ఉంటున్న చోటే పట్టాలు ఇవ్వాలని కోరారు.. మొదటి విడతగా మూడు వేల మందికి ఇంటి పట్టాలు ఇస్తున్నామన్నారు. అయితే, తాను మొదటిసారి మంగళగిరిలో పోటీచేసి ఓడిపోయా.. మొదటి రోజు బాధపడినా మరుసటి రోజు నుంచి ప్రజల మనసులు గెలవాలని పని చెయ్యడం మొదలు పెట్టానని మంత్రి లోకేష్ వెల్లడించారు. 2024లో నన్ను గెలిపించాలని కోరా.. ఎవరూ ఊహించని విధంగా రికార్డు మెజారిటీతో నన్ను గెలిపించారు అని మంత్రి నారా లోకేష్ తెలిపారు. స్వచ్ఛ మంగళగిరి పేరుతో దేశంలో ఈ నియోజకవర్గాన్ని నెంబర్ వన్ గా తయారు చేయాలని పని చేస్తున్నాను.. మంగళగిరి లక్ష్మీనరసింహ స్వామి ఆలయాన్ని అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మంగళగిరిలో అత్యంత ఆధునిక వసతులతో వంద పడకల ఆసుపత్రి నిర్మిస్తాం.. ప్రభుత్వ నిధులతో పాటు దాతల సహకారంతో అభివృద్ధి పనులు చేపడతానని అన్నారు. మంగళగిరి చేనేతలు, స్వర్ణకారుల కోసం ప్రత్యేక నిర్మాణాలు చేపడతామని నారా లోకేష్ పేర్కొన్నారు. రాష్ట్రంలో జేసీబీ పాలన పోయి పేదలకు పట్టాలిచ్చే ప్రభుత్వం వచ్చిందని మంత్రి నారా లోకేష్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ఏర్పడిన 10నెలల్లో మంగళగిరిలో తొలి పట్టాకు శ్రీకారం చుట్టామన్నారు. లోకేష్ గెలిస్తే మంగళగిరిలో ఉన్న ఇళ్లు పీకేస్తారంటూ చేసిన అసత్య ప్రచారం నోర్లు 10 నెలల్లో మూయించామని తెలిపారు. మూడు దశల్లో అన్ని సమస్యలు పరిష్కారం చేసి తీరుతామని స్పష్టం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేసే కీలక హామీ మంగళగిరి నుంచి ప్రారంభిస్తున్నందుకు సంతోషంగా ఉందన్నారు. తొలిదశలో 3 వేల మందికి మంగళగిరిలోనే ఇళ్ల పట్టాలు, బట్టలు పెట్టి మరీ అందిస్తున్నామన్నారు. అధికారంలో లేనప్పుడే సొంత ఖర్చులతో 26 సంక్షేమ పథకాలు అందచేశామని అన్నారు. స్వచ్ఛ మంగళగిరి పేరిట స్వచ్ఛతలో మంగళగిరి దేశంలో మొదటి స్థానంలో ఉండేలా కృషి చేస్తున్నామన్నారు. ఇటీ-వల మంత్రివర్గంలో ఆమోదం పొందిన 100 పడకల ఆసుపత్రికి త్వరలో శంకుస్థాపన చేస్తామన్నారు. కేంద్ర - రాష్ట్ర ప్రభుత్వాల సాయంతో 50కి పైగా పథకాలు మంగళగిరిలో అమలయ్యేలా చర్యలు చేపట్టామన్నారు. అన్ని రంగాల్లో మంగళగిరిని నెంబర్ 1 స్థానంలో నిలబెట్టేందుకు స్థానిక ఎమ్మెల్యేగా కృషి చేస్తున్నానని తెలిపారు. రెడ్ బుక్ కోసం పోలీసులు పనిచేస్తే తప్పేముందని మంత్రి ప్రశ్నించారు. చట్టవిరుద్ధంగా పని చేసిన వారిని రెడ్ బుక్‌లో చేర్చుతామని నాడు చెప్పా.. ఇప్పుడు పోలీసులు చట్ట ప్రకారం పనిచేస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో రాజారెడ్డి రాజ్యాంగం పోయి తిరిగి అంబేద్కర్ రాజ్యాంగం అమలవుతోందన్నారు. రెడ్ బుక్ దెబ్బకి ఒకరికి గుండెపోటు వస్తే మరొకరు చెయ్యి విరకొట్టుకున్నారంటూ వ్యాఖ్యలు చేశారు. వైసీపీ కుట్రల పట్ల ప్రభుత్వంతో ప్రజలూ అప్రమత్తంగా ఉండాలన్నారు. కుల, మత ప్రాంత విద్వేషాలు రెచ్చగొట్టడంలో వైసీపీ నేతలు ఆరితేరారని మండిపడ్డారు. అందుకే ఫాస్టర్ ప్రవీణ్ మరణం దర్యాప్తుపై ఆయన కుటుంబసభ్యులు విశ్వాసం వ్యక్తం చేస్తున్నా, వైసీపీ రాజకీయ లబ్ది పొందాలని చూస్తోందన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని కుట్రలకు ఆ పార్టీ వెనుకాడదన్నారు. సొంత తల్లి, చెల్లికి సమాధానం చెప్పుకోలేని జగన్ ఇక ప్రజలకు ఏం చెప్తారని ప్రశ్నించారు. విజనరీ, పిజనరీకి తేడా ప్రజలు గమనిస్తున్నారన్నారు. విజనరీ భవిష్యత్తు తరాలు గురించి ఆలోచించి ఇప్పటి నుంచే కార్యాచరణ రూపొందిస్తారన్నారు. నాడు కంప్యూటర్‌లు అన్నం పెడతాయా అని విమర్శించిన వాళ్ళు ఉన్నారని అన్నారు. 90వ దశకంలో చంద్రబాబు ఏం చేశారో ఇప్పుడు చాలా మంది సమీక్షిస్తున్నారన్నారు. పీజనరీ చూపు ఎప్పుడు జైలు వైపు, విధ్వంసం వైపే ఉంటు-ంది కాబట్టి పీ4 ఫలాలు తెలియవంటూ మంత్రి లోకేష్ వ్యాఖ్యలు చేశారు. కాగా.. మంగళగిరిలో దశాబ్దాల సమస్యకు 10 నెలల్లో పరిష్కారం చూపారు మంత్రి లోకేష్. మొదటి విడతలో ప్రభుత్వ స్థలాల్లో నివసిస్తున్న 3 వేలమందికి శాశ్వత పట్టాలు అందజేయనున్నారు. స్వయంగా లబ్ధిదారుల నివాసానికి వెళ్లి పట్టా అందచేసేలా లోకేష్ ప్రణాళికలు రూపొందించారు. 12వ తేదీ వరకు నియోజకవర్గంలో మన ఇల్లు - మన లోకేష్ కార్యక్రమాన్ని మంత్రి లోకేష్ స్వయంగా చేపట్టనున్నారు.

## డ్రోన్ కార్పొరేషన్ స్వతంత్ర విభాగంగా ఏర్పాటు

**అనకాపల్లి జిల్లాలో క్యాపిటివ్ పోర్టుకు అనుమతి**

**ప్రీమియం హోటళ్ల బార్ లైసెన్స్ ఫీజు తగ్గింపు**

**మీడియా నూతన అక్రిడేషన్ల నిబంధనలకు ఆమోదం**

**ఎపి కేబినేట్‌లో పలు అంశాలపై చర్చ**

అమరావతి : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగిన ఏపీ కేబినెట్‌లో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. డ్రోన్ కార్పొరేషన్ స్వతంత్ర విభాగంగా ఏర్పాటుకు ఆమోదం తెలిపారు. అనకాపల్లి జిల్లాలో క్యాపిటివ్ పోర్టుకు కేబినెట్ అనుమతి ఇచ్చింది. విద్యుత్ శాఖలో రూ.710 కోట్ల రుణం కోసం హడ్కోకి ప్రభుత్వ గ్యారెంటీ ఇస్తూ కేబినెట్ ఆమోద ముద్ర వేసింది. సాగర్ ఎడుమ కాలువ రిటైనింగ్ వాల్ నిర్మాణానికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఏపీలో త్రీస్టార్ సహా ఇతర ప్రీమియం హోటళ్ల అభివృద్ధికి బార్ లైసెన్స్ ఫీజు తగ్గింపు ప్రతిపాదనకు మంత్రి వర్గం ఆమోదం తెలిపింది. యువజన సర్వీసులు, పర్యాటక, సాంస్కృతిక శాఖల్లో వివిధ జీవోల రేటిఫికేషన్‌కు కూడా ఏపీ కేబినెట్ ఆమోద ముద్ర వేసింది. మీడియా అక్రిడేషన్ల నూతన నిబంధనలకు ఆమోదం తెలిపింది. నాగార్జునసాగర్ ఎడమ కాలువపై చింతలపూడి ఎత్తిపోతల పథకంలో భాగంగా వెంపాడులో రిటైనింగ్ వాల్ నిర్మాణానికి సుమారు రూ.45 కోట్ల నిధుల మంజూరుకు ఆమోదం తెలిపింది. పోలవరం-బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టును జలహారతి కార్పొరేషన్ పేరిట ప్రత్యేక వాహక ప్రాజెక్టుగా పరిగణిస్తూ ఎపి కేబినెట్ ఆమోదం తెలిపింది. ఆంధ్రప్రదేశ్ డ్రోన్ కార్పొరేషన్‌ను (ఏపీడీసీ) ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఫైబర్‌నెట్ లిమిటె-డ్ (ఏపీఎస్ఎఫ్ఎల్) నుంచి విడదీసి స్వతంత్ర సంస్థగా ఏర్పాటు- చేసేందుకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. రాష్ట్రంలో డ్రోన్ సంబంధిత అంశాలన్నింటికీ నోడల్ ఏజెన్సీగా ఏపీడీసీ వ్యవహరించనుంది. యువజన, పర్యాటక శాఖ జీవోల ర్యాటిఫికేషన్‌కు ఆమోదం తెలిపింది. జలహారతి కార్పొరేషన్ ఏర్పాటు- చేసేందుకు ఆమోదం. జలహారతి కార్పొరేషన్ ద్వారా పోలవరం-బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టు రూపకల్పనకు ఆమోదం ఇచ్చింది. ఈ సమావేశంలో డిప్యూటీ-సిఎం పవన్ కళ్యాణ్, ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్, వివిధశాఖల మంత్రులు, ప్రభుత్వ ముఖ్య అధికారులు పాల్గొన్నారు.

## రామానాయుడు స్టూడియోస్‌కు షోకాజ్ నోటీసులు

**15.17 ఎకరాలను స్వాధీనం చేసుకోవాలని నిర్ణయం**

అమరావతి : విశాఖపట్నం రామానాయుడు స్టూడియోలో నివాస స్థలాల అంశంపై ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. నివాస స్థలాలుగా మార్పు చేయాలని తలపెట్టిన 15.17 ఎకరాల భూ కేటాయింపు రద్దు చేయాలని నిర్ణయించింది. నిర్దేశించిన ప్రయోజనం కోసం ఇచ్చిన భూమిని అప్రయోజనం కోసం వినియోగిస్తే రద్దు చేయాలన్న సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం.. రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్.పి. సిసోడియా ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు రామానాయుడు స్టూడియోకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని జిల్లా కలెక్టర్‌ను ఆర్పీ సిసోడియా ఆదేశించారు. తగినంత సమయం ఇచ్చి తరువాత చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. విశాఖలోని రామానాయుడు స్టూడియోలో 2023లో నివాస లే ఔట్ కు కేటాయించిన 15.17 ఎకరాలను స్వాధీనం చేసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది.. కేవలం ఫిలిం స్టూడియో, అనుబంధ అవసరాలకు మాత్రమే వాడాలని 2010లో సురేష్ ప్రొడక్షన్స్ కు మధురవాడ గ్రామ సర్వే నెంబర్ 336లో మొత్తం 34.44 ఎకరాల భూమిని కేటాయించింది.. అయితే, 2023 మార్చ్ లో 15.17 ఎకరాలలో నివాస లే ఔట్ కు ప్లాన్ అనుమతి పొందింది సురేష్ ప్రొడక్షన్స్.. ఫిలిం స్టూడియో అవసరాలకు మాత్రమే వినియోగించాల్సిన భూమిని ఇతర అవసరాలకు వాడటంపై ప్రభుత్వానికి ఫిర్యాదులు అందాయి.. విచారణ చేసి భూ వినియోగ మార్పు హక్కు రాష్ట్ర ప్రభుత్వానికి మాత్రమే ఉందని రెవెన్యూ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోడియా నివేదిక అందజేశారు..దీంతో, నిబంధనలు ఉల్లఘించినందుకు ఆ 15.17 ఎకరాల భూమిని స్వాధీనం చేసుకోవాలని ప్రభుత్వ నిర్ణయం తీసుకుంది.. మిగిలిన భూమిపైనా కఠినమైన నియంత్రణ ఉంటు-ందని ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది ఏపీ ప్రభుత్వం.. ఈ వ్యవహారంలో సురేష్ ప్రొడక్షన్స్‌కు షోకాజ్ నోటీసు జారీ చేయాలని జిల్లా కలెక్టర్‌కు ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది.. కమిషనర్లు భూస్వామ్య మార్పుకు అంగీకరించకూడదని ఆదేశించింది.. జిల్లా కలెక్టర్ తగిన చర్యలు తీసుకొని ప్రభుత్వానికి నివేదిక సమర్పించాలని.. రెవెన్యూ శాఖ ప్రత్యేక కార్యదర్శి సిసోడియా స్పష్టం చేశారు..

## సుప్రీం తీర్పు ప్రభుత్వానికి చెంపపెట్టు

హైదరాబాద్ : హెచ్‌సీయూ భూముల విషయంలో సుప్రీం తీర్పు ప్రభుత్వానికి చెంపపెట్టులాంటిదని బిజెపి ఎంపి రఘునందన్ రావు అన్నారు. ఓవైపు విద్యార్థులు, ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నా ప్రభుత్వం పెడచెవిన పెట్టిందన్నారు. విద్యార్థులకు భాజపా అండగా ఉంటుందని ఆ పార్టీ ఎంపీ రఘునందన్‌రావు తెలిపారు. హైదరాబాద్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ప్రభుత్వ తీరుపై హెచ్‌సీయూ విద్యార్థుల పోరాట ఫలితంగానే కోర్టు తీర్పు వచ్చిందన్నారు. యూనివర్సిటీ భూముల పరిరక్షణ కోసం మేం కూడా పోరాడతాం.

## రూ.859 కోట్ల రూపాయల దుర్వినియోగం

**రెండోరోజూ విచారణకు విజయకుమార్ రెడ్డి**

గుంటూరు : ఏపీ సమాచార శాఖ మాజీ కమిషనర్ విజయ్ కుమార్ రెడ్డి వరుసగా రెండో రోజు ఏసీబీ విచారణకు హాజరయ్యారు. ఏసీబీ ఇచ్చిన నోటీసుల మేరకు బుధవారం గుంటూరులోని ఏసీబీ రిజనల్ కార్యాలయానికి విచారణకు వచ్చారు. దాదాపు ఎనిమిది గంటల పాటు ఏసీబీ విచారణ కొనసాగింది. అయితే నిన్నటి విచారణకు విజయ్‌కు మార్ రెడ్డి సహకరించలేదని అధికారులు చెబుతున్నారు. దీంతో గురువారం మరోసారి విచారణకు పిలిచారు. ఉదయం 10:30 గంటల తర్వాత రెండో రోజు విచారణకు విజయ్ కుమార్ హాజరయ్యారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో సమాచార శాఖ కమిషనర్‌గా పనిచేసి విజయ్ కుమార్ రెడ్డి.. మొత్తం రూ.859 కోట్ల రూపాయలను ప్రభుత్వ ప్రకటన రూపంలో ఖర్చు చేయగా.. వాటిలో 50 శాతం వరకు కేవలం సాక్షి పత్రిక, సాక్షి మీడియాకు మాత్రమే కేటాయించారు. అంతే కాకుండా మిగిలిన 50 శాతం కూడా అత్యధిక శాతం వైసీపీకి అనుకూలంగా పనిచేసే మీడియా సంస్థలకే కట్టబెట్టారు. ఈ కేసులోనే విజయ్‌కుమార్‌ను ఏసీబీ విచారిస్తోంది. 2019 - 24 మధ్యకాలంలో 859 కోట్ల రూపాయల ప్రభుత్వ ధనం దుర్వినియోగం చేసినట్టు- విజిలెన్స్ నివేదిక ఇచ్చింది. విజిలెన్స్ నివేదిక ఆధారంగా కేసు నమోదు చేసిన ఏసీబీ అధికారులు.. అప్పటి ఐ అండ్ పీఆర్ సమాచార కమిషనర్ విజయ్ కుమార్ నోటీసులు ఇచ్చారు.ఎవరి ప్రోద్భలంతో చేశారు.. ఎందుకు చేశారు అనే దాన్ని ఏసీబీ కూపీ లాగుతోంది. ఈ వ్యవహారానికి సంబంధించి విజయ్ కుమార్‌ను కొన్ని ప్రశ్నలు అడుగగా.. ఆయన మౌనం దాల్చినట్లు తెలుస్తోంది. ఎలాంటి సమాధానం చెప్పకుండా ఉండటంతో గత ప్రభుత్వంలో సాక్షి మీడియాకు, వైసీపీ అనుకూల మీడియాకు ఇచ్చిన ప్రభుత్వ ప్రకటనల రికార్డులను కూడా ఆయన ముందు ఉంచి ప్రశ్నించారు. అయినప్పటికీ విజయ్ కుమార్ ఎలాంటి సమాధానాలు ఇవ్వనట్లు తెలుస్తోంది. దీంతో ఈరోజు మరోసారి విచారణకు రావాల్సిందిగా విజయ్ కుమార్‌కు ఏసీబీ అధికారులు చెప్పారు. ఈ నేపథ్యంలోనే ఉదయం విచారణ నిమిత్తం ఏసీబీ ఆఫీసుకు వచ్చారు. ఎవరి ప్రోద్భలంతో, ఎవరు ఆదేశాల మేరకు ప్రభుత్వ ధనాన్ని దాదాదత్తం చేశారని విజయ్ కుమార్‌ను ప్రశ్నించి.. ఆయన నుంచి సమాధానాలు రాబట్టే ప్రయత్నం చేయనున్నారు. అయితే ఏసీబీ అడిగిన ప్రశ్నలకు విజయ్ కుమార్ ఎంత మేరకు సమాధానాలు ఇస్తారో వేచి చూడాలి.

## తిరుపతి-పళని బస్ సర్వీస్ ప్రారంభం

**పుణ్యక్షేత్రాల సందర్శనకు మంచి అవకాశం**

**మంగళగిరిలో ప్రారంభించిన డిప్యూటీ సిఎం పవన్**



అమరావతి : తిరుపతి - పళని బస్సు సర్వీసును డిప్యూటీ- సీఎం పవన్ కళ్యాణ్ ప్రారంభోత్సవం చేశారు. భక్తుల అవసరాలను అర్థం చేసుకున్నాను.. అందుకే తిరుపతి-పళని బస్సు సర్వీసును ప్రారంభిస్తున్నాం అన్నారు.. మంగళగిరి జనసేన కార్యాలయంలో తిరుపతి - పళని బస్సు సర్వీస్ ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించారు.. ముఖ్య అతిథిగా డిప్యూటీ- సీఎం పవన్ కళ్యాణ్ హాజరుకాగా.. ఈ కార్యక్రమంలో మంత్రి రాంప్రసాద్ రెడ్డి, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ, ఎండీ ద్వారకా తిరుమలరావు పాల్గొన్నారు.. కార్యక్రమంలో భాగంగా జ్యోతి ప్రజ్వలన చేసిన డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కు వేద ఆశీర్వచనం చేశారు వేద పండితులు.. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ.. మురుగన్ ఆలయాల సందర్శనలో భాగంగా పళని ఆలయానికి వెళ్లినప్పుడు కొందరు భక్తులు తిరుపతి బస్సు కావాలని విజ్ఞప్తి చేశారు.. భక్తుల విజ్ఞప్తి మేరకు సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లగానే ఆమోదించారు.. తిరుపతి - పళని బస్సు సర్వీస్ ప్రారంభించటం ఆనందకరంగా ఉందన్నారు.. మురుగన్ భక్తుల కోరిక బలీయంగా ఉంది కాబట్టే అనుకున్న అర గంటలోనే శాంక్షన్ వచ్చింది.. ఇది భక్తులకు చాలా సౌకర్యంగా ఉంటుంది.. ఎంతో కాలంగా పళని వాసులు తిరుపతి బస్సు సర్వీస్ కోసం ఎదురు చూశారు.. ఫిబ్రవరిలో నేను వెళ్లిన సమయంలో భక్తుల అవసరాలను అర్థం చేసుకుని బస్సు ఏర్పాటు- చేశాం అన్నారు.. కొత్త సర్వీస్ తో ప్రయాణ సమయం తగ్గుతుంది.. ఈ బస్సుతో సమీప ఆలయాలు కూడా సందర్శించవచ్చు.. ఈ బస్సు వల్ల రెండు ప్రాంతాల భక్తులకు ఉపయోగకరంగా ఉంటు-ంది.. బస్సు సర్వీస్ కు తోడ్పడిన సీఎం చంద్రబాబుకు డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్..ధన్యవాదాలు తెలిపారు

## హైకోర్టులోనూ కొనసాగిన విచారణ

**7వతేదీకి వాయిదా వేసిన హైకోర్టు**

హైదరాబాద్ : కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంపై హైకోర్టులో గురువారం మరోసారి విచారణ జరిగింది. 400 ఎకరాల్లో చెట్ల నరికివేత పనులు ఆపాలని దాఖలైన పిటిషన్లపై హైకోర్టు స్టే విధిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. కేసు విచారణను ఈ నెల 7వ తేదీకి వాయిదా వేసింది. అప్పటి వరకు ఆ భూముల్లో ఎలాంటి పనులు చేపట్టవద్దని ఆదేశించిన కోర్టు.. అప్పటిలోగా కౌంటర్ దాఖలు చేయాలని సూచించింది. హైకోర్టులో దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యాలపై కౌంటర్ దాఖలు చేసేందుకు ఏజీ హైకోర్టును గడువు కోరారు. ఈ మేరకు కోర్టు కేసును వాయిదా వేసింది. ఇదిలా ఉండగా.. ఈ భూముల వ్యవహారంలో సుప్రీంకోర్టులోనూ విచారణ జరిగిన విషయం తెలిసిందే. సెంట్రల్ యూనివర్సిటీ వద్ద ఉన్న 400 ఎకరాల్లోని చెట్లను నరికి వేస్తున్నారని.. అడ్డుకోవాలంటూ సుప్రీంకోర్టులోనూ పిటిషన్ దాఖలైంది. పిటిషన్‌పై అత్యవసర విచారణ చేపట్టాలని పిటిషనర్ తరఫు న్యాయవాదులు సుప్రీంకోర్టును కోరారు. ప్రభుత్వం పనులు చేపడుతున్న స్థలాన్ని సందర్శించి నివేదిక ఇవ్వాలని హైకోర్టు రిజిస్ట్రార్‌ను సర్వోన్నత న్యాయస్థానం ఆదేశించింది. అప్పటి వరకు చెట్లను నరికివేయొద్దని ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ విషయంపై ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వి వాదనలు వినిపించారు. దీనిపై హైకోర్టులో విచారణ జరుగుతోందని సుప్రీంకోర్టుకు తెలుపగా.. హైకోర్టులో జరిగే విచారణపై తాము ఎలాంటి స్టే ఇవ్వడం లేదని జస్టిస్ బీర్ గవాయ్ స్పష్టం చేశారు.

## కాకాణికి హైకోర్టులో ఎదురుదెబ్బ

**చర్యలు తీసుకోకుండా అడ్డుకోలేమన్న కోర్టు**

అమరావతి : వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డికి హైకోర్టులో మరోసారి ఎదురుదెబ్బ తగిలింది.. కాకాణిపై తొందరపాటు- చర్యలు తీసుకోకుండా మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయలేమని పేర్కొంది హైకోర్టు.. కాకాణి ముందస్తు బెయిల్, క్వాష్ పిటిషన్లు విచారించిన ఏపీ హైకోర్టు .. తెల్లారాయి అక్రమ రవాణాకి సహకరిచటంతో పాటు ఎస్సీ ఎస్టీ కేసును కాకాణిపై పొదలకూరు పోలీసులు నమోదు చేశారు.. అయితే, కాకాణి పిటిషన్ కు విచారణ అర్హత లేదని వాదించారు అడ్వొకట్ జనరల్.. ఎస్సీ ఎస్టీ కేసులో మొదట స్పెషల్ కోర్టు కి వెళ్ళాలన్న ఏజీ.. కాకాణి నేరుగా హైకోర్టులో పిటిషన్ వేశారని.. ఆ పిటిషన్ కు విచారణ అర్హత లేదని వాదించారు.. మొదట స్పెషల్ కోర్టు రిజెక్ట్ లేదా రిటర్న్ చేస్తే మాత్రమే హైకోర్టులో పిటిషన్ వేయాలి అంటు-ంది ప్రభుత్వం.. గతంలో పలు కోర్టులు ఇచ్చిన జడ్జిమెంట్ లు ఈ సందర్భంగా ఏజీ ఉదాహరించారు.. అయితే, స్పెషల్ కోర్టులకు వెళ్లకుండా నేరుగా హైకోర్టులో పిటిషన్ వేసే వెసులుబాటు- ఉందని కోర్టుకి తెలిపారు కాకాణి.. సెక్షన్ 18 కేసులో నమోదు చేశారని అది ఉంటే సెక్షన్ 14 అప్లికబుల్ కాదని కోర్టుకు తెలిపారు కాకాణి లాయర్.. ఈ కేసు విషయంలో స్పెషల్ కోర్టు పరిధి కంటే హై కోర్టుకి పరిధి, పవర్ ఎక్కువ ఉన్నాయన్న కాకాణి తరఫు లాయర్ వాధించారు.. కొన్ని కేసుల్లో సుప్రీం కోర్టు మధ్యంతర ఉత్తర్వులు కూడా ఇచ్చినట్టు- కోర్టు దృష్టికి తెచ్చారు.. పిటిషన్ విచారణ అర్హత తర్వాత మెరిట్స్ మీద విచారణ చేస్తామన్న కోర్టు.. తెల్లారాయి అక్రమ మైనింగ్ ప్రభుత్వానికి చెందిన 32 ఎకరాల్లో వేరే వ్యక్తులు చేస్తున్నారని, దానికి కాకాణికి సంబంధం లేదన్నారు.. 2016లో లీజు సమయం ముగిసిందని అప్పటి నుంచి ఇది జరుగుతున్నట్టు కోర్టు దృష్టికి తెచ్చిన లాయర్.. అయితే, అప్పటి నుంచి మైనింగ్ అధికారులు చర్యలు తీసుకోలేదా? అని హైకోర్టు ప్రశ్నించింది.. స్థానికంగా నివసిస్తున్న వారిపై కులం పేరుతో తిట్టారనేది కేవలం ఆరోపణ మాత్రమే అని పేర్కొన్నారు.. ఇక, తదుపరి విచారణ రేపటికి వాయిదా వేసిన ఏపీ హైకోర్టు.. ఈలోపు తొందరపాటు- చర్యలు తీసుకోకుండా మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని కాకాణి లాయర్ కోరగా నిరాకరించింది.

## మూడున్నరేళ్లు కాదు..30 ఏళ్ల తరవాత కూడా విపక్షమే

**అధికారంలోకి వస్తామన్నది పగటి కలలే**

**కెటిఆర్ వ్యాఖ్యలను తిప్పికొట్టిన బల్మూరి వెంకట్**

హైదరాబాద్ : మరో మూడున్నరేళ్ల తరవాత మాదే అధికారం అని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కెటిఆర్ చేసిన వ్యాఖ్యలను కాంగ్రెస్ ఎమ్మెల్సీ బల్మూర్ వెంకట్తిప్పి కొట్టారు.. బీఆర్ఎస్ మూడున్నరేళ్ల తర్వాతేకాదు.. ముప్పై ఏళ్ల దాకా ప్రతిపక్షంలోనే ఉంటుందని తెలిపాడు. గురువారం నాడాయన మీడియాతో మాట్లాడుతూ.. మీరు చేసిన విధ్వంసానికి మళ్లీ ప్రజలు మిమ్మల్ని క్షమించే పరిస్థి లేదు. కేటీఆర్ ఇంకా అధికారంలో ఉన్నామనే భ్రమలోనే ఉన్నారు. మూడున్నరేళ్ల తర్వాత భూములను గుంజుకుంటా అంటున్నడు.. 15నెలల కిందటే ప్రజలు నీ అధికారం గుంజుకున్నది మరిచిపోయినవా అని ప్రశ్నించారు. గతంలో బీఆర్ఎస్ ధారాదత్తం చేసిన భూములను కూడా ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటదనేదే కేటీఆర్ భయం.. అందుకే అసత్య ప్రచారంతో విద్యార్థులను రెచ్చగొడుతున్నారు.. కవిత, కేటీఆర్, హరీశ్ రావు పోటీ పడుతున్నరు, వాళ్ల మధ్యే అధిపత్యపోరు నడుస్తోంది.. ధరణీపేరుతో రాష్ట్రంలోని లక్షలాది ఎకరాల భూములను మాయం చేసిన చరిత్ర మీది.. హైదరాబాద్ చుట్టు విలువైన వందల ఎకరాల భూములను అమ్ముకున్న చరిత్రమీది.. మల్లన్న సాగర్ లో ఊర్లకు ఊర్లనే తీసేసిన చరిత్ర మీది.. కాళేశ్వరం కోసం 7వేల ఎకరాల అటవీ భూములు తీసుకున్నది మీ ప్రభుత్వమే.. రాష్ట్రంలో లక్షల ఎకరాల దేవాదాయ భూములు, అసైన్డ్ భూములను చరబట్టిన చరిత్రమీదని ఘాటు విమర్శలు చేశారు. ప్రభుత్వ భూములను ప్రైవేట్ వ్యక్తులకు ధారాదత్తం చేసిన చరిత్ర బీఆర్ఎస్ పాలకులది.. ప్రైవేట్ వ్యక్తుల కబ్జాలో ఉన్న ప్రభుత్వ భూములను తిరిగి తెచ్చిన చరిత్ర కాంగ్రెస్ పాలకులది.. ప్రైవేట్ వ్యక్తులకు వెళ్లకుండా 400 ఎకరాల భూమిని న్యాయ స్థానంలో కొట్లాడి ప్రభుత్వానికి దక్కేలా చేసిన ఘనత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిది.. గతంలో ఏ ముఖ్యమంత్రి కూడా ఈ భూమిని ప్రైవేట్ వాళ్ల చేతుల్లోంచి వెనక్కి తీసుకొచ్చే ప్రయత్నం చేయలేదు.. బీఆర్ఎస్, బీజేపీ నేతలు చేస్తున్న అసత్యప్రచారంపై యువకులు, నిరుద్యోగులే వారికి సమాధానం చెప్తారని బల్మూరి వెంకట్ వెల్లడించారు.

## బిసి రిజర్వేషన్ల కోసం పోరాడుతాం

**రాష్ట్ర కాంగ్రెస్ నేతలకు రాహుల్ హామీ**

న్యూఢిల్లీ : బీసీ రిజర్వేషన్ల కోసం పార్లమెంటులో కొట్లాడుతామని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. గురువారం పార్లమెంట్‌లో అగ్రనేతలు సోనియా,రాహుల్ ను రాష్ట్ర కాంగ్రెస్ నాయకుల బృందం కలిసింది. బుధవారం జంతర్ మంతర్ లో బీసీ రిజర్వేషన్ల ధర్నా వివరాలను పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, మంత్రులు, విప్ ఆది శ్రీనివాస్ కాంగ్రెస్ అగ్రనేతలకు వివరించారు. ఈ సందర్భంగా రాహుల్ గాంధీ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రిజర్వేషన్ల విషయంలో అనుసరిస్తున్న వైఖరిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ మాట్లాడుతూ.. ప్రజాసంక్షేమమే ధ్యేయంగా పనిచేయాలని సూచించారు. తెలంగాణ ప్రజలు కాంగ్రెస్ వెన్నంటే ఉన్నారని అన్నారు. మేలు చేస్తే మరచిపోరని చెప్పారు. రిజర్వేషన్లు బడుగు బలహీన వర్గాల్లో జీవితాల్లో మార్పులు తెస్తాయని అన్నారు. మరింత కష్టపడి అందరికీ సంక్షేమ ఫలాలను పంచాలని సూచించారు. ఈ సందర్భంగా తనను కలిసి రాష్ట్ర నాయకులను సోనియా గాంధీ ఆప్యాయంగా పలకరించారు.




# ఆహాలో హోంటౌన్ వెబ్ సీరిస్

## పాతరోజులు గుర్తుకు వచ్చాయన్న రాజీవ్ కనకాల

రాజీవ్ కనకాల, ఝాన్సీ ప్రధాన పాత్రల్లో నటించిన వెబ్ సిరీస్ 'హోం టౌన్' మనసుని హత్తుకునే కుటుంబ కథతో రూపొందింది. ఈ సిరీస్‌కు శ్రీకాంత్ దర్శకత్వం వహించారు. ఆహా వేదికగా శుక్రవారం నుంచి ఇది స్ట్రీమింగ్ కానుంది. ఈ నేపథ్యంలోనే గురువారం మీడియా వాళ్ల కోసం ప్రత్యేకంగా సిరీస్‌ను ప్రదర్శించారు. ఈ సందర్భంగా రాజీవ్ కనకాల మాట్లాడారు. ఇది తప్పకుండా ప్రేక్షకులకు నచ్చుతుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. సిరీస్ చూసిన తర్వాత ప్రేక్షకులకు చిన్ననాటి రోజులు గుర్తుకు వస్తాయన్నారు. మేము కూడా ఇప్పుడే ఈ సిరీస్‌ను పూర్తిగా చూశాం. కొన్ని ఎపిసోడ్స్ చూస్తుంటే 35 సంవత్సరాలు వెనక్కి వెళ్లిపోయాను. నా చిన్ననాటి లవ్‌స్టోరీలు, స్నేహితులతో చేసిన అల్లరి అన్నీ గుర్తుకువస్తున్నాయి. నటీనటులందరూ చక్కగా యాక్ట్ చేశారు. శ్రీకాంత్ దీనిని ఎంతో హృద్యంగా రూపొందించారు. మాతోపాటు- సిరీస్ చూసిన వారి రియాక్షన్స్ చూసి ఆనందంగా అనిపించింది. సిరీస్‌ను రూపొందించడంలో నిర్మాత మాకెంతో సపోర్ట్‌గా నిలిచారని రాజీవ్ తెలిపారు. అనంతరం నిర్మాత నవీన్ మాట్లాడుతూ.. తర్వాత సంస్థ నుంచి వస్తోన్న వెబ్ సిరీస్ ఇది. అందులో యాక్ట్ చేసిన ముగ్గురు పిల్లలు ఓవర్ నైట్‌లో స్టార్స్ అయ్యారు. అదే ఇప్పుడు రిపీట్ కావాలని కోరుకుంటు-న్నా. ఈ సిరీస్‌లో రాజీవ్ గారి పాత్ర.. మొదటి నుంచి లాస్ట్ వరకూ ఉంటుంది. ఆ సిరీస్‌కు ఎంతటి పాపులారిటీ వచ్చిందో ఈ సిరీస్‌కూ వస్తుందని భావిస్తున్నా అని అన్నారు.



# స్పిరిట్‌లో రామ్‌గోపాల్ వర్మ ?

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ హీరోగా, డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా కాంబోలో 'స్పిరిట్' అనే భారీ చిత్రం తెరకెక్కబోతున్న విషయం తెలిసిందే. ఈ సినిమా ప్రకటన వచ్చినప్పటి నుంచి షూటింగ్ ఎప్పుడు మొదలవుతుందా ? అని ఎదురుచూస్తున్నారు ఫ్యాన్స్. అయితే రీసెంట్ గా ఉగాది పండుగా వేడుకలలో పాల్గోన్న సందీప్ మాట్లాడుతూ.. ప్రభాస్ స్పిరిట్ సినిమా షూటింగ్‌ను మెక్సికోలో జరుపబోతున్నట్లు- ప్రకటించాడు. ఇంతకంటే ఏం అప్‌డేట్ ఇవ్వలేమని తెలిపాడు. ఇదిలా ఉంటే ఈ మూవీలో స్పెషల్ క్యారెక్టర్ చేయబోతున్నారనే వార్తలపై తాజాగా దర్శకుడు రామ్ గోపాల్ వర్మ స్పందించాడు. వర్మ ఇంతకు ముందు ప్రభాస్ 'కల్కి 2898 ఏడీ' చిత్రంలో స్పెషల్ క్యామియో చేసిన సంగతి తెలిసిందే. చీఫ్ చింటు అనే స్ట్రీట్ ఫుడ్ వ్యాపారిగా ఆయన ఈ మూవీలో కనిపించాడు. ఆయన కనిపించిన సీన్స్ కొద్ది సేపే అయిన థియటర్లో ఆడియన్స్ నుంచి మంచి రెస్పాన్స్ వచ్చింది. దీంతో సందీప్ రెడ్డి తీస్తున్న 'స్పిరిట్' సినిమాలోనూ ఆర్జీవీ నటిస్తారని టాక్ నడిచింది. ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న వర్మ.. ప్రభాస్ తో మరోసారి కలిసి స్క్రీన్ షేర్ చేసుకోవడం పై క్లారిటీ- ఇచ్చాడు.. ' 'స్పిరిట్' సినిమాలో నేను ఓ క్యారెక్టర్ ప్లే చేస్తున్నాననే వార్త చాలా రోజులుగా వింటు-న్నాను. కానీ ఇందులో ఏమాత్రం నిజం లేదు. ఎందుకంటే అసలు నేను సందీప్ వంగాని ఎప్పుడూ అడగలేదు. దాని గురించి నాకు ఏమీ తెలియదు. నాకు అశ్వినీ దత్, ప్రభాస్ తెలుసు. సరదాగా 'కల్కి' లో చేయమని అడిగారు.. చేశాను అంతే. దాని కోసం పెద్దగా ఆలోచించి చేసిందేమీ లేదు. కానీ 'కల్కి' సినిమాలో నా పాత్రకి జనాల నుంచి వచ్చిన రియాక్షన్ చూసి సర్ప్రైజ్ అయ్యాను' అని క్లారిటీ- ఇచ్చారు వర్మ.





# హిట్-3లో కార్తీ ఎంట్రెన్స్

అగ్ర కథానాయకుడు నాని ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా చిత్రం హిట్ 3. బ్లాక్ బస్టర్ ఫ్రాంచైజీ హిట్ నుంచి వస్తున్న 3వ చిత్రమిది. ఈ చిత్రంలో నాని కథానాయకుడిగా నటించడంతో పాటు నిర్మాణ బాధ్యతలు చేపట్టాడు. శైలేశ్ కొలను దర్శకత్వంలో ఈ సినిమా రాబోతుండగా.. మే 1న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. అయితే ఈ సినిమాకు సంబంధించి తాజాగా ఒక వార్త వైరల్‌గా మారింది. ఈ సినిమాలో తమిళ నటుడు కార్తీ అతిథి పాత్రలో కనిపించబోతు న్నట్లు తెలుస్తుంది. కొందరు ఏమో కార్తీ నానితో కలిసి కనిపిస్తాడని ప్రచారం చేస్తుం డగా.. మరికొందరు కార్తీ పోలీస్ ఆఫీసర్ పాత్రలో కనిపించవచ్చని అంటున్నారు. 'హిట్ 3' క్లైమాక్స్ లో కొత్త హీరో ఎంట్రీ ఇస్తాడని ఆ హీరో పాత్రలోనే కార్తీ రాబోతున్నాడని.. ఇది 'హిట్ 4' కి లీడ్ ఇస్తుందని కూడా టాక్ నడుస్తుంది. కాగా దీనికి సంబంధించి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ఇక హిట్ 3 విషయానికి వస్తే.. - క్రై-మ్ థ్రిల్లర్ బ్యాక్‌డ్రాప్‌తో రానున్న ఈ సినిమాలో నాని అర్జున్ సర్కార్ అనే పవర్‌ఫుల్ ఐపీఎస్ అధికారిగా కనిపించనున్నారు. కన్నడ బ్యూటీ- శ్రీనిధి శెట్టి ఈ సినిమాలో కథానాయికగా నటిస్తుంది. ఆ మధ్య రిలీజ్ చేసిన హిట్ 3 -ట్రైలర్ విశేషంగా ఆకట్టు-కుంది. అవుట్ అండ్ అవుట్ యాక్షన్ ఎంటర్‌టైనర్ గా వచ్చిన హిట్ 3 -ట్రైలర్ అందరిని ఆశ్చర్యపరిచింది. నేచురల్ స్టార్ కాస్త మోస్ట్ వైలెంట్ స్టార్ గా మారాడనే కామెంట్స్ వినిపించాయి. ఈ సినిమాలో నాని తో పాటి మరొక స్టార్ హీరో కూడా నటిస్తున్నాడట. కోలీవుడ్ స్టార్ హీరో అయిన కార్తీకి టాలీవుడ్ లో మంచి మార్కెట్ ఉంది. ఈ స్టార్ హీరో సినిమాలు తమిళ్ తో పాటు తెలుగులోను మంచి కలెక్షన్స్ రాబడతాయి. కాగా సర్దార్, వా వాతియార్ వంటి సినిమాలో పోలీస్ రోల్ లో అదరగొట్టిన కార్తీ ఇప్పుడు హిట్ 3 లో ఓ ముఖ్య పాత్రలో కనిపించబోతున్నాడని సమాచారం. త్వరాలోనే అందుకు సంబంధించి త్వరలోనే అధికారకే ప్రకటన రానుంది. భారీ బడ్జెట్ పై తెరకెక్కుతున్న ఈ సినిమాను వరల్డ్ వైడ్ గా మే 9 న రిలీజ్.కానుంది

# సిద్దార్థ్....భాస్కర్ మధ్య గ్యాప్

**అదంతా సినిమాలో మామూలే అని వివరణ**

సిద్దార్థ్ జొన్నలగడ్డ హీరోగా నటిస్తూ, బొమ్మరిల్లు భాస్కర్ దర్శకత్వంలో 'జాక్' అనే సినిమా రూపొందింది. ఈ నెల 10న విడుదల కానున్న ఈ చిత్రం చిత్రీకరణ సమయంలో వీరిద్దరి మధ్య గ్యాప్ పెరిగిందని, సిద్ధార్థ్, దర్శకత్వంలోనూ ఆసక్తి చూపిస్తూ సృజనాత్మక పనుల్లో ఎక్కువగా పాల్గొంటున్నాడని, ఇది భాస్కర్‌కు అసంతృప్తి కలిగించిందని, ఒక పాటను భాస్కర్ లేకుండా చిత్రీకరించారని సోషల్ మీడియాలో రకరకాల వార్తలు వ్యాపించాయి. ట్రైలలర్ విడుదల కార్యక్రమంలో సిద్ధార్థ మరియు భాస్కర్ ఈ అంశంపై స్పష్టత ఇచ్చేందుకు ప్రయత్నించారు. సినిమా అనేది టీం వర్క్ తో కూడిన పక్రియ, అందరూ చిత్రం కోసం శ్రమిస్తారు, తమ డిస్కషన్ గదిలోకి వెళ్తే అది ఒక యుద్ధ రంగంలా అనిపిస్తుందని, సినిమా కోసం తాము వాదించుకుంటాం, తిట్టుకుంటాం కొట్టుకునేదాకా వెళ్తాము, కానీ ఆ గది నుంచి బయటకు వచ్చిన తర్వాత అన్నీ మర్చిపోతామని భాస్కర్ అన్నారు. సిద్ధార్థ్‌కు అన్ని విషయాలపై లోతైన అవగాహన ఉందని, అది సినిమాకు ఒక బలంగా మారుతుందని, ఒక సన్నివేశాన్ని అతనికి అప్పగించి నిశ్చింతగా ఉండవచ్చని, కెమెరా వద్ద 'రోలింగ్..కట్' అని చెప్పడమే సరిపోతుందని భాస్కర్ అభిప్రాయపడ్డారు. సిద్ధార్థ కూడా గండిపేట వద్ద ఒక పాటను దర్శకుడు లేకుండా తీశామని, అయితే ఆ సమయంలో భాస్కర్ ఎడిటింగ్ పనుల్లో నిమగ్నమై ఉన్నారని అన్నారు, 'మీరు ఏసీ గదిలో పని చేయండి, మేము ఎండలో కష్టపడతాం' అని ఇద్దరూ సరదాగా మాట్లాడు కున్నామని, భాస్కర్‌కు తెలియకుండా లేదా ఆయన అనుమతి లేకుండా సాంగ్ షూట్ ఎలా సాధ్యమవుతుందని సిద్దూ జొన్నలగడ్డ మీడియాను ప్రశ్నించారు.






## రాహుకేతు పూజలో పాల్గొన్న పూజాహెగ్డే

శ్రీకాళహస్తీశ్వర ఆలయాన్ని సినీ నటి పూజా హెగ్డే దర్శించుకున్నారు. కుటుంబ సభ్యులతో కలసి ఆమె రాహుకేతు సర్ప దోష నివారణ పూజలు చేశారు. అనంతరం శ్రీ వాయు లింగేశ్వర స్వామి సమేత శ్రీ జ్ఞాన ప్రసూనాంబిక దేవిని దర్శించుకున్నారు. వేద పండితులు ఆశీర్వచనం, తీర్థ ప్రసాదాలను అందజేశారు. ప్రముఖ హీరోయిన్ పూజా హెగ్డే అనతి కాలంలోనే దాదాపు అందరు స్టార్ హీరోలతో నటించిన ఈ అమ్మడుకి ఇప్పుడు తెలుగు సినిమాలలో అవకాశాలు తగ్గాయి. ఎంత త్వరగా తెలుగులో మార్కెట్ వచ్చిందో అంతే త్వరగా తన ఫేమ్ కూడా పోగొట్టుకుందని చెప్పాలి. హెగ్డే దాదాపు రెండున్నరేళ్ల నుంచి తెలుగు సినిమాలో కనిపించలేదు. ఇక ఇలా తెలుగు సహా సౌత్ సినిమాల్లో కనుమరుగు అయిపోయింది అనుకున్న పూజా హెగ్డే, మళ్ళీ ఇపుడు వరుస సినిమాలు లైన్ లో పెట్టింది. కోలీవుడ్ స్టార్ హీరో సూర్య నటిస్తున్న 'రెట్రో' లో హీరోయిన్ గా కనిపిస్తుంది. అలాగే, రజినీకాంత్ 'కూలీ' సినిమాలో పూజా స్పెషల్ సాంగ్ చేయనుంది. రాఘవ లారెన్స్ 'కాంచన 4' మూవీలో కూడా నటించనున్నట్లు సమాచారం. అలాగే హిందీలో కూడా ఓ మూవీ చేస్తోంది. అయితే అవకాశాలు వచ్చాయి కానీ అవి ఎంతవరకు హిట్ అనేది విడుదల అయిన తర్వాత తెలుస్తుంది. దీంతో తాజాగా ఈ అమ్మడు తన కెరీర్ కోసం ప్రత్యేక పూజలో పాల్గొంటుంది.

Printed, Published & Owned by B. Srinivas, Printed at Abhyudaya Publications,& Printers Algunoor, MDI: Thimmapur District, Karimnagar. 505001(T.S) Published at H.NO. 6-3-289,Kishan Nagar, Karimnagar MDI: District karimnagar- 505001(T.S) Editor: B.Srinivas, RNI NO. APTEL/2006/18964, Cell : 7989575563, Mail:thecrimenews123@gmail.com